ఆంధ్రప్రదేశ్



ఫిబ్రవరి 1972

50 పైసలు



ఆంధ్ర ప్రదేశ్

సంపుటి : 16

ఫిబ్రవరి, 1972
మాఘం - ఫాల్గుణం, 1893

సంచిక : 4

ప్రధాన సంపాదకులు :
పెండ్యాల వామనరావు

సంపాదకులు :
కప్పగంతుల లక్ష్మణశాస్త్రి

ముఖ చిత్రం :
ప్రధానితో ముఖ్యమంత్రి

రెండవ అట్ట :
ఉలిపదును వేటులో ఊడిపడిన నంది

నాల్గవ అట్ట :
సుందర సరస్తీరంలో

వెల : 50 పైసలు

రిజిష్టరు నెం : 133

ఈ సంచికలోని రచయితలు వెలిబుచ్చిన అభిప్రాయాలు తప్పనిసరిగా ప్రభుత్వానికి సంబంధించినవిగా భావించ నక్కర లేదు

35-1

సంచికలో

పేజీ

మన ఉన్నత ఆశయాలు, సంస్కృతి

ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ, ఇటీవలి యుద్ధంలో కీలకపాత్ర వహించిన తూర్పు ప్రాంత నౌకాదళ ప్రధాన కేంద్రమైన విశాఖపట్టణంనుంచి, ఏడుకొండల స్వామి వెలసిన తిరుపతి క్షేత్రాన్ని దర్శించి, ప్రజల భాగ్యోన్నతికై ఆయన ఆశీర్వాదాలు అర్థించేవరకు విజయోత్సాహ పూరితమైన పర్యటన సాగించి ఆంధ్రప్రదేశ్ ప్రజలను సమ్మోహితులను చేశారు. ఆమె ఎక్కడకు వెళ్ళినా ప్రజలు తండోప తండాలుగా వచ్చి ఆమెకు అఖండ స్వాగతమిచ్చారు. లోక్ సభకు మధ్యంతర ఎన్నికలు జరిగిన తరువాత కేంద్రంలో బలీయమైన, సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పడినందువల్లనే పాకిస్తాన్ మన దేశంపై దురాక్రమణ జరిపినప్పుడు దానిని స్థిరచిత్తంతో ఎదుర్కొని విజయలక్ష్మిని చేపట్టడం సాధ్యమైందని ఆమె ప్రజలకు చెప్పారు. రాష్ట్రాలలో కూడా జాతీయ విధానాలను గట్టిగా అమలు పరచగలిగిన సుస్థిరమైన ప్రభుత్వాలు ఏర్పడినప్పుడే దేశం సత్వరాభివృద్ధి సాధించడానికి వీలుకలుగుతుందని కూడా ఆమె ప్రబోధించారు.

శ్రీమతి గాంధీ విశాఖపట్టణంలో, మన రాష్ట్రంలోని ముఖ్యమైన అభివృద్ధి ప్రాజెక్టులలో ఒకటిగా అవతరించనున్న రూ 50 కోట్ల ఔటర్ హార్బరుకు శంకుస్థాపనచేశారు. అలాగే దేశంలోని పుణ్యక్షేత్రాలలో మేటియైన తిరుపతి క్షేత్రంలో యాత్రికులకు వరప్రసాదం అనదగిన కళ్యాణి నీటి సరఫరా పథకానికికూడా శంకుస్థాపన చేశారు. ఇది 5 కోట్ల ఖర్చుతో కూడిన ప్రాజెక్టు అయినప్పటికీ దీనికి శంకుస్థాపన చేయడానికి ప్రధానమంత్రి అంగీకరించారంటే దీనివల్ల, సామాన్య ప్రజానీకానికి లాభదాయకమైనటువంటి ఏ పథకాలలో పాలుపంచుకోవడానికైనా ఆమె ఆతృత చూపుతారని ద్యోతక మవుతున్నది. మన సంప్రదాయాలపట్ల, సాంస్కృతిక వారసత్వంపట్ల ఆమెకుగల అభిమానం వ్యక్తమవుతున్నది. లక్షలాది స్త్రీలు పురుషులు వృద్ధులు 'రమ ఆదర్శాలకు ప్రతీక' అయిన ప్రధానమంత్రిని— మనో నిబ్బరంతో, దృఢనిశ్చయంతో భారతదేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింపచేసిన ప్రధానమంత్రిని—దర్శనం చేసుకోడానికి పెల్లుబుకిన ఉత్సాహంతో ముందుకువచ్చారు. ప్రజలు ఆమెను "ధైర్యసాహసాలు మూర్తీభవించిన వ్యక్తిగా, "భారతీయవాణి"గా భావించారు. శాంతికాలంలోనూ యుద్ధకాలంలోనూ తనకు పూర్వంవున్న మహోన్నత వ్యక్తులను కూడా మరిపించి అతి తక్కువ వ్యవధిలో భారతదేశాన్ని దక్షిణ ఆసియాలో బలమైన దేశంగా రూపొందించిన వ్యక్తి అనికూడా భావిస్తున్నారు. అయినప్పటికీ "మా సైనికశక్తిని బట్టి మేం గౌరవింపబడదలచుకోలేదు. మా ఉన్నత ఆదర్శాలవల్లా, సంస్కృతివల్లా గౌరవింపబడదలచుకున్నాం" అని ఆమె చెప్పినది అక్షరాలా యథార్థం.

తమ ప్రసంగాలలో ప్రధానమంత్రి ఆర్థిక స్వయం శక్తిని గూర్చి ఎక్కువగా నొక్కి చెప్పారు. ఆర్థిక స్వయం సమృద్ధి సాధన, మనం చేస్తున్న పోరాటంలో రెండవదశగా ఆమె అభివర్ణించారు. మొదటి దశ స్వాతంత్ర్య సముపార్జనకై జరిపిన పోరాటం. యుద్ధం ముగిసినా మన కష్టాలు గట్టెక్కలేదనీ, మన పొరుగువారు ఎప్పుడు ఏమి చేస్తారో తెలియదుగనుక దేనికైనా మనం సిద్ధపడివుండాలని కూడా ఆమె ప్రజలను ఉద్బోధించారు.

ప్రధానమంత్రి పర్యటనలో ఆమెతోపాటు పర్యటించిన ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారుకూడా అన్నిచోట్లా సభలలో ప్రసంగించారు. ప్రధాని ఇంగ్లీషులో హిందీలో చేసిన ప్రసంగాలను ఆయన తెలుగులోకి అనువదించారు. ఇంతకుపూర్వపు ప్రధానమంత్రులు యీరాష్ట్రంలో పర్యటించినప్పుడుకూడా నరసింహారావుగారు వారి ప్రసంగాలను చాలా చక్కగా అనువదిస్తూవచ్చారు. ఆయన ప్రసంగించినతీరూ, వాగ్ధాటీ, వారి ప్రసంగవిషయాలూ ప్రజలను అమితంగా ఆకర్షించాయి. ప్రధానమంత్రి ప్రసంగాలను ఏ విషయమూ పొల్లు పోనీయకుండా, అతి సునాయాసంగా నరసింహారావుగారు అనువదించిన తీరు ప్రజలను బాగా ఆకట్టుకుంది.

క్షణం తీరికలేకుండా రాష్ట్రంలో ప్రధానిచేసిన రెండురోజుల శీఘ్ర పర్యటన తిరుమల, తిరుచానూరులలోని పుణ్యక్షేత్రాలను దర్శించడంతో ముగిసింది. తిరుమల క్షేత్రానికిగల పవిత్రతకు ప్రధాని ముగ్ధులయ్యారు. వెంకటేశ్వరస్వామి వారిమీద లక్షలాది సామాన్య ప్రజానీకానికి—దరిద్రులు దయనీయులకు—వున్న అపార విశ్వాసాన్ని ఆమె ఆలోచించి అర్థంచేసుకుంటున్నట్లుగా కనిపించారు. అన్నిటినీమించి, ప్రజలు హృదయపూర్వకంగా బహూకరించిన రజత కిరీటాన్నీ, ఖడ్గాన్నీ చిరునవ్వుతో స్వీకరించి, కిరీటాన్ని శిరస్సున ధరించి, ఖడ్గాన్ని చేతబూని ఆవిధంగా ప్రజాభీష్టాన్ని మన్నించడం ఒక విశేషం.

—పి. వి. ఆర్.



"ప్రమత్తత పనికిరాదు"

—ఖండూభాయ్ దేశాయ్

ఆంధ్రప్రదేశ్ గవర్నరు శ్రీ ఖండూభాయి దేశాయ్ రిపబ్లిక్ దినోత్సవ సందర్భంగా 1972 జనవరి 26 వ తేదీన సాయంత్రం 7 గం॥ 15 ని. లకు హైదరాబాదు రేడియో కేంద్రం నుండి చేసిన ప్రసంగం :—

" నేడు మనం భారత రిపబ్లిక్ 22 వ వార్షికోత్సవం జరుపు కుంటున్నాము. ఈ సంవత్సరం ఉత్సవానికి ఒక ప్రత్యేకత వుంది. మన సైనికదళాలు అఖండ విజయాన్ని సాధించాయి. మన సైనికదళాలు పశ్చిమ పాకిస్తానీ దురాక్రమణ నుంచి దేశ సమగ్రతను కాపాడడమేకాకుండా, శాంతికాముకులు, నిరాయుధులు అయిన లక్షలాది ప్రజలను ఒక క్రమ పద్ధతిలో మానవ మారణ హోమం చేసిన ఆక్రమణ దళాల కబంధహస్తాల నుంచి బంగ్లా దేశ్‌కు విముక్తి కూడా కలిగించాయి. ఈ శుభసమయంలో ఆంధ్ర ప్రదేశ్ ప్రజలకు, దేశంలోని ఇతర ప్రజలకు సహృదయ పూర్వకమైన శుభాకాంక్షలు తెలుపుతున్నాను.

మనది మతప్రసక్తిలేని ప్రజాస్వామ్య దేశం. మన రాజ్యాంగంలో మానవహక్కులు వివరించ బడివున్నాయి. అది పౌరులందరికీ స్వాతంత్ర్యం, సమానత్వం, మతం, ఆస్తి, సంస్కృతి, విద్య, రాజ్యాంగ సదుపాయాలు కల్పిస్తూ హక్కులను ప్రసాదిస్తున్నది. మానవ హక్కులు, స్వాతంత్ర్యంలను పరిరక్షించడానికి మనం బంగ్లాదేశ్ సహాయానికి వెళ్ళినాము. పొరుగున పెద్దదేశంగా వున్న బంగ్లాదేశ్ సెక్యులరిజం, సోషలిస్టు ఆశయాలు గల స్వాతంత్ర దేశంగా అవతరించింది. సాంఘిక, ఆర్థిక రాజకీయ పరిస్థితులలో న్యాయయుతంగా సాంఘిక వ్యవస్థను ప్రోత్సహించడానికి మన రాజ్యాంగం స్పష్టమైన విధానాన్ని నిర్దేశిస్తూ కొన్ని ఆదేశాలను సూచిస్తున్నది.

మన దేశాన్ని రిపబ్లిక్ దేశంగా ప్రకటించినప్పటి నుంచి, ఈ ఆశయ సిద్ధికై మనం అవిరళ కృషి చేస్తున్నాము. ఈ విషయంలో మనం చేసిన ప్రయత్నాలు సఫలీ కృతమవుతున్నాయని చెప్పడానికి నేను సంతోషిస్తున్నాను. అయితే మనం శీఘ్ర గతిని పురోగమించడానికి, ఇందులోగల కొన్ని ఇబ్బందులను అధిగమించడానికి వీలుగా మనం మన రాజ్యాంగాన్ని ఇదివరకే సవరించడం జరిగింది. ఈ చర్యల ఫలితంగా ప్రజలు లాభపడతారని నేను ఆశిస్తున్నాను.

అనాదినుంచి సహనానికి, మానవతా దృష్టికి మనదేశం పేరుపొందింది. కష్టాలపాలైన ప్రజలకు మనదేశం ఆశ్రయం యిస్తూ వచ్చినట్లు చరిత్ర చాటి చెబుతున్నది. మన ఆర్థిక వ్యవస్థపై పెద్ద భారం పడినప్పటికి కూడా భారతదేశం, బంగ్లాదేశ్‌లోని పాకిస్తానీ సైనికుల కిరాతక చర్యలు, ఘోర హత్యాకాండను తప్పించుకొని వచ్చిన కోటి మంది ప్రజలకు ఆశ్రయం ఇచ్చింది. మన రాజ్యాంగ నిర్మాతలు మత ప్రసక్తిలేని రాజ్యాంగంపట్ల ప్రత్యేక శ్రద్ధ చూపారు. కులమత, లింగభేదం లేకుండా అందరికీ సమానమైన పౌరసత్వం ప్రసాదించింది. తనకు నచ్చిన మతాన్ని అవలంభించడానికి ప్రతి పౌరునికి హక్కు వుంది. ఇటీవలి ఇండో-పాక్ యుద్ధం ఫలితంగా ద్విజాతి సిద్ధాంతం అంతరించి పోయింది. మతంపైన సెక్యులరిజం గెలిచింది.

మన ప్రాచీన దేశ సమైక్యతను, జాతీయ సమైక్యతను, అంతర్జాతీయ అవగాహనను పెంపొందించడానికి మన రాజ్యాంగ నిర్మాతలు శాశ్వతమైన పునాది వేశారని దీనివల్ల స్పష్టమవుతున్నది కనుక సమైక్యత, సౌహార్ద్రతలను పెంపొందించే పవిత్ర సంకల్పానికి మనం పునరంకితమవుదాము.

గత ఇరవై ఏండ్లలో భారతదేశం వ్యవసాయం, పరిశ్రమలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి, సాంఘిక సేవా రంగాలలో గణనీయమైన ప్రగతి సాధించింది. మన పంచవర్ష ప్రణాళికలు మన ప్రగతికి బాటలు వేయడమే కాకుండా మన శక్తి యుక్తులకు తగినట్లుగా భవిష్యత్ కార్యక్రమాన్ని తీర్చి దిద్దడానికికూడా ప్రోత్సాహం కల్పిస్తున్నవి.

మన ప్రణాళికలు మన ఆర్థిక వ్యవస్థపై ప్రగతి పూర్వకమైన ప్రభావం వేశాయి. భారతదేశంలో ఆహారోత్పత్తి బాగా అభివృద్ధి చెందింది. అయితే, ఈ విషయంలో స్వయం సమృద్ధి సాధించడానికి మనం ఇంకా యెంతో కృషి చేయవలసి వుంది. పరిశ్రమలు, నీటి పారుదల, విద్యుచ్ఛక్తి ఉత్పాదన, సాంఘిక సేవా రంగాలలో మనం గణనీయమైన ప్రగతి సాధించినాము.

మన సమాజంలో అన్నివర్గాల ప్రజలకు ముఖ్యంగా బలహీన వర్గాలకు ఆర్థిక ప్రగతి లాభాలు అందుబాటులో వున్నప్పుడే మన జాతి ఆశయమైన సోషలిస్టు సమాజ వ్యవస్థ స్థాపన వాస్తవంగా సఫలీకృతమవుతుంది. బలహీన వర్గాల శ్రేయస్సు పట్ల ప్రభుత్వం అత్యధిక శ్రద్ధ వహిస్తున్నది.

ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన ముఖ్యమైన కార్య క్రమాలలో ప్రభుత్వం భూములను పేదలకు పంపిణీ చేసే పథకం కూడా చేర్చబడింది. ఈ పథకం అమలులో షెడ్యూలు కులాలు, షెడ్యూలు తెగలకు ప్రాధాన్యం యివ్వ బడుతున్నది. ఈ పథకం క్రింద ఒక సంవత్సరంలో మొత్తం 20 లక్షల ఎకరాలకు పైగా భూములను పంపిణీ చేశారు. భూకమతాల చట్టంలో పేర్కొన్న మినహాయింపులను తొలిగించారు. కౌలుదారి చట్టంలో కౌళ్ళరేట్లను బాగా తగ్గించారు. ప్రణాళికా పెట్టుబడులలో షెడ్యూలు తెగలలో పదింతలు, హరిజనులకు ఐదింతలు పెట్టుబడులను పెంచారు. వార్షికంగా రు. 1.5 కోట్ల వార్షిక పెట్టుబడులలో షెడ్యూలు ప్రాంతాల ఆర్థిక అభివృద్ధికి సామూహికంగా కార్యక్రమాల్ని చేపట్టారు. గిరిజనులు మురికి వాడల బాల బాలికల నిమిత్తం అనేక ఆశ్రమ పాఠశాలలు ఏర్పాటు చేసి పౌష్టిక ఆహార కార్యక్రమాలను అమలు జరుపుతున్నారు.

అయితే దేశ విభజన తర్వాత సంక్లిష్ట సమస్యలను ఎదుర్కొంటున్న భారత దేశం గత సంవత్సరాలలో మనపై రుద్దబడిన మూడు యుద్ధాలలో పోరాడ వలసి వచ్చింది. అంతేగాక వరదలు, కాటకాలనుకూడా ఎదుర్కోవాల్సి వచ్చింది. ఈ పరిస్థితులను దృష్టిలో పెట్టుకొనే మనం సాధించిన ఫలితాలను చేరవేసుకోవాలి. ఇటీవల యుద్ధంలో మనం సాధించిన ఘనవిజయం మనలో ఆత్మస్థైర్యాన్ని పెంపొందించింది. కొత్త సవాళ్లను ఎదుర్కోవడానికి వీలుగా పటిష్ఠమైన సమైక్య నవభారత దేశం ఆవిర్భవించింది. అన్ని రంగాలలో స్వయం సమృద్ధిని సాధించి, ఆర్థిక సహాయానికి ఇతర దేశాలపై ఆధారపడకుండా ఉండే విధముగా మనం కృషి చేయాలి.

మన జవానులు చేసే త్యాగాలు ప్రదర్శించిన ధైర్య సాహసాలు వృధా కారాదు. భారత దేశాన్ని పటిష్ఠమైన దేశంగా రూపొందించడానికి ప్రపంచశాంతికి దోహదం కల్పించడానికీ, మానవ హక్కులను, స్వాతంత్ర్యాన్ని పరిరక్షించడానికీ దోహదం చేసేందుకు వీలుగా ప్రజలలో అవి ఉత్సాహాన్ని కల్పించాలి. యుద్ధంలో మరణించిన జవానుల కుటుంబాలకూ, యుద్ధంలో గాయపడిన జవానులకూ, అంగవైకల్యం పొందిన జవానులకూ, నికరమైన సహాయం అందజేయడం ద్వారా మనవారి ధైర్యసాహసాలకు చేతల రూపంలో జోహార్లు అర్పించాలి. ప్రజలు జాతీయ రక్షణ నిధికి విరివిగా విరాళాలు అందజేయాలి. దీనికై రాష్ట్ర ప్రభుత్వం యితోధికంగా కృషి చేస్తున్నది. యుద్ధానంతరం ఆర్థిక క్లిష్ట సమస్యలను మనం ఎదుర్కొంటూ బంగ్లాదేశ్ పునర్నిర్మాణానికి తోడ్పడాలి.

కాల్పుల విరమణ జరిగినప్పటికీ ప్రమత్తత పనికిరాదు. ఎటువంటి సంఘటనైనా ఎదుర్కోడానికి మనం అనుక్షణంగా సిద్ధంగా ఉండాలని ప్రధాన మంత్రి పేర్కొన్నారు. దేశ సమగ్రతా పరిరక్షణకే గాక ప్రజాస్వామ్యం, సెక్యులరిజం, సహనమనే మన ప్రధాన లక్ష్యాల పరిపోషణకు మనం జాగరూకతతో ఉండాలి. మనం శాంతికి కట్టుబడి ఉండాలి. అయితే శాంతి పరిరక్షణకు మనం సర్వ సన్నద్ధులమై ఉండలి.

ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానమంత్రి చొరవవల్ల రాష్ట్ర సమైక్యతకూ, సమగ్రతకూ నవశకం ఆరంభమైంది. యుద్ధం సమయంలో రాష్ట్రంలో ప్రజలు శాంతి, మతసామరస్యాలను పరిరక్షించినందుకు ఆంధ్రప్రదేశ్ ప్రజలను నేను అభినందిస్తున్నాను. రాష్ట్రసమగ్రతా పరిరక్షణకూ, వివిధరంగాలలో యింతవరకూ సాధించిన విజయాల కొనసాగింపుకు మాత్రమే గాక ప్రజల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం అనేక చర్యలను తీసుకుంటుంది.

'నూతన శకానికి నాంది'

—పి. వి. నరసింహారావు



రిపబ్లిక్ దినోత్సవం సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు దిగువ సందేశం జారీచేశారు.

అనేక కారణాల దృష్ట్యా యీ సంవత్సరం రిపబ్లిక్ దినోత్సవం ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకున్నది. పాకిస్తాన్‌తో జరిగిన సమరంలో మన సైనికదళాలు అమోఘమైన విజయం సాధించడంతోను పశ్చిమపాకిస్తాన్ ఆక్రమణ దళాలనుండి బంగ్లాదేశ్‌కు విముక్తి కల్గించడంతోను మన దేశం నవభారత దేశంగా ఆవిర్భవించింది.

ఇతర దేశాలు, అవి ఎంతటి శక్తివంతమైనప్పటికీ వాటి బెదిరింపులకు లొంగకుండా మన దేశం స్వశక్తిపైన నిలిచింది. బంగపిత షేక్ ముజిబుర్‌రహమాన్ నాయకత్వంలో స్వతంత్ర సెక్యులర్, సోషలిస్టు రిపబ్లిక్‌గా బంగ్లాదేశ్ అవతరించడం యిటీవలి చరిత్రలో ప్రముఖమైన సంఘటనగా పేర్కొనవచ్చు. ఇది యీ ఉపఖండానికి నూతన స్వరూపం యివ్వడమే కాకుండా, ప్రపంచానికి కొత్త ఆశలను కల్పించింది. స్వతంత్రేచ్ఛను అణచివేయడం, మానవ విలువలను అతిక్రమించడం జరుగదని నిరూపించింది. దురాక్రమణ విధానాలు కొనసాగినవని ఇవి రుజువు చేసింది.

ప్రపంచంలో నేడు స్వాతంత్ర్యానికీ, మానవత్వానికీ, న్యాయానికీ ప్రతీకగా నిలిచిన శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో పటిష్ఠమైన కేంద్రప్రభుత్వం ఉండడంవల్లనే యీ ఘనవిజయాలను సాధించడానికి వీలుకలిగింది. దేశ వ్యవహారాలు ఆమె చేతులలో ఉండడంవల్ల సరిఅయిన మార్గంలో మనం పురోగమించడానికీ, శాంతి స్వాతంత్ర్యాలకు దోహదం కల్పించడానికీ అవకాశం ఏర్పడింది. మన దేశం సోషలిజం. స్వశక్తి లక్ష్యాలవైపు పురోగమించాలంటే జాతికేగాక ప్రపంచానికే ఎదురులేని నాయకులైన శ్రీమతి ఇందిరాగాంధీ నాయకత్వంలో ప్రజాస్వామ్యం. సోషలిజం లక్ష్యాలకు అంకితమైన స్థిరమైన రాష్ట్ర ప్రభుత్వాలు ఉండడం చాలా అవసరం.

సుస్థిరమైన ప్రభుత్వం ఏర్పాటుకు ఆంధ్రప్రదేశ్ యింతవరకూ ప్రఖ్యాతిగాంచింది. అందువల్లనే దేశంలోని యితర ప్రాంతాలలో దీనికి పలుకుబడి ఉంది. రాష్ట్రంలో కొత్త మంత్రివర్గం ఏర్పడడంతో ప్రజలకు నూతన శకారంభమైంది. దీనివల్ల సమైక్యతను పటిష్ఠంచేస్తూ మూడుప్రాంతాల ప్రజలలో మరింత సదవగాహనకు దోహదం కలిగింది. రాష్ట్రంలోని రాజకీయ పరిస్థితులు సమైక్యతనూ, సుస్థిరత్వాన్ని మరింతగా బలపరుస్తున్నవి.

ప్రధానమంత్రి నాయకత్వంలో జాతీయ విధానాలను కార్యక్రమాలను అమలుపర్చే విధంగా, స్థిరత్వాన్ని సమైక్యతనూ, సోషలిజం, ప్రజాస్వామ్యం వాంఛించే శక్తులను బలపర్చే విధంగా, వచ్చే ఎన్నికలలో ఓటర్లు తమ ఓట్లను వినియోగిస్తారనడంలో నాకెట్టి సందేహమూ లేదు.



"ప్రతివ్యక్తి సైనికుడే"

శ్రీమతి ఇందిరాగాంధీ

భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధీ 1971 డిసెంబరు 12 వ తేదీ ఆదివారంనాడు ఢిల్లీలోని రామలీలా మైదానంలో బ్రహ్మాండమైన బహిరంగసభలో చేసిన ప్రసంగ పాఠం.

"సోదర సోదరీ మణులారా, ఆఖరిసారి నేను గడచిన సాధారణ ఎన్నికల తర్వాత యిక్కడ నుంచి ప్రసంగించాను. అప్పుడు కూడా మనం కొన్ని సిద్ధాంతాల గురించి, ఆదర్శాల గురించి పోట్లాడాం. దేశ ప్రజల ముందూ, ప్రపంచం ముందూ భారతదేశ స్వరూపాన్ని చూపించాం. తాము ఎటు ప్రయాణించాలో తమకై తాము ఎటువంటి భవిష్యత్తును నిర్మించుకోవాలో భారత ప్రజలకు తెలుసునని నిరూపించుకున్నాం. అయితే యీనాడు జరుపుతున్న పోరాటం మాత్రం అలాంటిదికాదు, ఇది వేరు.

మన మొదటి పోరాటం—దాన్ని మనం పోరాటమనే అంటే ఆ పోరాటం - పరస్పరాభిప్రాయాల మధ్య జరిగిన పోరాటం. ఒకరితో నొకరం మాటలతో, ప్రజల ఓట్లతో ఆ పోరాటం సాగించి గెలుపు సాధించాం. కాని యీనాటిది మరో రకమైన పోరాటం. సాధారణ ఎన్నికలప్పుడు పరస్పరం భిన్నాభిప్రాయాలు కలిగివున్న వారమంతా యీనాడు ఒకటయ్యాం. ఈ పోరాటంలో మనమంతా చేతులు చేతులూ కలిపి కలిసి కట్టుగా వుంచున్నాం. వివిధ మతాలకు, వర్గాలకు భాషలకు, రాష్ట్రాలకు చెందిన యావద్భారత ప్రజానీకమంతా యీసమయంలో ఏకత్రాటి మీద నిలిచింది.

అయితే ఈ నాడు మనం జరుపుతున్న పోరాటం ప్రజాస్వామిక విలువల గురించి, ఈ ప్రపంచంలో కేవలం మతం ప్రాతిపదిక మీదనే ఏ దేశమూ ఏర్పాటు కాదన్న సిద్ధాంతం గురించి మనం పోట్లాడుతున్నాం. ఈనాడు ప్రపంచంలో ఒకే ఒక్క మతంతో ఏ దేశమూ లేదు ప్రతి దేశంలో కూడా వివిధ మతాలకు చెందిన వారు వున్నారు ఒక దేశంలోగల అల్ప సంఖ్యాక మతానికి చెందిన ప్రజలకు వుండే హక్కులేమిటి అన్నదే యీనాటి పరీక్ష.

ఈనాడు మనం, అన్ని దేశాలూ స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు కలిగి వుండాలనీ, అందరు ప్రజలూ తమ న్యాయమైన కోర్కెల గురించి అడిగే హక్కు కలిగి వుండాలనే సిద్ధాంతాల గురించి పోరాడుతున్నాం. స్వేచ్ఛ గురించి, సౌభ్రాతృత్వం గురించి చేసే పోరాటం అంతిమంగా విజయం పొందుతుందన్న ప్రగాఢ విశ్వాసం మనకు వుంది.

ఈనాడు అనేకమంది మన వీర సోదరులు సరిహద్దులలో పోరాడుతున్నారు. ఎందరో తమ ప్రాణాలను త్యాగం చేశారు. మరింకెందరో గాయపడి ఆస్పత్రులలో వున్నారు. వారి వెనుక మీరూ, నేనూ యావద్భారత ప్రజానీకమూ ఒక్కటై నిలిచి వున్నాం. మనం కొంత పురోగమనం సాధించాం మనం ఏది సాధించదలచామో దాన్ని సాధించగలం. అయితే రానున్న రోజులు కష్టాలతో నిండుకున్నవని మనకు తెలుసు ప్రమాదం తొలగిపోలేదు. అది రోజు రోజుకు ఎక్కువవుతోంది. మనకు ప్రజాస్వామ్యాన్ని గురించి బోధిస్తున్న వాళ్ళు, ప్రజాస్వామ్యంపై

మనకున్న అచంచల విశ్వాసాన్ని సందేహించే వాళ్ళూ తమ విషయం ఆలోచించడంలేదు. దారిద్ర్యాన్ని గురించి ఎలుగెత్తి మాటాడే వారూ, ప్రతి చోటా స్వేచ్ఛ గురించి గొంతెత్తి గానం చేసే వారూ యీనాడు స్వేచ్ఛా గళాన్ని గుర్తించలేకున్నారు. మన చుట్టూ అన్ని వైపులా ప్రమాదం విస్తరిస్తోంది.

ఇంతకుముందే మీరొకపాట విన్నారు. "సర్ ఫరోషీ కీ తమన్నా"—ఆత్మార్పణకై అణచివేయలేని కోరిక. నేను చిన్న పిల్లగా వున్నప్పుడు మన స్వాతంత్ర్యోద్యమ కాలంలో మేము పెద్ద పెద్ద ఊరేగింపులో సమావేశాల్లో హాజరయ్యేప్పుడు మరో పాట కూడా తరచు పాడే వారు. "సర్ జాయేతో జాయే, పర్ హింందీ ఆజాదీ పాయే"—నా శిరస్సు నేలకూలినా నాకేమీ చింతలేదు నాభారతదేశం మాత్రం స్వాతంత్ర్యం పొందాలి" అని. ఈనాడు ఆపాటలు పాతబడిపోయాయ్ అయితే ఆనాడు మన జాతీయ జీవితంలో అవి ఎంతటి ప్రాధాన్యాన్ని కలిగివున్నాయో యీనాడూ అంతే ప్రాముఖ్యాన్ని కలిగివున్నాయి. ఈనాడు మనం యిటు వంటి ప్రమాదాన్ని ఎదుర్కొన్నామంటే కారణం యిదేదో ఆటగా భావించడంవల్ల కాదు. ఇతరుల భూభాగాన్ని కాజేయాలన్న సంకల్పం వల్ల కాదు, ఏ దేశాన్నో నాశనం చేసేద్దామని అనుకో వడంవల్ల కాదు. మన పొరుగు దేశమైనా మరొక దేశమైనా నాశనం కావాలని మనం ఎప్పుడూ అనుకోలేదు. అయితే బంగ్లాదేశ్‌లో జరుగుతున్న సంఘటనలను— బంగ్లాదేశ్ ప్రజల వాక్‌స్వాతంత్ర్యాన్ని, స్వేచ్ఛా స్వాతంత్ర్యాల కోరికను, బంగ్లాదేశ్ స్వేచ్ఛా ప్రియులైన ప్రజల హృదయాంతరాళాలనుంచి పెల్లుబికిన దావానలాన్ని - అణచివేయడం సాధ్యం కాదని మనకు స్పష్టంగా తెలుసు. ఆ స్వేచ్ఛా గళం అణచివేయబడితే మన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకే ముప్పు వాటిల్లుతుందని కూడా మనకు తెలుసు. మన స్వాతంత్ర్యానికి తగిలే యీ దెబ్బ మన ప్రాతిపదిక సిద్ధాంతాలకే దెబ్బ అని సైతం మనకు తెలుసు. అందుకే యీనాడు మనం పోరాటం సలుపుతున్నాం. ఇంతకు ముందే చెప్పినట్టు ఎవరి భూభాగాన్నో కాజేయాలనిగానీ, ఏ దేశాన్నో నాశనం చేయాలనిగానీ మనం పోరాడడంలేదు పదేపదే యీ విషయాన్ని నేను ఎందుకు ప్రస్తావిస్తున్నానంటే విదేశాల్లో మనకు వ్యతిరేకంగా విపరీతమైన ప్రచారం సాగుతోంది. శాంతి పద్ధతిలో దీన్ని పరిష్కరించడానికి ఎంతగానో ప్రయత్నించాం. బంగ్లాదేశ్ తన స్వేచ్ఛాగళాన్ని విప్పింది. నిజానికి యిది బంగ్లాదేశ్ సామాన్యమానవుడు బాధాతప్త హృదయంతో వేసిన పొలికేక. బంగ్లాదేశ్‌లో స్త్రీలు, పిల్లలు, యువకులకు ఏమి సంభవించిందో దాని పర్యవసానమే అతి తక్కువ వ్యవధిలో అంత పెద్ద మొత్తంలో ప్రజలు భారతదేశానికి తరలిరావడం. ఇటువంటి విపత్తు సంభవించినప్పుడుగానీ, మన సరిహద్దు పొడవునా పాకిస్తానీ సైన్యాలు భారీ ఎత్తున మొహరించినప్పుడుగానీ చూడకుండా కళ్ళుమూసుకున్న వాళ్ళు లక్షలాది బంగ్లాదేశ్ ప్రజలను పాకిస్తానీ సైనికులు ఊచకోత కోస్తుంటే ఒక్కమాట కూడా మాటాడలేదు. వాళ్ళకు వ్యతిరేకంగా ఏ ఒక్కరూ ఒక్కమాటైనా మాటాడలేదు. ఇంత జరిగినా యిదంతా పాకిస్తాను ఆంతరంగిక విషయాలు అనే అంటున్నారు.

ఒక దేశం మరొక దేశాన్ని సమూలంగా నాశనం చేయాలనుకుంటే, ఒక జాతి మరొక జాతిని పూర్తిగా తుడిచిపెట్టి వేయాలనుకుంటే అది ఆదేశ ఆంతరంగిక విషయంగా భావించడానికి వీల్లేదు తన పొరుగుదేశంలో లక్షలాది ప్రజానీకం పరమకిరాతకంగా హింసింప బడి అణచి వేయబడుతోంటే, వారి సంస్కృతి సర్వనాశనం కావించబడుతోంటే భారతదేశం చూస్తూ ఎలా వూరుకుంటుంది? దీన్ని సహించడం ఎంతమాత్రం సాధ్యంకాదు. విదేశాలకు నేను వెళ్ళినప్పుడు నేను వెళ్ళిన చోటల్లా స్పష్టంగా యిదే చెప్పాను. నేను చెప్పినదానికి కట్టుబడి వుండనని కొంతమంది అంటున్నారు. బహుశా విదేశీయులకు మనల్ని గురించి సరిగా తెలియకపోవచ్చు. భారతీయ మహిళ అంటే ఏమిటో వారికి అంతగా అర్థమైవుండక పోవచ్చు. మనల్ని సరిగా అంచనా వేసుకొనే అవకాశం బహుశా విదేశీయులకు లభించక పోవచ్చు. ఈ భారతీయ మహిళ, యీ భారతీయ పురుషుడు ఒక మహత్తర నాగరికతలోంచి వచ్చినవారు. ఏ ఒకటో రెండో శతాబ్దాల చరిత్రకాదు. వేలాది సంవత్సరాల నాటినుంచీ వస్తూవున్న సంస్కృతి మనది. దానితోపాటే మన కష్టాలూ, దారిద్ర్యంకూడా. వేలాది సంవత్సరాలుగా మనం సహనాన్ని నేర్చుకుంటున్నాం. ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నాం. బాధలు పడ్డాం. అణగద్రొక్కబడ్డాం. ఈ ఓపికే మనకి ఒక అజేయమైన శక్తినిచ్చింది. కష్టాల్ని సహించడం ఎంతవరకు సాధ్యమో అంతవరకు భరించగలం. అయితే ఇక భరించగలిగేస్థితి దాటి పోయినప్పుడు ఆ అజేయ శక్తితో ఎదుర్కొంటాం. అందుకే భారతదేశం దాస్యంలో మ్రగ్గిపోయింది. అణచివేయబడింది. దాస్య శృంఖలాలను ఛేదించుకుందామని ఒక్కొక్క ప్రయత్నమే చేస్తూవుంటే చాలా నిర్దాక్షిణ్యంగా అణచివేయబడింది. అయితే యావద్భారత జాతీ—దరిద్రులూ నిరక్షరాస్యులూ, రోగులూ బలహీనులు అన్నమాట లేకుండా భారతి జాతి జాతి యావత్తూ ఒక్కటై నిలిచి ముక్తకంఠంతో 'స్వాతంత్ర్యం మా జన్మ హక్కు' అని ఎలుగెత్తి చాటి చెప్పింది. ఆ నాటి నుంచీ భారతదేశం మెల్ల మెల్లగా పురోగమిస్తోంది. ఆ స్వాతంత్ర్యాన్నే బలపరచుకోడానికి యీ నాడు మనం పోరాటం సలుపుతున్నాం. బహుశా వారు పాకిస్తానులో సంభవిస్తున్న సంఘటనలను దృష్టిలో పెట్టుకొనక పోవచ్చు. ఒకవేళ పెట్టుకున్నా తమచేత అణగద్రొక్కబడిన దేశాలు గట్టిగా గొంతెత్తి మాటాడగూడదనీ, ఒకవేళ మాటాడినా తాము ఏది చెప్పమంటే అదే చెప్పాలనీ, ఏది చెయ్యమంటే అదే చెయ్యాలనీ అంతకన్న భిన్నంగా ప్రవర్తించగూడదనీ వారు భావించి వుండవచ్చు. ఈ నాడు మనం భారతదేశం గురించేకాదు, మన సిద్ధాంతాల గురించేకాదు శతాబ్దాల తరబడి అణగద్రొక్క బడుతున్న వారిగురించికూడా వారు తమ దాస్యాన్నీ, అణచివేతనీ గుర్తించక పోయినా, వారి గురించి పోట్లాడుతున్నామని నా ఉద్దేశం వారి దాస్యంలో మ్రగ్గడం వారు అణచివేయబడడం మనకు తెలుసు. ఈ నాడు దీనిని మనం నిర్మూలించకపోతే మనకు కూడా యిదేగతి పట్టవచ్చు.

స్వాతంత్ర్యం గురించి మనం పోరాడినప్పుడు అది కేవలం భారత దేశానికి స్వాతంత్ర్యాన్ని తీసుకొని రావడానికే, మన

స్వాతంత్ర్య కృషి ఫలించి మనదేశం మళ్ళీ ఒకసారి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు ఆటపట్టయిన తర్వాత ఇతర దేశాలుకూడా ఒకదాని తర్వాత ఒకటి స్వతంత్రదేశాలయ్యాయి. ఆ విధంగా మన కృషి ఫలితాలు మరింత లోతుకు పాతుకుని పోయాయి. దీనికి ఒక ప్రత్యేకత వుంది. ఇది చాలా అవసరం కూడా. ఇందాకటి పాత పాటలో పేర్కొనబడినట్టుగా మన శిరస్సులు నేల కూలాలని అనుకోడంలేదు. బలహీనులంగా మనం వుండాలనుకోడంలేదు. కాని మనం ఆపదను ఎదుర్కోవలసివస్తే, మనం లక్షించిన ఉన్నత లక్ష్యాలకు సిద్ధాంతాలకు ప్రమాదం ఏర్పడితే, మన ప్రాతిపదిక విలువల మనుగడకే ఆటంకం ఏర్పడితే మన జీవితాలను త్యాగం చెయ్యడానికి కూడా సిద్ధంగా వుండాలి. భారతదేశం అందుకు సిద్ధంగా వుంది. పాకిస్తానుతో తమకు కొన్ని ఒప్పందాలు, సంధులు వున్నాయని కొన్ని దేశాలు మనల్ని హెచ్చరించడానికి ప్రయత్నిస్తున్నట్టువిన్నాను. ఇది నాకు ముందుగా తెలియదు. ఎందుకంటే, నాకు తెలిసినంత వరకు ఏ ఒప్పందం అయినా, కమ్యూనిజానికి వ్యతిరేకంగా ఏర్పాటు చేసుకోబడినదే. ప్రజాస్వామ్యానికి వ్యతిరేకంగా మాత్రం కాదు. న్యాయమైన కోర్కెలకు వ్యతిరేకంగా కాదు. పేదల్ని అణచివేయడానికి కాదు. కాని అందుకే అయితే మాత్రం వారు ప్రపంచానికి పచ్చి అబద్ధాన్ని చెప్తున్నా రన్నమాట.

ఈనాడు మన విధానాల్ని గురించి విమర్శించేవాళ్ళు కొందరు వున్నారు. మనం భారత దేశంలో కమ్యూనిజాన్ని ప్రోత్సహించడానికి ప్రయత్నిస్తున్నామని చెప్పి మనల్ని చైనా బారినుండి రక్షించాలనుకొంటున్నారు, కాని మనం వారికేవిధంగానూ లాభించలేదు. అదే సమయంలో వారు, యీనాడు ప్రపంచంలోని అగ్రరాజ్యాలలో చైనా ఒకటి అనీ, దాని మార్గానికి ఎవరూ అడ్డు నిలువకూడదు అనీ చెప్తున్నారు. ప్రపంచ ధోరణి ఎలా మారిపోతుందో చూశారా. ఒకసారి వెనుకటి చరిత్రను పర్యావలోకనం చేసుకొంటే ఒకే ఒక దేశం, ఒకే ఒక ప్రజ తాముముందు చెప్పిన దానికే కట్టుబడి, అన్నమాటమీదనే నిలబడి వున్నట్టు తెలుస్తుంది. ఆ దేశం బాగా ఆలోచించి ఆలోచించి చివరకు ఒక మార్గాన్ని అనుసరించింది, ఆ మార్గంగుండానే మనం మొదటినుంచీ పురోగమిస్తున్నాం. మరొకసారి చెప్తున్నాను, మనం బలహీనులమే కావచ్చు. ఐరోపా దేశాల్ని కూడా వణికించే అగ్రరాజ్యాల సైన్యమంత శక్తివంతమైన సైన్యాలు మనవి కాకపోవచ్చు. వారి శక్తితో పోల్చిచూస్తే మనది బహు తక్కువే కావచ్చు. వారికున్న ఆయుధాలు మనకు లేకపోవచ్చు. వారికున్న సంపద, వనరులు, పరిశ్రమలు మనకు లేకపోవచ్చు. కాని మనకు భారతీయ ఆత్మ వుంది. భారతీయ సంస్కృతి వుంది. న్యాయం, ధర్మం మన పక్షాన వున్నాయి. అగ్రరాజ్యాలన్నీ ఏకమై మనల్ని ఎదుర్కొన్నా సరే యీనాడు భారత దేశం ఏ మానవ ఆత్మశక్తి గురించి నిలిచిందో ఆ ఆత్మశక్తిని వారు ఎంతమాత్రం అణచివేయలేరు, ఏమాత్రం కదిలించలేరని ప్రపంచానికి మనం తెలియచెప్పాలి. కేవలం బలం వున్నంత మాత్రంచేత, ధైర్యంవున్నంత మాత్రంచేత అకారణంగా ఒక దేశం మరోదేశాన్ని నాశనం చేయగలదని కానీ, ఒక జాతి మరొక జాతిని నిర్మూలించగలదని కానీ, ఒక ప్రజ మరొక ప్రజని చిత్రహింసలకు గురిచేయగలదని కానీ అనుకోడానికి వీల్లేదు. ధైర్యం అంటే తను నమ్మిన సిద్ధాంతానికి చెక్కు చెదరకుండా కట్టుబడి వుండడం. మన సిద్ధాంతాలేమిటో తెలుసుకుందాం. మొదటిది ప్రజాస్వామికం. ఈ ప్రజాస్వామికాన్ని ఏ విధంగా ఆచరణలో పెట్టగలమో, ప్రజలకు దాని ఫలితాలేమిటో ఆ విషయం ఆలోచించాలి. ప్రజాస్వామికం అంటే ప్రజలు కుల, మత, వర్గ ప్రసక్తి లేకుండా అందరూ సమాన హక్కుల్నీ అవకాశాల్నీ కలిగివుండడం మన ప్రధాన లక్ష్యాలలో యిది ముఖ్యమైనది. రెండవది–దారిద్ర్యాన్ని కూకటి వ్రేళ్ళతో పెకలించి వేస్తేగాని ప్రజాస్వామ్యం సుస్థిరంగా వుండలేదు. ప్రజలలో ఒకవర్గం– వారు బీదవారైనా, నిరక్షరాస్యులైనా – ఆ వర్గానికీ మిగతా వర్గానికీ మధ్యగల అంతరాన్ని తొలగించగలిగినప్పుడే ప్రజాస్వామ్యం సుప్రతిష్ఠితం కాగలదు. అన్నివర్గాలవారూ కలిసికట్టుగా పురోగమించినప్పుడే మనకు నిజమైన విజయం లభిస్తుంది. కేవలం ఏ ప్రాంతాన్నో ఆక్రమించుకోవడం విజయంకాదు.

ప్రస్తుత క్లిష్టపరిస్థితుల్లో మనం ఎలా చిక్కుకున్నాం? ఇంతకుముందే చెప్పినట్టు, మన పొరుగున ఒక దేశం వుంది. అదికూడా మనలాగే పేదదేశం. బహుశా మనకన్నా వెనుకబడిన దేశమేమో కూడా. ఆ దేశం అభివృద్ధి చెందడానికి వీల్లేకుండా, అందుకు ఏలాటి అవకాశాలూ వుండకుండా అణచివేయబడింది. ఆ దేశం సమానస్థాయిలో చూడబడలేదు. అక్కడ ఒకవైపు దుర్బలులైన ప్రజలున్నారు. మరోవైపు మొత్తం సైన్యం అంతా నిలిచివుంది. అటువంటి దేశం ఒకవేళ మనకు పొరుగునకాకుండా బాగా దూరంగా వున్నప్పటికీ మన సానుభూతి స్వాతంత్ర్య పోరాటకుల వైపే వుండి వుంటుంది. దరిద్రుల వైపునా, న్యాయం అణచివేయబడుతున్న వైపునే భారతదేశపు సానుభూతి వుండివుంటుంది. అయితే యీ దేశంమట్టుకు మన పొరుగునే వుంది. ఆ దేశంనుంచి వినవస్తోన్న ఆర్తనాదాలు వినిపించకుండా ఒక వేళ మనం మన చెవులూ కళ్ళు మూసుకొని మనల్ని మనం సర్ది చెప్పుకోడానికి ప్రయత్నించినా అలా అతీతంగా వుండలేం. ఎందుకంటే అక్కడ జరుగుతున్న సంఘటనల ప్రభావం మన దేశంమీద కూడా వుంటుంది. మన ఆర్థిక, సాంఘిక, రాజకీయాలమీద, మనమీద, చివరకు మన భద్రతమీద కూడా దాని ప్రభావం పడితీరుతుంది.

ఇలాటి పరిస్థితుల్లో, అక్కడ ఏమీ జరగడం లేదనుకుని ఏ దేశమూ చేతులు ముడుచుకునికూచోలేదు. సహనాన్ని ప్రదర్శించమని సలహాలు యిచ్చారు మనకు. అలాగే సహనాన్ని ప్రదర్శించాం. ఒక వారంరోజులు కాదు, నెలరోజులు కాదు తొమ్మిది నెలలపాటు సహనాన్ని చూపించాం. బంగ్లాదేశ్ స్వాతంత్ర్యం పొందడానికె మనం ప్రయత్నించని రోజంటూ లేదు. ఎందుకంటే బంగ్లాదేశ్ ప్రజలకు స్వాతంత్ర్యంకన్న అంగీకార యోగ్యమైన పరిష్కారం మరొటిలేదుగనుక ఆ స్వాతంత్ర్యాన్ని లభింపజేద్దామని శక్తివంచన లేకుండా ప్రయత్నించాం. ఇంతకుముందే చెప్పినట్టు, భారత దేశం కోరేదేమిటిఅన్న ప్రశ్నకు తావే లేదని అన్ని దేశాలకుతెలియజెప్పాను. ఆ దేశ ప్రజలు కోరేదేమిటి? దేనికి ఆ ప్రజలు అంగీకరిస్తారు? ఇదీ అసలు ప్రశ్న. మనకు తెలిసినంతమట్టుకు ఆ ప్రజలు పరి

పూర్ణ స్వాతంత్ర్యాన్ని మాత్రమే అంగీకరిస్తారని మా ఉద్దేశం అనికూడా ఆ దేశాలవారికి తెలియజేశాను. ఈ సమస్యను చర్చించి దీనికి మరొక పరిష్కారాన్ని కనుగొనడానికి అవతలివారికి తొమ్మిది నెలలూ చాలు. కాని ఈ తొమ్మిది నెలలూ వారు మనకు సలహాలు ఇవ్వడంతోనే సరిపోయింది. ఇప్పుడు మనమీద దురాక్రమణ జరిగితే భారతీయులే దురాక్రమణ దారులనీ, ముందుగా వారే దురాక్రమణ ప్రారంభించారని కొంత మంది అసదం మొదలెట్టారు. మన జాతీయ జీవితాన్ని, మన అంతర్జాతీయ జీవితాన్ని వారు పరిశీలించే వున్నారు. వీటి ఫలితాలేమిటోకూడా యావత్ ప్రపంచమూ చూసింది.

కొన్ని సంపన్న దేశాలు వున్నాయి. తమ దేశాల్లో యువకులు విరివిగా వక్రమార్గాలు పడుతున్నారని ఆదేశాలు ఫిర్యాదులు చేస్తున్నాయి. తమ యువకులముందు కొన్ని లక్ష్యాలు పెట్టి, ఆ లక్ష్యాలకే భిన్నంగా ఆ దేశాలు ప్రవర్తిస్తున్నాయే. ఈ విషయం వాళ్ళు గుర్తించుకోవద్దూ? దీని ప్రభావం యువకులమీదా, పిల్లల మీదా ఎట్లా వుంటుంది? ఈ ప్రశ్నల్ని మనం బాగా ఆలోచించాలి. మనం చేయాల్సినదేమిటో ముందు చూపుతో ఆలోచించాలి. మనం సరియైనదని భావించినదాన్ని ఆచరించడానికి ప్రయత్నిస్తున్నామా అని ఆలోచించాలి. ఈ నాడు మనందరిలో సమైక్యత వెల్లివిరిసింది. అయితే యుద్ధంవల్లనే యీ సమైక్యత ఏర్పడలేదనీ మన మౌలిక లక్ష్యాలవల్లనే ఏర్పడిందనీ చెప్పుకోగలగాలి. మన సమైక్యత మన ఆలోచనలోనే అంతర్భాగమై వుండాలి. అటువంటి సమైక్యతే పటిష్టంగానూ, స్థిరంగానూ వుంటుంది. అటువంటి సమైక్య శక్తితోనే ఒక దేశం పురోగమించగలుగుతుంది. యుద్ధానికి సంబంధించి అవసరమైన చర్యలన్నీ తీసుకోవడం జరిగింది. ఇంకా తీసుకుంటున్నాంకూడా.

సరిహద్దులో పోరాడుతున్నవారిపైనే మన ఆలోచనలన్నీ వున్నాయి. మన ప్రార్థనలూ, మన ఆశీర్వాదాలూ వారికున్నాయి. వారి ధైర్యసాహసాలకూ, భారతదేశంలోని తమ సోదరులను సోదరీమణులను కాపాడడానికి వారు ప్రదర్శిస్తోన్న ధోరణికీ మనం గర్విస్తున్నాం. అయితే మొత్తం దేశ ప్రజ యావత్తూ వారికి అండగా నిలిచివున్నారన్న నమ్మకాన్ని వారిలో కలిగించాలి. దేశం గురించి పోరాడుతున్నామన్న గాఢమైన భావనను వారిలో కలిగించాలి. అలా చేయడం మన ప్రతి ఒక్కరి కర్తవ్యం. దేశమంతా ఒక్కటిగా నిలవాలి. ఆరోగ్యవంతంగా, ప్రగతి పథగామిగా వుండాలి. పేదరికాన్ని రూపుమాపేందుకై సోషలిజం మార్గంలో పయనించాలి. ఈ విశ్వాసాన్ని మన జవాన్లలో, అధికార్లలో కలిగించాలి. నిజానికి ప్రతి ఒక్కరిలోను కలిగించాలి.

మన సైన్యాన్ని కీర్తించేటప్పుడు ఏ శిక్షణాలేని ఆ ముక్తి వాహిని సాహసులను పొగడకుండా ఎలా వుండగలం? ముక్తి వాహినిలో చేరినవాళ్ళలో కొందరు పన్నెండేళ్ళ బాలురుకూడా వున్నారు. ఏదో కొద్దిపాటి శిక్షణపొంది పోరాటంలోకి ఉరికినవారే ఆ విధంగా వారు పోరాడారంటే, యింకా పోరాడుతున్నారంటే అవి మామూలు ధైర్యసాహసాలు కావు. అంతరాంతరాలలో మనిషిని నిలువునా దహించివేసే ఏ శక్తో వున్నప్పుడే పురుషుడికానైనా, స్త్రీకానైనా, బాలుడికైనా అంతటి బలం పుట్టుకొస్తుంది. ఈ స్వాతంత్ర్య పిపాస దావానలంలా వారి హృదయాలను మండిస్తోంది. దాని పరిణామే వారు కన్న కలలు ఫలించి బంగ్లాదేశ్ అవతరించడం. అయితే దాని పునాదులు పుటాల్సినంత పటిష్టంగా యింకా కాలేదు. ఎంతో సాహసంతో పోరాడిన యిక పోరాడుతోన్న బంగ్లాదేశ్ నాయకులు చిట్టచివరికి విజయం సాధించి తీరుతారని మన ఆశ. ఈ తుపాకుల పోరాటం యిటీవలిదేకాని దీని తాలూకు దుఃఖ గాధ మాత్రం చాలా కాలంనాటిది. ఒక కొత్త దేశాన్ని రూపొందించుకుని, ఒక స్వతంత్ర రాజ్యంగా అవతరించ డానికి ఇన్నాళ్ళకు వారికొక అవకాశం వచ్చింది. వారి స్వ విషయాల్లో భారతదేశం కల్పించుకోవాలనుకోవడం లేదు. అలా కల్పించుకోకుండా, మనం కోరేది కేవలం స్నేహంతో మెలగాలనే. అలా మెలిగి, రెండు ఇరుగు పొరుగు దేశాలు స్నేహంతో ఏ విధంగా జీవించగలవో ఒకరి ఆంతరంగిక విషయాల్లో మరొకరు జోక్యం కలిగించుకోకుండానే ఒకరికొకరు సహాయపడుతూ, ఒకరినొకరు పటిష్టపరచుకుంటూ ఎలా మనగలరో ప్రపంచానికి తెలియజెప్పాలనే మన ఆకాంక్ష.

బంగ్లాదేశ్ లో వున్న పాకిస్తాను సైన్యం ఆ ప్రజల యిష్టంతో అక్కడకు వెళ్ళలేదు. బంగ్లాదేశ్ ప్రజలు కోరుకుంటున్న దేమిటో పాకిస్తాను సైన్యం కళ్ళారాచూసింది. ముక్తి వాహిని దళ తోపాటు మన జవాన్లు ఎక్కడకు వెళ్ళినా ఘనస్వాగతం లభించడం వారు చూసారు. అందుచేత వాస్తవాన్ని గుర్తించవలసిన బాధ్యత, అక్కడనుంచి ఉపసంహరించుకుంటామని వారు ప్రకటించవలసిన బాధ్యత పాకిస్తానుమీదవుంది. ఆవిధంగా తొలగిపోతేవారికీ, బంగ్లాదేశ్ ప్రజలకు మధ్య ఎలాటి వైరమున్నా అది కొంతవరకు సడలిపోయి భవిష్యత్తులో వారిరువురూ స్నేహితులుగా మెలగడానికి వీలువుంది. ఈనాడు వారు తమ స్వగృహాలకి తరలి వెళ్ళిపోతే యీ విధమైన స్నేహ వాతావరణానికి యిది తొలి సోపానం అవుతుంది. నిజమో అబద్ధమో గాని వారు ఆ విధంగా చేయాలనే అనుకుంటున్నట్టు విన్నాను. అనేక సార్లు వారు ఆవిధంగా ఉపసంహరించుకోడానికై సందేశాలుకూడా పంపారు. కాని అక్కడ వచ్చిన పాకిస్తానులో వాళ్ళ యిళ్ళల్లో సుఖంగా ముడుచుకు కూచున్న యుద్ధంలో పాల్గొని ఆ వ్యక్తులుమాత్రం అందుకు ఒప్పుకోడం లేదు. దీనికి కూడా భారతదేశాన్నే తప్పుపడుతున్నారు.

ఐక్యరాజ్య సమితికి చెందిన కొంతమంది ఢాకానుంచి బయట పడాలని చూస్తున్నారు. అక్కడనుంచి సులభంగా బయటకు వెళ్ళడానికి అనుమతివ్వవలసిందని అందుకు వీలుగా విమాన దాడులను నిలుపుచేయ వలసిందని మనని కోరారు. ఆవిధంగా చేయగలంచి, వారు ఎప్పుడు రాదలిస్తే అప్పుడు సురక్షితంగా రావచ్చునని భారత దేశం వారికి తెలియచేసింది. అయితే వారికి భారతదేశం సహాయం కావాలంటే వారు కలకత్తాకు రావలసివుంటుందని, అక్కడనుంచి సురక్షితంగా వెళ్ళిపోవచ్చునని చెప్పింది. కలకత్తా వరకు వారువచ్చే ఏర్పాట్లు చేస్తాం. అక్కడనుంచి వారికి యిక ఏ విధమైనప్రమాదమూ వుండదు. అయితే వారి విమానాలు అక్కడ వెళ్ళేటప్పుడు

అక్కడి ఢాకా విమానాశ్రయంలో దిగడానికి పాకిస్తాను అనుమతించలేదు. అప్పటికి ఆ విమానాశ్రయం పాకిస్తాను అధీనంలోనే వుంది. అటువంటప్పుడు పాకిస్తాను చేసిన ప్రచారం ఏమిటి? విమానాలు వెళ్ళడానికి భారతదేశం అనుమతిచ్చి, తీరా అవి అక్కడకు వెళ్ళాక ఆ విమానాశ్రయంలో దిగడానికి అనుమతివ్వలేదని ప్రచారంచేసింది. ఇలాటి అబద్ధాలనే ఎన్నింటినో ప్రచారం చేసింది. ఢాకాలోనే యింకా వుండిపోయిన విదేశీయుల్ని ఖాళీ చేయించడానికి భారతదేశం అడ్డుపడుతున్నదని పాకిస్తాను చెప్పుకో వచ్చుగనుక ఆ విదేశీయుల్ని ఏదో ఒక విధంగా పాకిస్తానే ఖాళీ చేయించేందుకు భారతదేశం వీలైనన్ని చర్యలన్నీ తీసుకుంది. వారికి ఏవిధమైన ఆపదాలేదు. తమ స్వదేశాలకు సురక్షితంగా, సుఖంగా వారు వెళ్ళవచ్చు. ఇది మనకృషి ఫలితమే అయితే మళ్ళీ ఎప్పుడైనా దాడిజరగొచ్చనీ మనపై ప్రచారం మాత్రం కొనసాగుతూనేవుంది. హెచ్చరికలు కూడా చేశారు. పరుషంగా మాటా వదలచలేదు మనం. ఏ దేశానికీ ఎలాటి హెచ్చరికా చేయాలనుకోడం లేదు మనం. కాని మనం మాత్రం దృఢచిత్తంతో వ్యవహరించాలి.

మన పౌరులు తమ విద్యుక్తధర్మాన్ని నిర్వర్తిస్తారన్న ఆశ నాకుంది. ఇంటింటా, వీధి వీధినీ కూడా ప్రతి ఒక్కరూ యితరులకు తమబాధ్యతలను గురించి చెప్తారన్న విశ్వాసం నాకువుంది. ఈ బాధ్యత లేమిటో మీకుతెలుసు. ధరలు పెరగనివ్వకూడదు. దుకాణాలలో వస్తువుల్ని దాచిపెట్టకూడదు. పొదుపును పాటించడానికి ప్రయత్నించాలి. ఇవన్నీ మీకు తెలుసు. ఇలా విని అలా మర్చిపోయే విషయాలు కావివి. నేటి పరిస్థితుల్లో ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడు, ప్రతి బాలుడు, ప్రతి బాలిక ఒక సైనికుడే. దేశం పటిష్ఠవంతంగా వుండేట్టు ప్రతి ఒక్కరూ చూడాలి. మనకు అవసరమైనవాటిని, ఆఖరుకు మనకు అవసరంలేని వాటిని కూడా వృధాచేయకూడదు. అటువంటి క్రమశిక్షణతోనే యీనాటి పరిస్థితిని ఎదుర్కొనగలం, ఈ కష్టకాలాన్ని అధిగమించగలం.

ఈ రోజున ఒక విషాద సంఘటన సంభవించింది. భారత స్వాతంత్ర్య సమర సైనికుడూ, మన చిరకాల మిత్రుడూ అయిన కాశ్మీరు ముఖ్యమంత్రి శ్రీ గులాం మహమ్మద్ సాదిక్ మరణించారు. కొన్ని నెలలుగా ఆయన అస్వస్థులై వున్నారు. గత రెండు వారాలుగా ఆయన పరిస్థితి రోజురోజుకూ విషమిస్తూ వచ్చింది. ఇవ్వాళ ఆయన స్వర్గస్థులయ్యారు. నేను బహుశా 1935లో కాబోలు ఆయనను మొట్టమొదటిసారి కలుసుకున్నాను. ఆ రోజుల్లో ఆయన కాశ్మీరులో పోరాటం జరుపుతున్న కొద్దిమందిలో ఒకరు. మొదట కాశ్మీరు మహారాజుతోనూ, ఆ తర్వాత ఆంగ్లేయులతోనూ, ఆటు పిమ్మట దురాక్రమణ జరిపిన పాకిస్తాన్‌తోనూ పోరాటం జరిపిన వారిలో ఆయన ప్రముఖులు. అక్కడికి భారతసైన్యం వెంటనే చేరుకొనలేక పోయినప్పుడు పాకిస్తాను దుండగుల కిరాతకాలకు గురయ్యారు. దురాక్రమణ దారుని ప్రతిఘటించడానికి యువకులు, ముదుసలులు అందరూ కలిసికట్టుగా నిలబడే విధంగా ప్రజల్ని తయారుచేశారు. ఆ విధంగా ఆయన కాశ్మీరు ప్రజలకు సక్రమ మార్గాన్ని చూపారు. ఆనాడే భారతదేశం ఎలాటిదో ప్రపంచానికి తెలిసివచ్చింది. అందుకనే అవకాశం వచ్చినప్పుడు, భారతదేశంలో కలిసిపోవడానికే కాశ్మీరు నిశ్చయించుకుంది. ఆ రోజుల్లో ఆయన్ను ముస్లిం లీగులో చేరిపోవలసిందని, లేదా మతం ప్రతిపాదికగా వున్న మరో మార్గమేదైనా అనుసరించ వలసిందని ఎన్నో ప్రలోభాలకు గురిచేశారు. కాని ఆయన మనం ఏ సిద్ధాంతాలకు ఆదర్శాలకు కట్టుబడి వున్నామో ఆ సిద్ధాంతాలకూ, ఆదర్శాలకే కట్టుబడి దృఢచిత్తంతో వ్యవహరించారు. ఆ సిద్ధాంతాలమీదనే కాశ్మీరు ప్రగతి సాధించడానికి కృషిచేశారు. ఈ నాటికీ కూడా చేస్తు వచ్చారు. ఆయన సలహాలు దక్షత, అనుభవం ఎంతో అవసరమైన తరుణంలో ఆయన మనల్ని వీడిపోయినందుకు మనమెంతో దుఃఖిస్తున్నాం. ఆయన్ను అభిమానించిన, గౌరవించిన కాశ్మీరు ప్రజలు మరింతగట్టిగా మరింతపట్టుదలతో ఆయన చూపించిన మార్గాన్ని అనుసరిస్తారని నాకు తెలుసు. అన్నిమతాలవారూ కలిసికట్టుగా మెలిగి దారిద్ర్యాన్నీ వెనుకబడినతనాన్నీ నిర్మూలించేందుకు, కాశ్మీరును ప్రజలు ఏవిధంగా తీర్చిదిద్దాలని సాదిక్ సాహెబ్ కోరారో ఆవిధంగాతీర్చి దిద్దగలరని నాకు నమ్మకం వుంది.

ఒకజాతి జీవితంలోనూ, ఒకవ్యక్తి జీవితంలోనూ, యిటువంటి దుఃఖ సమయాలు అనేకం వుంటాయి. ఇటువంటి దుఃఖానికి కుమిలిపోకుండా అధిగమించినప్పుడే మన మనో నిబ్బరం స్పష్టమౌతుంది. ఇటువంటి కష్టాలను, ఆపదలను ధైర్యంతో ఎదుర్కొని మన ప్రగతి మార్గంలోవుండే అడ్డంకులన్నింటినీ తొలగించుకోవాలి. అడ్డంకులు ఏర్పడ్డప్పుడు మనమంతా కలిసికట్టుగా భుజం భుజం కలిపి దాన్ని తొలగించాలి.

అటువంటి ఆటంకాలే యీనాడు ఏర్పడ్డాయి. ఈ పరిస్థితులో మనమంతా ఒకటై నిలిచి, మనం ఎన్నుకున్న మార్గంలో శత్రువు మనల్ని ఆటంకపరచకుండా వుండేందుకు మనశక్తినంతా కేంద్రీకరిస్తున్నందుకు మిమ్మల్ని అందరినీ అభినందిస్తున్నాను. మన శత్రువు పాకిస్తాను కాదు. పాకిస్తాను ప్రజలతోకూడా మనకు శత్రుత్వంలేదు. పాకిస్తాను ప్రజలు యీనాడు రాగద్వేషాలకులోనై మనల్ని నిందిస్తే నిందించవచ్చు. కాని పాకిస్తాను ప్రజలు సైతం దారిద్ర్యంతో బాధపడుతున్నవారే. అణగద్రొక్కబడుతున్నవారే. ఈ నాటికీ వారికంఠం వినిపించడమేలేదు. ఈ నాటి పరిస్థితికి సంబంధించిన వాస్తవ విషయాలు వారికి తెలిసివుంటే వారు సాయుధ సంఘర్షణ మార్గాన్ని అవలంభించరని నా దృఢ విశ్వాసం వారుకూడా తమ పేదరికాన్ని రూపుమాపుకొని తమ దేశం స్వశక్తి మీద నిలబడగలిగేట్టు చేసే మార్గాన్నే అవలంభించాలని కోరుకుంటున్నారని గట్టిగా చెప్పగలను. కాని వారిని తప్పుదారులు పట్టిస్తున్నారు. మనం యితర దేశాల నాయకులమీద ఆధారపడి వుండకుండా, మనకు మేలైన మార్గాన్ని అనుసరించడమే సరియైన పద్ధతి. ఇతర దేశాలమీద ఆధారపడి అగ్రరాజ్యాలనుంచి సైనిక సహాయం పొందుతున్న ఏ దేశంకూడా పటిష్ఠమైన దేశంకాలేదు. పైపెచ్చు అది రోజు రోజుకు బలహీనపడిపోయి ఆ బరువును మోయలేక దానికిందపడి మూలుగుతుంటుంది. పాకిస్తాను విషయంలో అక్షరాలా యిదే జరిగింది. తనకు అగ్రరాజ్యాలు సహాయం చేస్తున్నాయి గనుక తన ప్రజలమాట వినక్కరలేదని పాకిస్తాను

పాలకులు అనుకున్నారు. యుద్ధం అన్ని అయిపోయి వున్నప్పుడు, తమకు అండగా ఆర్థిక సహాయం అందిస్తున్నప్పుడు ప్రజాస్వామ్యంతో ఏమాత్రం సంబంధం ఏం వుంది ? పెద్దలు మాటలని మేము ఎందుకు వినాలి ? బెంగాలీవాళ్ళుగాని, ఫఖ్తూను వాళ్ళుగాని చెప్పేమాటల్ని మేము ఎందుకు వినాలి ?—ఇదీ వారి ధోరణి. ఈనాడు పాకిస్తాను బలహీనంగా వుందంటే, దానికి ఆయుధాలు సరఫరా చేస్తున్నవాళ్ళే బలహీనపరచారని ఘంటాపథంగా చెప్పగలను. పాకిస్తాను చిక్కుల్లో పడిందంటే దానికి ఆ సహాయంచేసిన వారిదే తప్పంతా అంటాను నేను. ఇప్పటికికూడా ఆ అగ్రరాజ్యాలకు మనమంటే అసూయ ఎందుకంటే వారి సహాయం మనం అడగలేదు గనక. మన స్వాతంత్ర్యం పటిష్టంగా లేనప్పుడు ఆ విధమైన సహాయంతోకూడా గట్టిపరచుకోలేమని మనకి తెలుసు. మన స్వాతంత్ర్యం పటిష్టంగావున్నప్పుడు యితరుల సహాయం లేకుండానే దృఢంగా వుంటాం ఏది చేయాలనుకుంటామో దాన్ని సాధించి తీరుతాం.

ఢిల్లీ నగర సోదర సోదరీమణులారా ! అనేకసార్లు మీరు నా ప్రసంగం విన్నారు. మీరో చాలామంది చెప్తున్నవన్నీ అనేకఏళ్ళుగా నేనూ వింటున్నాను. మనమధ్య ఒక విధమైన అనుబంధం ఏర్పడింది ప్రజలకు ప్రభుత్వానికి మధ్యగల యీ అనుబంధాన్ని మనం మరింత గట్టిపరుచుకోవాలి. ఎందుకంటే మనం ఏమార్గంతో ప్రయాణంచేయాలో దానికి సంబంధించిన విధానాల గురించి, కార్యక్రమాలగురించి అనవగాహనకు తావుండడానికి వీల్లేని సమయం యిది. సరైన మార్గంలో మనమంతా ప్రయాణం చేయాలి. అప్పుడేమనం పటిష్టంగా వుండగలం. అనాడే మన కష్టాలు గట్టెక్కుతాయి ఈ పరిస్థితుల్లో మనం యూనిఫారంలో వున్నా లేకున్నా, మన చేతుల్లో తుపాకులు వున్నా లేకపోయినా మనమంతా సైనికులమే సరిహద్దుల్లో పోరాడుతున్న సైనికులకు మనమేం తీసిపోం. ఈరకమైన ఆలోచనతోనే మనమంతా పని చేద్దాం. అనాడే మనం సరిహద్దుల్లోవున్న జవాన్లకు సహాయపడగలం.

అంతా ఏకకంఠంతో ' జై హింద్ ' అందాం. జై హింద్ అంటే భారత దేశానికి విజయం అని అర్థం. మరోసారి యింకా గట్టిగా ముక్తకంఠంతో అందాం. ఈ ఢిల్లీలో వుండే మీరంతా ఎంతగట్టిగా అనగలరో చూస్తాను. ఏదీ యీ చుట్టుపట్లవున్న పాతమేడలన్నీ దద్దరిల్లిపోయేలా అనాలి. ఈ నినాదాన్నివ్వడానికి మనమంతా ఎలా ఏకమయ్యామో అలా ఏకమౌదాం. భారత్ విజయం పొందడానికి మనమంతా ఒకేవ్యక్తిగా పురోగమిద్దాం" ★



ఇటీవలి భారత–పాకిస్తాన్ సంఘర్షణలో అద్భుతమైన నైపుణ్యాన్ని ప్రదర్శించినందుకు మన త్రివిధ బలాల అధిపతులను డిసెంబరు 18న రాష్ట్రపతి శ్రీ వి.వి. గిరి రాష్ట్రపతి భవన్‌లో అభినందించినప్పటి దృశ్యం.

అమెరికా అధ్యక్షునికి భారత ప్రధాని లేఖ

భారత ప్రధాన మంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ గత డిసెంబరు నెలలో అమెరికా అధ్యక్షుడు గౌ. రిచర్డ్ నిక్సన్‌కు వ్రాసిన ఉత్తరం పూర్తి పాఠం :

ప్రియమైన అధ్యక్షా,

మన రెండు దేశాల సంబంధాలు దురదృష్టకరమైన మలుపు తిరిగిన అతి బాధాకర సమయంలో యీ లేఖ వ్రాస్తున్నాను.

అన్ని రాగద్వేషాలనూ ఆవలకు నెట్టి, యీ విపత్కర పరిస్థితుల పట్టుపూర్వోత్తరాలను గురించి చాలా నిదానంగా వివరించడానికి ప్రయత్నిస్తున్నాను.

గత కాలపు ఉజ్జ్వల క్షణాలు

వెనుకటి వైభవోజ్జ్వల క్షణాలను మననం చేసుకోవడం ద్వారా ప్రస్తుతం ఆవరించుకుని వున్న విపత్తును, దాని చీకటి నీడలను కొంత వరకు తొలగించుకో వచ్చునని చరిత్ర ఋజువు చేస్తున్నది.

స్వేచ్ఛకై లక్షలాది ప్రజలు ప్రాణత్యాగం చేయడానికి పురికొల్పిన అటువంటి వైభవోజ్వల క్షణం— అమెరికా స్వాతంత్ర్య ప్రకటన. మనిషి జీవించడానికి, స్వేచ్ఛకు, ఆనందానికి ఏవిధమైన ప్రభుత్వమైనా అటంకంగా వున్నప్పుడు ఆ ప్రభుత్వాన్ని మార్చి వేయడంగాని, లేదా నిర్మూలించడంగాని ఆ ప్రజల హక్కు అని ఆ ప్రకటన స్పష్టం చేస్తున్నది.

బంగ్లాదేశ్‌లో మార్చి 25వ తేదీ మొదలుకొని జరుగుతున్న సంఘటనలన్నీ నిష్పక్షపాత వైఖరితో చూసే వారందరికి అక్కడి ఏడున్నర కోట్ల ప్రజలు తమకు జీవించడానికి గాని, స్వేచ్ఛకు గాని చివరకు ఆనందానికి గాని ఏమాత్రం అవకాశం లేక తిరుగుబాటు చేసిన విషయం స్పష్టంగా గుర్తించ గలరు. ప్రపంచ పత్రికలు. రేడియో, టెలివిజను చాలా వాస్తవంగా దీన్ని ప్రకటించాయి.

ఈ ఉప ఖండంలోని పరిస్థితుల్ని అర్థం చేసుకున్న అమెరికన్ విజ్ఞులు తూర్పు బెంగాలులో నెలకొన్న నిరాశా నిస్పృహల స్వరూప స్వభావాలను వెల్లడి చేశారు.

పాకిస్తాను డిసెంబరు 3వ తేదీన మాపై చేసిన దురాక్రమణకు ముందు ఆ తొమ్మిది నెలల కాలంలోనూ ప్రపంచ అగ్రనాయకులు ఆ తిరుగుబాటుకు సంబంధించిన విషయాలపై కొంత శ్రద్ధ వహించి పరిస్థితుల యథార్థాన్ని దర్శించడానికి ప్రయత్నించి చిత్తశుద్ధితో రాజీకి ప్రయత్నాలు చేసివుంటే యీ నాడు జరుగుతున్న యీ దురదృష్టకరమైన యుద్ధం నివారింపబడి వుండేది.

ఆలా నేను పుత్తరాలు కూడా వ్రాశాను.

ఇక్కడి పరిస్థితుల్ని నేను అర్థంచేసుకున్న విధంగా ప్రపంచంలోని కొన్ని దేశాల నాయకులకు తెలియజెప్పే వుద్దేశంతో, దేశం వదలి వెళ్ళడం చాలా కష్టం అయిన సమయంలో కూడా, శాంతిని అన్వేషిస్తూ నేను ప్రపంచ పర్యటన చేశాను. అయితే, శరణార్థుల పట్ల సానుభూతి చూపడం మాత్రం జరిగిందికాని, అసలు మూలకారణాలను వారు నిర్లక్ష్యం చేశారు.

ముజిబుర్ రహమాన్ విడుదల

ప్రపంచ దేశాలకు, ముఖ్యంగా అమెరికాకు వున్న శక్తి సామర్థ్యాలు, ప్రభావం, అధికారం వినియోగించి షేక్ ముజిబుర్ రహమాన్‌ను విడుదల చేయించివున్నా యీ యుద్ధం నివారించబడి వుండేది.

దానికి బదులు, పాకిస్తాన్‌లో పౌర పరిపాలన ఏర్పాటు చేయబడుతున్నదని మాకు చెప్పారు. ఈ పౌర పరిపాలన అంతా

ఒక తతంగం మాత్రమేనని ప్రతి ఒక్కరికీ తెలుసు. ఆ తతంగమే యిప్పుడు ఒక విషాద గాథగా మారింది.

బయటి ప్రపంచం వారెవరూ ముజిబుర్ రహమాన్‌ను కలుసుకోవడానికి ప్రయత్నించిన దాఖలా కనిపించడం లేదు. షేక్ ముజిబుర్ రహమానును విడుదల చేయాలని లేక నిర్బంధంలో వుంచినా, ఆయనను కలిసి మాట్లాడే ఏర్పాటు జరగాలని మేము మనస్ఫూర్తిగా చేసిన అభ్యర్థన ఆచరణ యోగ్యం కాదని త్రోసి వేయడం జరిగింది. అధ్యక్షుడు యాహ్యాఖాన్ పదవి నుండి దిగవలసి వచ్చే విధానాలను అనుసరించవలసినదని అమెరికా కోరలేదు అనీ, అందువల్ల అది ఆచరణ సాధ్యంకాదని చెప్పారు.

ఈ పరిస్థితి పరిష్కారానికి ముజీబ్ ప్రధానమైన అంశం అని, భవిష్యత్తులో తూర్పు పాకిస్తానుకు మరిన్ని విస్తృత అధికారాలు పాకిస్తాను యివ్వక తప్పదని అమెరికా గుర్తించినప్పటికీ యీ అంశం చాలా సున్నితమైనదిగా, యాహ్యాఖాన్‌కు యిది యిబ్బందికరమైనదిగా చెప్పడం జరుగుతున్నది.

అధ్యక్షా! ఒకే ఒక వ్యక్తి, షేక్ ముజిబుర్‌ను విడుదల చేయడంగాని, లేదా రహస్య సమాలోచనలు జరపడంగాని ఒక యుద్ధంకన్న వినాశకరమైనదా?

మానవ హక్కులు, స్వేచ్ఛ

అసలు విషయమేమిటంటే పాకిస్తాను పాలకులు తమకు తోచిన విధంగా చేయవచ్చుననే భ్రమలో వున్నారు. కారణం, పాకిస్తాను సమగ్రత అనేది తప్పనిసరిగా పవిత్రమైనదే అయినా మానవ హక్కులు స్వేచ్ఛ కూడా అంతకు ఏమాత్రం తక్కువ కావనీ, మాతృదేశ పవిత్రతను భంగపరచకుండా వుండడానికీ ఆ దేశ ప్రజలు సంతృప్తితో వుండడానికీ మధ్య సంబంధం అవసరం అనీ బహిరంగంగా ఎవరూ కూడా, చివరకు అమెరికా సైతం చెప్పరులే అని భ్రమపడ్డారు.

అధ్యక్షా! నేను దూరంగా కలకత్తాలో వుండగా నా సహాధ్యాయి రక్షణమంత్రి పాట్నా వెళ్ళి యింకా అక్కడనుండి దక్షిణాదిలో బెంగుళూరుకు వెళ్ళడానికి సిద్ధంగా వుండగా, మరో సీనియర్ సహాధ్యాయి ఆర్థికమంత్రి బొంబాయిలో వున్న సమయంలో 1971 డిసెంబరు 3న పట్టపగలు అమృత్‌సర్, పటాన్‌కోట్, శ్రీనగర్, అవంతీపూర్ అడ్డర్‌లాయ్, జోధ్‌పూర్, అంబాలా, ఆగ్రాలలోని మా విమానాశ్రయాల మీద బాంబులు కురిపించి భారీ ఎత్తున పాకిస్తాను పాలకులు మాపై దురాక్రమణకు తలపడక పోయి వుంటే యుద్ధం వచ్చి వుండేది కాదు. ప్రాథమిక జీవన సూత్రాల విషయంలో పాకిస్తాను పాలకులు ఆదినుంచీ భిన్నమైన ధోరణి అవలంబిస్తున్నప్పటికీ సుదీర్ఘమైన తొమ్మిది నెలలుగా మేము యీ పరిస్థితిని భరించి సహనాన్ని చూపుతున్న విధంగానే యిప్పుడూ సహనం వహించి వుండేవాళ్ళమే.

మేము రాజధానిలో లేకపోవడం చూసుకుని యీ దురాక్రమణకు తలపడ్డారంటే, ఇది వారి కుతంత్రాన్నే సూచిస్తున్నది.

ఇటువంటి పరిస్థితుల్లో మేము పాకిస్తాను పాలకులకుగాని వారికి సహాయం ఇస్తున్న వారికిగాని శాంతియుతమైన, నిర్మాణాత్మకమైన, సహేతుకమైన ఆలోచనలు వున్నాయని భావించి చేతులు ముడుచుకు కూర్చోగలమా?

మేము ఏం కావాలని అడుగుతున్నారు. మాకేమీ అక్కర లేదు. ఒకప్పుడు తూర్పు పాకిస్తానుగా వుండిన యీనాటి బంగ్లాదేశ్ భూభాగం ఏదీ మాకు అక్కరలేదు. పశ్చిమ పాకిస్తాను భూభాగమూ మాకు అక్కరలేదు. పాకిస్తానుతో శాంతి మాత్రమే మాకు కావాలి. గత 24 సంవత్సరాలుగా కాశ్మీరు విషయంలో పాకిస్తాను చేస్తున్న నిష్ప్రయోజనమైన నిర్హేతుకమైన ఆందోళనని అది వదులుకుంటుందా? పాకిస్తాను భారత్‌పై చేస్తున్న విద్వేష ప్రచారాన్ని, చిరకాలంగా అనుసరిస్తున్న విరోధ దృక్పథాన్ని మానుకుంటుందా? గత ఇరవై నాలుగేళ్ళగా నేనూ, మా తండ్రిగారూ పాకిస్తానుతో శాంతి ఒప్పందానికి ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేయలేదు? ప్రతిపాదన చేసిన ప్రతిసారీ పాకిస్తాను నిర్ద్వంద్వంగా దాని తిరస్కరించడం చరిత్ర ఎరిగిన సత్యమే.

ఈ విపత్తుకు కారణం మేమనే ధోరణి, యీ సమస్యా పరిష్కారాన్ని మేము అడ్డంకం కలిగిస్తున్నామనే ధోరణి మాకు చాలా బాధ కలిగించాయి. ఈ విపత్కర పరిస్థితికి బాధ్యులెవరో నాకు నిజంగా అర్థం కాకుండా వుంది.

ఈ సమస్యకు వెంటనే రాజకీయ పరిష్కారం అవసరమని నేను అమెరికా, ఇంగ్లాండు, ఫ్రాన్సు, జర్మనీ, ఆస్ట్రియా, బెల్జియం దేశాలకు వెళ్ళినప్పుడు బాహాటంగానూ, వ్యక్తిగతంగానూ గట్టిగా నొక్కి చెప్పాను. ఎంతమకై తొమ్మిది నెలలపాటు మేము వేచివున్నాం. 1971 ఆగస్టులో కిసింగర్ వచ్చినప్పుడు త్వరలోనే రాజకీయ పరిష్కారం సాధించవలసిన అవసరాన్ని గూర్చి నొక్కి చెప్పాను. సమస్యలను మనం ఊహిస్తున్న విధంగా కాకుండా యథాతథంగా దృష్టిలో వుంచుకుని పరిష్కరించడానికి వీలైన సూత్రీకరణకు ఆశలు యింతవరకు మాకు అందనేలేదు. సరే అది అలా వుంచండి. ఒక మహోన్నతమైన అమెరికా దేశపు ప్రజల ఆదర్శాలు అభిప్రాయాలకు ప్రాతినిధ్యం వహించే అమెరికా అధ్యక్షులైన మీరు, సమస్యలను స్పష్టంగా అవగాహన చేసుకున్న మీరు యీ విషయాన్ని తెలియజేయమని మనస్ఫూర్తిగా కోరుతున్నాను. మీ పత్రికలు, లేదా మీ తరఫున మాట్లాడే వారు మమ్మల్ని అంతగా పరుషోక్తులతో నిందించడానికి కారణమేమిటి? మేం చేసిన తప్పేమిటి?

గౌరవాభివందనములతో

ఇట్లు,

(సం) ఇందిరా గాంధి

ఫిబ్రవరి, 972

పాకిస్తాన్‌కు అమెరికా ఆయుధాలు

(1965 సెప్టెంబరు నుండి 1971 అక్టోబరు వరకు)

సెప్టెంబరు 18, 1965

పాకిస్తాన్‌కు చైనానుండి 250 టాంకులు అందాయి. నాటో సంస్థకు చెందిన అదనపు టాంకుల్లో మరమ్మత్తు చేయబడిన 100 పాటన్ టాంకులు యూరోపియన్ దేశాల ద్వారా యీ రోజున పాకిస్తాన్‌కు అందచెయ్యబడ్డాయి.

ఆగస్టు 6, 1966

ఆయుధాల సప్లయ్‌పై అమెరికా పెట్టిన కాలపరిమితిని, విధి నిషేధాలను పాకిస్తాన్ అధిగమించగలిగింది. పశ్చిమ జర్మనీ నుండి 90 ఎఫ్_86 లతో బాటు, టర్కీ, ఇరాన్, పోర్చుగల్, దక్షిణాఫ్రికాల నుండి స్పేర్ పార్టులను తెప్పించుకుంది. 125 మిగ్_17లను, మిగ్_19లను, 270 టాంకులను సరఫరా చెయ్యడానికి చైనా ఆమోదించింది. అప్పటికే అది 100 టాంకులను, 60 విమానాలను అందజేసింది.

నవంబరు 23, 1968

అమెరికా చూసీచూడనట్లు సందిచ్చిన మీదట, టర్కీనుండి 100 నుండి 200 ఎమ్ 47 టాంకులను పాకిస్తాన్ సంపాదించుకొంది.

జూన్ 8, 1969

ఇటీవలి మాసాల్లో నాటో అదనపు స్టాకులనుండి 100 కు పైగా మరమ్మత్తు చెయ్యబడిన పాటన్ టాంకులను పాకిస్తాన్‌కు అమెరికా సప్లయ్ చేసింది. రష్యా నుండి 100 టి యు. 54 టాంకులు వచ్చాయి.

మార్చి 15, 1970

గత సంవత్సరం మొదటి అర్థభాగంలో స్వీడన్ నుండి పాకిస్తాన్‌కు రూ. 16,05,000 విలువగల ఆయుధాలు అందాయి.

అక్టోబరు 18, 1970

అమెరికా_పాకిస్తాన్ పరస్పర రక్షణ ఒడంబడిక కార్యక్రమం మేరకు, 1954_1965 మధ్య, పాకిస్తాన్‌కు రూ. 1,125 కోట్ల విలువగలిగిన సైనిక సామగ్రి ఒకమారు, రూ. 1500 కోట్ల విలువ గలిగిన సైనిక సామగ్రి ఒకమారు ముట్టాయి. బి_57లు, ఎఫ్_104 లు, సి_13 లు, ఎఫ్_86 లు, వేర్వేరు రకాల 800 టాంకులు పాకిస్తాన్‌కు అందాయి. 1965 నుండి పాకిస్తాన్‌కు వివిధ దేశాలనుండి అందిన విమానాల వివరాలు: పశ్చిమ జర్మనీ నుండి 90 ఎఫ్_86 లు, చైనానుండి 5 స్క్వాడ్రన్‌ల మిగ్ 19లు, ఫ్రాన్సునుండి 25 మిరాజ్‌లు పాకిస్తాన్‌కు అందాయి. వీటికితోడు పాకిస్తాన్ యిటీవలనే ఫ్రాన్సు నుండి 30 మిరాజ్ విమానాలను కొంది.

మే 3, 1971

అమెరికాచే డిజైన్ చెయ్యబడిన 18 హెలికాప్టర్లను పాకిస్తాన్ ఇరాన్ నుండి సంపాదించుకొంది. ఇటలీ లైసెన్సుమీద వీటిని తయారుచేశారు. వీటిలో 12.7 ఎమ్. ఎమ్. మరతుపాకులను అమర్చుకొంది.

మే 19, 1971

సెనేటర్ చర్చ్ చెప్పినదాన్ని బట్టి, అమెరికా ప్రభుత్వం తనకు తానై పెట్టిన కాలపరిమితిని ధిక్కరించి పాకిస్తాన్‌కు మారణాయుధాలను అమ్మింది. రూ. 1.87 కోట్ల విలువ గలిగిన మందు గుండు సామగ్రితో బాటు, సంవత్సరానికి రూ. $7\frac{1}{2}$ కోట్ల విలువ గలిగిన మారణాయుధాలదాకా సగటున సంవత్సరానికి పాకిస్తాన్‌కు అమెరికా అమ్ముతోంది.

జూలై 3, 1971

గత సంవత్సరంనుండి 30 మిరాజ్ ఫైటర్ విమానాలను, మూడు సబ్ మెరైన్లను, 24 అలియోట్ హెలికాప్టర్లను పాకిస్తాన్ సమకూర్చుకొంది.

జూలై 9, 1971

అమెరికన్ సెనేటర్ ఫ్రాంక్ చర్చ్ చెప్పినదాన్ని బట్టి రూ. 26.25 కోట్ల విలువైన సైనిక సామగ్రి పాకిస్తాన్‌కు మార్గమధ్యంలో వుంది.

జూలై 23, 1971

పద్మ ఓడలో రెండు పడవలు డెలివర్ చెయ్యబడిన సైనిక సరకుల్లో ఒక్కొక్క మారు 4 విమానాలు, 113 పారాచూట్‌లు,

విడిభాగాలు, మోటార్ విడిభాగాలు, క్రిపెట్టెలు విగైరాలున్నట్లు "న్యూయార్క్ టైమ్స్" తెలియ జేసింది 1967 ఏప్రిల్ 30, 1970 మధ్య రూ. 3.6 కోట్ల విలువగల విమాన సామగ్రిని అమెరికా పాకిస్తాన్‌కు అమ్మినట్టు కూడా ఆ పత్రిక తెలియజేసింది.

జూలై 25, 1971

సుమారు రూ. 11.25 కోట్ల విలువైన ఆయుధాలను పాకిస్తాన్‌కు పంపాలని అమెరికా ప్రభుత్వం తలుస్తున్నట్లు సెనేటర్ స్టూవర్ట్ సిమింగ్టన్ వెల్లడించారు.

జూలై 30, 1971

పాకిస్తాన్‌కు చెందిన కప్తాయ్ అనే ఓడ మందుగుండు సామాగ్రితో బయల్దేరిందనీ, ఆగస్టు చివర్లోగా మరో నాలుగైదు ఓడలు బయల్దేరుతాయనీ అమెరికా స్టేట్ డిపార్టుమెంటు ప్రకటించింది. .22 కాలిబర్ రకం తుపాకులు రెండువేలు పద్మ ఓడపైనా "తూర్పు బెంగాల్లో వేట" కోసం పంపబడాయనీ సెనేటర్ ఎడ్వర్డు కెన్నడీ వ్యంగ్యంగా చెప్పిన విషయం గమనార్హం.



వరంగల్లు జిల్లా కలెక్టరు సతీమణి శ్రీమతి లక్ష్మీ మాధవరావు వరంగల్లులో జాతీయ రక్షణనిధి వసూలు చేస్తున్న దృశ్యం.

అక్టోబర్ 5, 1971

1971 జూన్ మాసంలో, అమెరికా అధ్యక్షుడు నిక్సన్, పాకిస్తాన్‌కు రూ. 7½ కోట్ల విలువైన సైనిక సామగ్రి అమ్మ దానికి సంసిద్ధత వ్యక్తం చేశారు. ఒకానొక కాంట్రాక్టు మేరకు సుమారు 2.14 కోట్ల రూపాయల విలువైన బి-57, సి- 30, ఎఫ్-104, హెచ్-43, టి-33 టి-37 రకం విమానాల విడిభాగాలు పాకిస్తాన్‌కు అందజేయబడతాయి వీటిలో ఇప్పటికే రూ. 2 85 కోట్ల విలువైనవి పాకిస్తాన్‌కు పంపబడ్డాయి. మరో రూ. 1 73 కోట్ల విలువైనవి త్వరలో పంపబడుతాయి.

అక్టోబర్ 8, 1971

మార్చి 26వ తేదీ దరిమిలా రూ. 2.85 కోట్ల విలువ గలిగిన సైనిక సామగ్రి ఓడలలో ఎక్కించడానికి అమెరికా అనుమతి యిచ్చింది. ఆయుధ సామగ్రి సరఫరా నిషేధం విధించకముందే లైసెన్సులు యివ్వబడినట్లు కారణం చెప్పారు.

అక్టోబర్ 16, 1971

న్యూయార్క్ టైమ్స్ పత్రికలో బెంజమిన్ వెల్స్ యిలా రాశాడు: సెంటోలో అమెరికాతో బాటు సభ్యురాలైన పాకిస్తాన్‌కు 954 దరిమిలా అమెరికా 1.5 కోట్ల విలువైన ఆయుధాలు పంపింది.

అక్టోబర్ 17, 1971

ఆ బెంజమిన్ వెల్స్, ఇంటర్నేషనల్ హెరాల్డ్ ట్రిబ్యూన్ లో యిలా వ్రాశాడు. 8,000 టన్నుల పాక్ ఓడ సిప్సా, పెట్టెం కొలది ఉత్తర కొరియావారి తేలికరకం ఆయుధాలను, మందుగుండు సామగ్రిని కరాచి రేవుకు చేరవేసింది.

అక్టోబర్ 20, 1971

పాకిస్తానుకు సౌదిఅరేబియా 75 అమెరికన్ యుద్ధవిమానాలను విరాళంగా యిచ్చిందని ఫైనాన్షియల్ పత్రిక తెలిపింది.

ఇరవై నాలుగేండ్లలో పది ప్రభుత్వాల పతనం

ఇరవై నాలుగేండ్ల నాడు పాకిస్తాన్ అవతరించింది. ఇప్పటికి అక్కడ 11 ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాయి. పీపుల్స్ పార్టీ అధ్యక్షుడు శ్రీ జడ్. ఎ. భుట్టో ప్రభుత్వం పదకొండవది.

భారత దేశ విభజనతో 1947 అగష్టు 15న పాకిస్తాన్ అవతరించింది. మహమ్మద్ ఆలీ జిన్నా గవర్నర్ జనరల్ అయినారు. లియాకత్ ఆలీఖాన్ ప్రధాని అయినారు.

స్వాతంత్ర్యానంతరం తొలి 11 సంవత్సరాలలోను పాకిస్తాన్‌లో ఏడు ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చి పతనమైనాయి.

1958 అక్టోబరు 8న ప్రెసిడెంట్ ఇస్కందర్ మీర్జా దేశమంతటా సైనిక శాసనాన్ని విధించారు. సాయుధ దళాల సుప్రీం కమాండర్‌గాను, సైనిక శాసన పరిపాలనాధికారిగాను జనరల్ మహమ్మద్ అయూబ్‌ఖాన్‌ను నియమించారాయన.

1958 అక్టోబరు 28న ప్రెసిడెంట్ మీర్జా, జనరల్ అయూబ్‌ను ప్రధానిగా నియమించారు. అయితే, అదే రోజున జనరల్ రక్తపాతం లేని తిరుగుబాటు జరిపి ఆయనను పదవీచ్యుతుని చేశారు.

ప్రెసిడెంట్ అయూబ్‌ఖాన్ 1969 ప్రారంభం వరకూ పదవిలో ఉన్నారు. ఆయన పరిపాలనకు వ్యతిరేకంగా దేశమంతటా ప్రదర్శనలతో పాటు తీవ్ర సంఘర్షణలు జరిగాయి. పాకిస్తాన్ సైన్యానికి కమాండర్–ఇన్–చీఫ్‌గా ఉన్న జనరల్ యాహ్యాఖాన్ అయూబ్ ప్రభుత్వాన్ని 1969 మార్చి 25న పడగొట్టి ప్రెసిడెంట్ అయినారు.

ఇప్పుడు జనరల్ యాహ్యాఖాన్ శ్రీ భుట్టోకు పదవి అప్పగించడంతో, దేశం మరల ఒకసారి పౌరుడైన ఒక రాజకీయవేత్త చేతులలోకి వచ్చినట్లు అయింది.

క్రిందటి మాటు–అనగా 1957–58లో ఒక సివిలియన్ అయిన శ్రీ ఫెరోజఖాన్ ప్రధానిగా ఉండి పరిపాలన నిర్వహించడం జరిగింది.

తక్కిన పాక్ ప్రధానుల పేర్లు ఇవి :

1. శ్రీ లియాకత్ ఆలీఖాన్. ఆయన తొలి ముస్లింలీగ్ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేశారు. అయితే అక్టోబరు 16, 1951న ఆయన హత్యచేయబడ్డారు.

2. శ్రీ ఖ్వాజా నజీముద్దీన్ ఆయన అక్టోబరు 17, 1951 నుండి 17 ఏప్రిల్ 1953 వరకు ప్రధానిగా ఉన్నారు. గవర్నర్ జనరల్ శ్రీ ఘులాం మహమ్మద్‌చే ఆయన తొలగించబడ్డారు.

3. శ్రీ మహమ్మద్ ఆలీ (బోగ్రా). శ్రీ నజీముద్దీన్ తరువాత పదవి స్వీకరించారు. 7, అగష్టు 1955 వరకు ఆయన ప్రధానిగా ఉన్నారు. అంతట ముస్లింలీగ్ మరొక నాయకుని ఎన్నుకున్నది.

4. చౌధురి మహమ్మద్ ఆలీ, ముస్లింలీగ్ యునైటెడ్ ఫ్రంట్ ప్రతినిధులతో మిశ్రమ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు, తరువాత మిశ్రమ ప్రభుత్వం నుండి ముస్లింలీగ్ వైదొలగింది. ఆయన ప్రభుత్వం 12, ఆగష్టు 1955 నుండి 3, సెప్టెంబరు 1956 వరకు అధికారంలో ఉంది.

5. శ్రీ హెచ్. ఎస్. సుహ్రావర్ది. అవామీలీగ్, రిపబ్లికన్ పార్టీలతో ఏర్పాటు అయిన మిశ్రమ ప్రభుత్వానికి నాయకత్వం వహించారు. తరువాత రిపబ్లికన్లు మిశ్రమ ప్రభుత్వం నుండి వైదొలగారు. శ్రీ సుహ్రావర్ది 12, సెప్టెంబరు 1956 నుండి 11, అక్టోబరు 1957 వరకు అధికారంలో ఉన్నారు.

6. శ్రీ చూంద్రీగర్. ఈయన మిశ్రమ ప్రభుత్వం రెండు మాసాలలోపే అధికారంలో ఉంది. ఈయన ప్రభుత్వం 11, డిసెంబరు 1957న పడిపోయింది.

7. శ్రీ ఫిరోజుఖాన్ నూన్ 12, డిసెంబరు 1957 నుండి 7, అక్టోబరు 1958 వరకు అధికారంలో ఉన్నారు.

8. అక్టోబరు 8, 1958న ప్రెసిడెంట్ ఇస్కందర్ మీర్జా ఫిరోజఖాన్ ప్రభుత్వాన్ని రద్దుచేసి మార్షల్ లాను ప్రకటించారు. అక్టోబరు 27న జనరల్ అయూబ్ మీర్జాను పడగొట్టి అన్ని అధికారాలు తానే చేపట్టారు. ఆయన 13, జూన్ 1959న బేసిక్ డెమొక్రాటిక్ సిస్టంను ప్రవేశ పెట్టారు. దీని క్రింద 17, ఫిబ్రవరి 1960న అయూబ్ ఎన్నుకోబడిన తొలి పాక్ ప్రెసిడెంట్ అయినారు.

తరువాత క్రమ క్రమంగా అయూబ్ పాలనకు వ్యతిరేకత తలఎత్తింది. అనేక పరిణామాలు వచ్చాయి.

16, సెప్టెంబరు 1966లో శ్రీ భుట్టో పీపుల్స్ పార్టీని ఏర్పాటు చేశారు.

(తరువాయి 20వ పుటలో)

వందే మాతరం: వందే భారతం

"రజని"

వందేమాతరం వందే భారతం

ఎన్నో భాషలు, ఎన్నో మతము లెన్నో జాతులైన

అన్నదమ్ములాచంద్రార్క మంతా భారతీయుల్

హిందూ, సిక్కు, ముస్లిం, జైన, పార్శీ, క్రైస్తవులకు

పొందుం గూర్చి సహజీవనము నొందించేది సూత్రం

వందేమాతరమ్

జెండా మూడు రంగుల్, నడుమ చక్రంబున్ వెలయగా

ఖండాంతరములందేనాడో ఖ్యాతిన్ గొన్న వీరుల్

భూసీమన్ నభోవీధిన్, సభావేదిన్, విజేతలుగా

ఆశీస్సుల్ ప్రసాదించేటి అమృత ప్రాయమంత్రమ్

వందేమాతరమ్

చాలున్ మీ దురాశల్ శత్రుసేనల్ తొలగిపొండోయి

కాలాంతకము మా ఆయుధము, ఘనమౌ ఐక్యయంత్రం

జగతీస్థలి ప్రజాస్వామ్యరాజ్యముగా సుస్థిరతను

ప్రగతిన్ దేశదేశాలతో మైత్రిన్ పెంచు మంత్రం

వందేమాతరమ్

ఆయుధాలు పట్టండి

శ్రీ మంగాల జగన్నాధరావు

మనలో విభేదాలు మాసి పోవాలి

మనమందరొకటైతే మనకు ఎదురేది... మ॥

స్వాతంత్ర్య రక్షకై శాంత్యహింసాపథము

సాధనంబైనను శత్రువుల బెదిరింప

శస్త్రముల ధరియించి సమరమ్ము సలుపగా

నడుము కట్టుక దేశ నాయకులు కదలాలి... మ॥

మంచి చెడ్డలు పుణ్య పాపమ్ము లన్నీ

ఎంచి చూచిన అన్ని జాతులకు ఒకటే

కొంటె బుద్ధుల పని కట్టిపెట్టాలి

మంచిదారిని జనుల మనము నడపాలి మ॥

ఆయుధము పట్టాలి ఆత్మ రక్షణకు

చేయవలె యుద్ధము శాంతి రక్షణకు

ఏ అవాంతరమైన ఎదురుకోవాలి

వేయవలె ముందడుగు విజయమ్ము మనదే మ॥

(దేశభక్తి గేయాలు
ఆకాశవాణి సౌజన్యంతో)

యుద్ధ విరమణానంతర సమస్యలు

బ్రిగేడియర్ రతీసహ్నా (రిటైర్)

బంగ్లాదేశ్‌లో భారత సేనల విజయము, పశ్చిమ రంగంలో పోరు విరమణ, పాకిస్తాన్ సేనల శరణాగతి భారత దేశానికి తృప్తిని, సంతోషాన్ని కలిగించగలదు. శాశ్వతంగా శాంతి యుతంగా ఉందామని పాకిస్తానుకు మన ప్రధానమంత్రి శ్రీమతి ఇందిరాగాంధీ చెబుతూ భారత సేనలు అప్రమత్తంగా ఉన్నవనీ, తీరని సమస్యలు చాలా ఉన్నవనీ హెచ్చరించారు.

1965 లో పోరు విరమణానంతరం గూడా పాకిస్తాన్ సేనలు రాజస్తాన్ రంగంలో మన భూభాగాన్ని కొంత ఆక్రమించిన సంగతి మనకు గుర్తు ఉండి ఉండాలి. పశ్చిమ పాకిస్తాన్‌లో ఈసారి మనకు చెప్పదగిన భూభాగమే దక్కినది. తమ బేరంకోసం పాకిస్తాన్ అధినేతలు అక్కడక్కడ సంధి విరమణరేఖను దాటి రావచ్చు.

నువ్వు మానినా మానకున్నా రేపు రాత్రి నుంచి మా ఫిరంగులు మోగవు అని ప్రధాని చెప్పినదానికి పాకిస్తాన్ అధ్యక్షుడు జనరల్ యాహ్యాఖాన్ సమాధానం ఇవ్వడానికి 20 గంటలు వ్యవధి తీసుకున్నాడు. ఐక్యరాజ్యసమితి విరమించమన్నది గనుక, ఎవరి సరిహద్దులలోకి వారి సేనలను మరల్చాలని వారు చెప్పి నందున పోరు విరమిస్తున్నామని ఆయన ప్రకటించాడు. పాకిస్తాన్ ఐక్యతకు అమెరికా మద్దతు ఉన్నదని డిసెంబరు 19 న యాహ్యాను కలిశాక శ్రీ భుట్టో ప్రకటించారు.

భారత భూభాగంలో పాకిస్తానుకు చెప్పదగిన ప్రాంతం ఏమీ కైవసంకాలేదు. అందువల్ల సరిహద్దు లోపలికి మా సేనలను తరలిస్తామని అనవచ్చు. తాష్కెంట్ ఒప్పందంలాంటిది మరొకటి సాధ్యపడదని భారత నాయకులు పల్కినా, మీ సేనలను వెనక్కి తరలించండి అని అమెరికా, చైనా పెద్ద ఒత్తిడి మనపై తేగలవు. ఈ సందర్భంలో అమెరికా సప్తమ నౌకాదళం హిందూమహా సముద్రంలో అడుగుపెట్టడానికి కొంత ప్రాధాన్యం ఉన్నది.

పశ్చిమ పాకిస్తాన్ యుద్ధ యంత్రాంగం బాగా శిథిలమైనా సర్వనాశనం కాలేదు. సప్తమ నౌకాదళంలో అణుశక్తితో నడిచే విమానవాహక నౌక, యుద్ధ నౌకలు, విమానాలు, టాంకులు, మందుగుండు సరఫరాచేసి పాకిస్తాన్ నష్టాలను భర్తీ చెయ్యగలవు. ఇరాన్, టర్కీ, జోర్డాన్, సౌది అరేబియాల ద్వారా గూడా అమెరికా సరికొంత సరుకు పాకిస్తాన్‌కు అందించవచ్చు. ఉన్నత పర్వత పంక్తులలోని కనుమలు మరల ప్రయాణాలకు సుగమము లైనప్పుడు చైనా, అమెరికాతో కలసి సైనిక ఒత్తిడి గూడా మనపై తేవచ్చు.

పాకిస్తాన్ దురాక్రమణ సేనలను బంగ్లాదేశ్‌లో పీచమడంచి పశ్చిమ రంగంలో వారిని నిలువరించడమేగాక తరిమితరిమికొట్టి భారత పక్షం ఔదార్యాన్ని చూపవచ్చుగాని దానికీ ఒక హద్దు ఉన్నది. తనకుమాలిన ధర్మములేదు. తన దేశ భద్రతకు తిరిగి ముప్పును కొని తెచ్చుకొనలేదు. భారత ద్వేషప్రచారాన్ని తట్టుకొని మనం సిద్ధంగా ఉండాలి. భుట్టో ద్వేష ప్రచార అగ్రేసరుడు అక్కడ అధిపతిగా వచ్చాడు, వందేళ్లు మనతో యుద్ధం చేస్తానని వైరాన్ని ప్రకటించినవాడాతడు. ప్రతి అయిదారేళ్లకు దాడులను ఏ దేశమూ ఎదుర్కొన జాలదు. అందులోను భారత దేశము, దారిద్ర్యముపైన, అనారోగ్యముపైన యుద్ధాన్ని ప్రకటించిన భారత దేశము పదేపదే శత్రువుకాలుదువ్వుతూంటే ఎటుల సైరించగలదు?

ఒత్తిళ్లను ఎదుర్కొనడమే భారతదేశం ఇప్పుడు చెయ్య వలసిన కర్తవ్యము. ఇతరుల రాజకీయ, ఆర్థిక, సైనిక బెదరింపులకు మనమెంతమాత్రం సందిచ్చేది లేదని ఇందిరాగాంధీ ప్రభుత్వం జగత్తుకు చాటిచెప్పినది. యుద్ధరంగంలో వచ్చిన విజయాలు ప్రభుత్వానికి అండఅయినవి. మన ఆధీనంలో ఉన్న శత్రుసేన లక్షదాకా ఉండవచ్చు. యుద్ధవిరమణతో యుద్ధఖైదీల మార్పిడి వెంటనే జరుగజాలదు. అంతర్జాతీయ సంప్రదాయాలు, సంప్రదింపులు కొన్ని ఉన్నవి.


చాంబ్‌రంగంలో మన 50 చ. మైళ్ల రవీనదీతీరంలో కొన్ని లంకలు పాకిస్తాన్ ఆక్రమించగా షక్కర్‌ఘర్ రంగంలో భారత్ 400 చ. మైళ్లు ఆక్రమించి లాహోర్, సియాల్‌కోట రాకపోకల మార్గాలకు ప్రమాదాన్ని కల్పించినది. ఛార్‌బెట్ పరిసరాల్లో వేలాది మైళ్ల భూభాగాన్ని సింధులో మనసేనలు చేజిక్కించుకొన్నవి. ఉత్తరాన నయాబార్ ప్రాంతాలు పట్టుకున్నాము. కరాచీకి మిగతా ప్రాంతంతో సంబంధాన్ని, సింధులోని హైదరాబాద్‌పై ఒక దూకు దూకి ఛేదించవచ్చు. ఇస్లాంఘడ్ ప్రాంతంలో రాజస్తాన్

సరిహద్దుల్లో మనసేనలు చాలా ప్రాంతాన్ని చేజిక్కించుకొన్నవి. యుద్ధవిరమణ రేఖ పొడుగున భారత్ అనేక ప్రాంతాల్లో ఘన విజయాలే సాధించినది. కార్గిల్ రంగంలో 36 గస్తీ కేంద్రాలు పట్టుకున్నారు. భారత్‌లో కాశ్మీరుకు ఉన్న లంకెకు లోగడ ముప్పుగా ఉండేది. $7\frac{1}{2}$ కోట్ల ప్రజలపై పాకిస్తాన్ సేనలు జరిపిన క్రూరకృత్యాలను ఎవ్వరూ విస్మరింపజాలరు. 1967 నుంచి ఇజ్రాయిల్‌ను బలపరచిన అమెరికా–అరబ్ ప్రాంతాలను వదలమని ఐక్యరాజ్యసమితి చెబితే వద్దన్న అమెరికా–పాకిస్తాన్ ప్రాంతాలను వదలండని భారత్‌కు బుద్ధులు చెబుతోంది.

నిక్సన్ ప్రభుత్వం, భారత్ దురాక్రమణ జరిపినదన్న అభాండాల్ని వేసి దాని పాక్షికత్వాన్ని ప్రదర్శించినది. పాకిస్తాన్ కోటిమందిని మన దేశంలోకి తరిమినా, మన విమానాశ్రయాలపై పాకిస్తాన్ గుండ్ల వర్షం కురిపించినా అమెరికా కళ్ళు మూసుకున్నది. అమెరికా పత్రికలు, ప్రజలు పాకిస్తాన్ సేనలు మార్చి 25 నుంచి జరిపిన క్రూర కృత్యాలను గమనిస్తూనే ఉండటం గుడ్డిలో మెల్ల.


పశ్చిమ పాకిస్తాన్ భూభాగం నుంచి భారత సేనలు తప్పుకోవాలని అన్నా, ఆక్రమించిన కాశ్మీరులో అంగుళం మేరగూడా తిరిగి మన స్వాధీనమైన దానిని వదిలేదిలేదు.

నైతికంగా భారత్ ధర్మమార్గంలో ఉన్నది. ఆత్మనిగ్రహము, సంయమము నాయకులు ప్రదర్శించారు. పాకిస్తాన్ పైశాచిక సేనలకు భారత సేనలు అపక్రపరాక్రమాన్ని ప్రదర్శించి బుద్ధిచెప్పినవి. ముందున్నది మొసళ్ళ పండుగ. సహనము, సత్ హృదయము ఉన్నచో పరిష్కారం సాధ్యము. తుదకు సత్యము, ధర్మము, విజయము పొందగలవు.



ఛాంబ్ రంగంలో జరిగిన యుద్ధంలో తన ఖుక్రీతో ముగ్గురు పాకిస్తానీ సైనికులను ఎదుర్కొని చంపిన 8వ ఘూర్ఖా రైఫిల్స్‌కు చెందిన లాన్స్‌నాయక్ పదం బహదూర్ థాపాను అభినందిస్తోన్న భారత సైనిక దళాధిపతి జనరల్ మానిక్‌షా.
జనరల్ మానిక్‌షా డిసెంబరు 23వ తేదీన ఛాంబ్ రంగంలో పర్యటించారు.

మన జవాన్ల మానవతా దృష్టి



బంగ్లాదేశ్‌లోని చాంద్‌పూర్ రంగంలో గాయపడిన పాకిస్తానీ సైనికుడికి ప్రథమ చికిత్స చేస్తున్న భారత జవాను

శకర్‌ఘర్ కొరకు జరిగిన పోరాటాన్ని నిశ్శబ్దమైన పోరాటంగా పేర్కొనవచ్చు. శకర్‌ఘర్‌ను స్వాధీనం చేసుకొనేందుకు మన జవాన్లు పఠాన్‌కోట్, సాంబాలకు పశ్చిమంగా గల ప్రాంతాలలో పోరాటం జరిపారు.

అక్కడ మన దళాలు జమ్మూ, కాశ్మీర్‌కు గల మన అత్యంత కీలకమైన ప్రాంతాలకు శత్రువునుంచి వచ్చే ప్రమాదాన్ని నివారించేందుకుగాను నిశ్శబ్దంగా శత్రు భూభాగంలోనికి చొచ్చుకొనిపోయారు. మన దళాలు టాంకులు దాటడానికి వీలుపడని కొన్ని ప్రదేశాలను దాటి వెళ్లాయి.

డిసెంబర్ 6వ తేదీన మన దళాలు దాడిని ప్రారంభించాయి. అప్పుడు ఆ ప్రాంత మంతటా మందుగుండు పాతరలు ఉన్నాయి. టాంకులు దాటటానికి వీలులేకుండా పెద్ద కందకాలున్నాయి. శత్రువు పొంచి వుండేందుకు ఆ ప్రదేశం వీలుగా ఉంది. ఆ ప్రాంతంలో ఉన్న ఇసుక మీదుగా మన టాంకులు వెళ్లటం కష్టం. అయినా మన దళాలు శత్రువు అనుకోని విధంగా ప్రశంసనీయమైన పని చేశాయి.

మొదటి 24 గంటలలోనూ మన దళాలు శత్రువుకు చెందిన 11 టాంకులను నాశనం చేసి మరి రెండు చెక్కుచెదరని టాంకులను వశం చేసుకొన్నాయి.

మొదటి రోజు రాత్రి మన జవాన్లు శత్రువుకు చెందిన దాదాపు 8000 గజాల భూభాగాన్ని ఆక్రమించుకొన్నారు. వారు దర్మాన్ కోట వరకూ వెళ్లారు. ఆ తర్వాత 48 గంటలలో మన జవాన్లు మందు పాతరలను ఏరివేసి పాక్ టాంకులతో తలపడ్డారు. ఇరుపక్షాల టాంకులమధ్య జరిగిన యుద్ధంలో పాక్ టాంకులు దాగి ఉన్నస్థలాలనుంచి బయటకు వచ్చి మన టాంకులపై కాల్పులు జరిపి తిరిగి తమ తమ స్థానాలకు వెళ్లిపోయేవి. మన దళాలకు విమాన దళాల మద్దతు లభించటం అతికష్టం. అయినా మన దళాలు ఈ వ్యతిరేక పరిస్థితులను ఎదుర్కొని శత్రువుకు కీలకమైన బాక్ అమ్రి పట్టణం వరకూ వెళ్లాయి.

మన జవాన్లు ఈ పోరాటంలో శత్రువుకు చెందిన బారి, సుదోచాక్, చక్రా, దెహరాలను వశం చేసుకొన్నారు.

ఈ శకర్‌ఘర్ పోరాటంలో ఒక భారత జవాను కేవలం మర తుపాకీతోనే శత్రువుకు చెందిన సాబర్ విమానాన్ని పడగొట్టారు. మన ఆక్-ఆక్ తుపాకులు మూడు రవుండ్లు మాత్రమే కాల్చి శత్రువుకు చెందిన మిగ్-16 విమానాన్ని పడగొట్టాయి.

యుద్ధంలో కూడా మన జవాన్లు ఉదారంగా ప్రవర్తించారు. వారు వశం చేసుకొన్న అన్ని గ్రామాలు కూడా చెక్కు చెదరకుండా ఉన్నాయి. మసీదులకు ఏ విధమైన నష్టమూ కలుగలేదు. వారిలో ఒక వృద్ధస్త్రీ పాకిస్తానీ కాల్పుల వల్ల మరణించిన తన కుమారునికి అంత్యక్రియలు జరుపాలని పట్టుపట్టగా మన జవాన్లు కందకాన్ని త్రవ్వి ఆ శవాన్ని పాతిపెట్టి, ఆ వృద్ధస్త్రీని సురక్షితమైన ప్రాంతానికి చేర్చారు. యుద్ధంలో కూడా మన జవాన్లు, మానవత్వానికి గల గౌరవాన్ని మరచిపోలేదు.

శకర్‌ఘర్ స్వాధీనంతో మన కీలకమైన ప్రాంతాలకు శత్రువు వల్ల ప్రమాదం ఏర్పడకుండా చేయటంలో మన జవాన్లు కృతకృత్యులయ్యారు.

(16 వ పుట నుండి)

ఇరవై నాలుగేండ్ల లో......

తూర్పు పాకిస్తాన్‌లో అనేక అల్లరులు, తిరుగు బాటులు తలఎత్తాయి.

జనరల్ యాహ్యాఖాన్ 25 మార్చి 1969న అయూబ్ నుండి పదవిని చేపట్టి, దేశమంతటా మార్షల్ లాను ప్రకటించారు.

మార్చి 31న యాహ్యా తనకు తానే పాక్ ప్రెసిడెంట్‌గా నియమించుకున్నారు.

7 డిసెంబరు 1970లో తొలిసారిగా జనరల్ ఎన్నికలు జరిగాయి. పాకిస్తాన్‌లో షేక్ ముజిబుర్ నాయకత్వాన గల అవామీ లీగ్ అఖండ విజయం సాధించింది. పశ్చిమ పాకిస్తాన్‌లో భుట్టో పార్టీ పెద్ద ఏకైక పక్షంగా రూపొందింది.

1971 జనవరి 13న, జాతీయ అసెంబ్లీ సమావేశాన్ని నిరవధికంగా వాయిదా వేస్తున్నట్లు యాహ్యాఖాన్ ప్రకటించారు. మార్చి 25న యాహ్యా-ముజిబ్ చర్చలు విఫలమైనాయి. మార్చి 26న యాహ్యా సేనలు ముజిబ్ అనుచరులను అణచివేసే కార్యక్రమాన్ని చేపట్టాయి.

బంగ్లాదేశ్ అంతటా ఆనందోత్సాహాలు

పత్రికా విలేఖరి ప్రత్యక్ష కథనం

— ఆర్. సి. డే

బంగ్లాదేశ్‌లో ప్రముఖ పట్టణాలైన కొమిల్లా, చాంద్‌పూర్ లలో మెల్లమెల్లగ మామూలు పరిస్థితులు నెలకొంటున్నాయి.

గత నెల 16వ తేదీన మరో 40 మంది భారతీయ, విదేశీయ పత్రికా రచయితలతో పాటు నేను ఆ పట్టణాలను సందర్శించినప్పుడు ఆ పట్టణ ప్రజలు తమ విజయానికి ఆనందోత్సాహాలతో ఉత్సవాలు జరుపుకుంటున్నారు.

మేమందరమూ వెళుతున్న సైనిక వాహనం చూచినంతనే బంగ్లాదేశ్ ప్రజలు ఆనందంతో 'జై బంగ్లా' అని పెద్దగా నినాదాలు చేసేవారు. వారితో కలసి కొందరు విదేశీ పత్రికా రచయితలు 'జై బంగ్లా' నినాదాలు చేసేవారు.

త్రోవలో కొన్నిచోట్లలో, ట్రక్కును ప్రజలు ఆపు చేసేవారు. వారితో కరచాలనం చేసింతర్వాతనే మమ్మల్ని ముందుకు పోనిచ్చేవారు. వారికో ఆనందం పెల్లుబికి పోయింది. వారంతా కూడా వీధులలో ఊరేగింపులు ర్వాలి మరో ఊరేగింపు జరుపుతూ 'బంగ్లాదేశ్, భారత మైత్రి అమర్‌హో' అనే నినాదాలను చేశారు.

కొమిల్లాకు వెళ్లే మార్గంలో 'ప్రజాతంత్ర సామ్యవాద రిపబ్లిక్ బంగ్లాదేశ్', 'మిత్రవాహినీ—ముక్తివాహిని జిందాబాద్' 'ముజీబ్—ఇందిరాగాంధీ జిందాబాద్' అనే నినాదాలు గల మూడు పెద్దపెద్ద స్వాగత ద్వారాలు పెట్టి ఉండడం నేను చూశాను.

భారత దళాలకు జోహార్లు

ప్రొద్దు వాలకముందు మేము కొమిల్లా చేరుకున్నాం. ఆ పట్టణంలో యుద్ధం జరిగిన జాడలేమీ కన్పించలేదు. నౌకలకు ఏమాత్రము హాని కలగకుండా సైనిక చర్యలు తీసుకున్నందుకు భారత సైన్యాలను మెచ్చుకోవాలి. పశ్చిమ పాకిస్తాన్ సైనిక సిబ్బందిపైన, సైనిక లక్ష్యాలపైన మాత్రమే భారత సైనికులు చర్యలు తీసుకున్నారు. ఈ విషయాన్ని కృతజ్ఞతా భావంతో అక్కడి ప్రజలు తెలిపారు.

చాలా షాపులు, టీ దుకాణాలు, హోటళ్ళు తెరచి ఉంచడం నేను చూశాను. అధిక సంఖ్యలో ఆటోరిక్షాలు వీధులలో తిరుగుతున్నాయి. స్కూటర్లు కూడా వెళుతున్నాయి. ప్రజలు సైకిళ్ళపై తిరుగుతున్నారు. రాత్రిపూట విద్యుద్దీపాల కాంతిలో ఆ పట్టణంలో ఆనంద వాతావరణం కనుపించింది. అక్కడ మణుగు బియ్యాన్ని రూ. 45 లకు అమ్ముతున్నారు. చేపల ధర మాత్రం మనం నమ్మలేనంత చౌకగా ఉంది. కానీ కిరసనాయిలు, పంచదార అక్కడ దొరకడం లేదు.

సంతోషపూర్వక ఆదర సత్కారాలు

రాత్రి ఎనిమిది గంటలు కాకముందు మేం చాంద్‌పూర్ చేరుకున్నాం. స్థానిక ప్రజలు ఎంతో సంతోషంతో మాకు స్వాగతం చెప్పారు. వీధులలో పోయే ప్రతి ఒక్కరూ మాతో కరచాలనం చేయందే వెళ్ళేవారు కాదు. ప్రతిమనిషి పెదాలపైనా 'జై బంగ్లా' నినాదం తాండవ మాడుతున్నది.

ముక్తివాహిని సభ్యుని కోరికపై స్థానిక ప్రజలు మా పత్రికా రచయితలకు కోడిమాంసం, రొట్టెలతో భోజనం పెట్టారు. చాంద్‌పూర్‌నుంచి ఢాకాకు పడవపై అయిదుగంటల ప్రయాణం. ఢాకా వెళ్లడానికి గాను మా పత్రికా రచయితల బృందానికి స్థానిక ప్రజలు ఒక లాంచీని ఏర్పాటు చేశారు.

భయ భ్రాంతుల అంతం

వెనుకకు మళ్ళిపోతూ పాక్ సైనికులు చాంద్‌పూర్ రైల్వే స్టేషనును పూర్తిగా పాడుచేసి పోయారు. స్టేషన్ నిండా కాగితాలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. స్టేషనంతా చాలా నిర్జనంగా ఉంది. పరిస్థితి ఇలా ఉన్నప్పటికీ కూడ ఈ నెల 17 న చాంద్‌పూర్ నుంచి కొమిల్లాకు మొదటి రైలు బయలుదేరి వెళ్ళింది. ఈ రెండు పట్టణాల మధ్య దూరం 70 కిలో మీటర్లు. అరాచక పరిస్థితులు నెలకొన్నప్పుడు చాంద్‌పూర్ రైల్వే స్టేషను మాస్టరుగా పనిచేసిన అబ్దుల్ వాదూర్ చౌధరిని నేను కలుసుకున్నాను.

రైల్వే ఉద్యోగుల సర్వీసు రికార్డులతో సహా ప్రతి వస్తువునూ అసహ్యాకరమైన పాక్ పాలకులు ధ్వంసం చేశారు. ఈ భయానక కృత్యాలనే అక్కడి సీనియరు గార్డు డిల్వాన్ హుస్సేన్ తిరిగి చెప్పారు.

పౌర పరిపాలన నెలకొల్పడం జరిగిందని చాంద్‌పూర్ స్టేషను డైరెక్టరు మహమ్మద్ అలీ మియా నాకు చెప్పారు. శాంతి భద్రతల సమస్య ఇకలేదు. అధికారులతో ప్రజలు ఎంతో ఉత్సాహంగా సహకరిస్తున్నారు.

తొమ్మిది నెలల తర్వాత ఈ నెల 17 వ తేదీన స్థానిక మసీదులో మొదటిసారిగా ప్రార్థనలు జరిగాయని హాజీగంజ్‌లో 90 ఏళ్ళ వృద్ధుడు మోజామ్మెల్ హక్ నాతో చెప్పారు. 'ఇంతకాలం మేం మృతప్రాయంగా బ్రతికాం. ఇప్పుడే మళ్ళీ జీవించడం మొదలుపెట్టాం' అని వణికే గొంతుతో ఆతను అన్నారు.*

మన సైనిక యోధుల వీరగాథలు

'శ్యాబరు విమాన విధ్వంసిని'గా పేరుగాంచిన మన నాట్ విమానం ఈ సారి పాక్ విమానదళానికి చెందిన అతిశక్తివంతమైన సూపర్ సానిక్ మిరేజ్ విమానాన్ని కూల్చి వేసి మరో ఘనవిజయాన్ని సాధించింది. పశ్చిమరంగంలోని ఒక అగ్రగామి ప్రాంత విమానస్థావరంలో మన నాట్ విమానం పాక్ మిరేజ్ విమానాన్ని కూల్చివేసింది. ఈ సాహసోపేత కార్యాన్ని 28 ఏండ్ల ఫ్లయిట్ లెఫ్టినెంట్ నిర్వహించారు.

ఆ పైలట్ మరొకవైమానిక అధికారితోపాటు నాట్ విమానాలలో గగనతలంలో గస్తీ తిరుగుతుండగా శత్రు విమానాల రాకను వారికి తెలియజేశారు.

ఈ వార్త తెలిసిన వెంటనే వారి విమానాల వేగాన్ని అధికం చేసి శత్రు విమానాల కోసం గాలించడం మొదలుపెట్టారు. కొద్ది సేపట్లో రెండు పాక్ మిరేజ్ విమానాలు మన విమానస్థావరంపై దాడిజరపడానికి సమాయత్తమై రావడం మన రెండవ విమానంలోని వైమానికాధికారి గమనించి వాటిని ఛేదించడానికై ఉద్యుక్తుడయ్యాడు. అయితే మొదటి రెండు మిరేజ్ విమానాల వెనుకనే మరో రెండు మిరేజ్‌లు కూడా రావడం చూచి ఆయన మూడవ మిరేజ్‌ను ఛేదించడం మొదలు పెట్టారు. కానీ, ఆ నాలుగు మిరేజ్‌లు కాక మరో మిరేజ్ కూడా దాడి చేయడానికి వచ్చింది. ఆ మిరేజ్, మూడవ మిరేజ్‌ను ఛేదిస్తున్న మన నాట్ విమానం వెనుకనుంచి వచ్చి, మన విమానాన్ని కూల్చివేయడానికి ప్రయత్నిస్తోంది. పరిస్థితి క్లిష్టంగా తయారు కావడంతో గ్రౌండ్ కంట్రోలు ఆదేశం ప్రకారం మన రెండవ నాట్ విమానం శత్రు విమానాలను ఛేదించడం విరమించుకుంది.

ఇక గగనతలంలో అయిదు అతిశక్తివంతమైన శత్రు విమానాలతో పోటీ పడడానికి యువపైలట్ ఒకరే మిగిలారు. ఆయన ఉన్న నాట్ విమానం భూతలానికి 300 అడుగుల ఎత్తులో మాత్రమే ఉంది. ఆ పైలట్ మూడవ మిరేజ్‌ను వెన్నాడి, 600 గజాల దూరం నుంచీ కాల్పులు కాల్చారు. ఆ మిరేజ్ డ్రాపు టాంకులను క్రిందికి వదిలివేయడం కన్పించిందికాని ఆ విమానాన్నుంచి పొగకానీ మంటలు కానీ కన్పించలేదు.

అయితే ఆవిమానం వేగాన్ని పెంచుకొని, మార్గాన్ని తప్పించుకుని పారిపోయింది. ఆమిరేజ్ అలాతప్పించుకు పోవడానికి కారణం తన వెనుకనుంచి నాలుగో మిరేజ్ ఏదో సంకేతం ఇచ్చి ఉంటుందని తనరక్షణకే ముప్పువచ్చే పరిస్థితి ఏర్పడిందని మన పైలట్ తలంచి, తన విమానం మార్గాన్ని తప్పించి గగనతలంలో విన్యాసం చేయడం మొదలుపెట్టారు. ఇలా చేయడంతో తన వెనుకనే చాలా దగ్గరగా వచ్చిన మిరేజ్ మన విమానాన్ని దాటి ముందుకు దూసుకుపోయింది. వెనువెంటనే మన నాట్ విమానాన్ని ఆ మిరేజ్ వెనుకకు మళ్ళించి 600 గజాల దూరంనుంచి మన పైలట్ రెండుసార్లు కాల్పులు కాల్చారు. అంతే అంటి శక్తివంతమైన మిరేజ్‌లో పొగలు పైకెగిరాయి. ఆ కూలిపోయిన మిరేజ్ భాగాలను మన సైనికాధికారులు తర్వాత కనుగొన్నారు.

వీరజవాన్

డిసెంబర్ 4వ తేదీ రాత్రి మన సైనిక దళాలు ద్రాదా నగరాన్ని వశం చేసుకొనే ముందు పాక్ ప్రతిఘటనను నిర్మూలించిన వీరజవాన్లలో రైఫుల్‌మాన్ కౌశల్ రామ్ కూడా ఉన్నారు.

ధోక్రానల్‌కు దగ్గరగానున్న గడీ కేంద్రంలోని పాక్ సైనికులు సరిహద్దు ప్రాంతంలో ముందుకువస్తున్న భారత సైనికులపై కాల్పులు మొదలుపెట్టారు. పరిస్థితి బంకర్లలో ఉన్న పాక్ సైనికులకే అనుకూలంగా ఉంది. అట్టి పరిస్థితిలో కౌశల్ రామ్ ఒకవైపు కాల్పులు జరుగుతున్నా లెక్కచేయకుండా పాక్ బంకర్ల వైపు ప్రాకుతూ వెళ్ళసాగారు. వారు ఒక బంకరును సమీపిస్తుండగా శత్రువు కాల్పులవల్ల కుడిచేయి గాయపడింది. అయినా లెక్కచేయకుండా కౌశల్ రామ్ బంకర్‌ను సమీపించి దానిలోనికి హాండ్ గ్రెనేడ్‌ను విసరగా ఇద్దరు పాక్ సైనికులు మరణించారు. ఆ తర్వాత గాయపడిన చేతిని ఎడమ చేతో పట్టుకొని కౌశల్ రామ్ పరుగెత్తి తమ స్థానాన్ని చేరుకొన్నారు. ఆ వెంటనే ఆయన్ను ఆసుపత్రికి తీసుకు వెళ్ళారు.

భారత వైమానిక దళం అసమాన ధైర్య సాహసాలు

డిశంబరు 3వ తేదీన యుద్ధం మొదలయిన దగ్గరనుంచీ కూడా మనయుద్ధ విమానాలలోని పైలట్లు అసమాన ధైర్య సాహసాలను చూపిస్తూనే ఉన్నారు. పటిష్టమైన శత్రుస్థావరాలపై దాడి జరుపుతున్నప్పుడు ఇనుమడించిన శౌర్యపరాక్రమాలతో కృతనిశ్చయంతో విజయమో వీరస్వర్గమో అన్న పట్టుదలతో కదనరంగంలోకి ఉరుకుతున్నారు. శత్రువులు భారీ ఎత్తున ప్రతిఘటిస్తున్నప్పటికీ విమాన విధ్వంసక శతఘ్నులు అగ్నివర్షం కురిపిస్తున్నప్పటికీ శత్రువుల యుద్ధశక్తిని నాశనం చేయడానికి గాను

చెక్కుచెదరని దృఢనిశ్చయంతో మన పైలట్లు శత్రుసైనిక స్థావరాలను గుర్తుపట్టి బాంబులను కురిపిస్తున్నారు.

మన యుద్ధ విమానాలు ఒక సాహసోపేతమైన కార్యాన్ని నిర్వహించాయి. హవేలీ ప్రాంతంలో ఒక మామిడితోటలో ఎదుటి వారికి కన్పించకుండా శత్రు టాంకులను భారీ ఎత్తున సమాయత్తం చేశారు గుర్తు పట్టడానికి అవకాశం లేని ఈ లక్ష్యాన్ని ధ్వంసం చేసే కార్యాన్ని అనుభవజ్ఞుడైన మన యుద్ధ బాంబరు పైలట్లకు అప్పగించడం జరిగింది. ఏమాత్రం ఆలస్యం చెయ్యకుండా నేరుగా లక్ష్యం వైపు పైలట్ దూసుకు పోయాడు. క్రింది నుంచి భారీ ఎత్తున కాల్పులు కాలుస్తున్నా లెక్క చేయకుండా ప్రతీకారవాంఛతో ఆ మామిడి తోటపై బాంబులవర్షం కురిపించాడు. మళ్ళీ నేరుగా తిరిగివచ్చాడు. అతని వెనుక మామిడి తోటలో మృత్యువు విలయ తాండవం చేసింది. అంతా సర్వనాశనం. ఎక్కడచూచినా పొగలే. అగ్నిజ్వాలలే.

అప్రతిహతంగా తన స్థావరానికి తిరిగివచ్చిన ఆ ధైర్య సాహసోపేత గగనతల సైనికుడు తన సహచరుల కెల్లప్పుడూ ప్రోత్సాహకరమైన ఒక ఆదర్శపురుషుడుగా నిలిచాడు.

కార్పోరల్ దోగ్రా మన వైమానిక దళంలో వైమానికుడుగా పనిచేస్తున్నాడు. దోగ్రా వయస్సు 26 సంవత్సరాలు. వయస్సులో చిన్న అయినప్పటికీ మంచి తర్ఫీదు పొందిన సైనికుడికి ఉండే ధైర్యం, ఆత్మ విశ్వాసం అతడికి ఉన్నాయి. వైమానిక దళం తాలూకు పశ్చిమ మండలంలో ఒక వైమానిక దళ కేంద్రంలో అతడు పనిచేస్తున్నాడు. కార్పోరల్ దోగ్రాకు తన బాధ్యత ఏమిటో క్షుణ్ణంగా తెలుసు. మన గగన సరిహద్దును ఉల్లంఘించి మనపై దాడి చేసేందుకు వచ్చే శత్రు విమానాలపై చావు దెబ్బ కొట్టడమే అతడి బాధ్యత.

కార్పోరల్ దోగ్రా తన విధ్వంసక శతఘ్నికి వెనుకవైపు ఉన్న ఒక బంకర్‌లో ఉండి శత్రువిమానాల కోసం ఉత్సాహంగా నిరీక్షిస్తూ ఉంటాడు. అదే తన గృహం అన్నంత జాగ్రత్తగా, అతడు తన బంకర్‌ను స్వయంగా నిర్మించుకొన్నాడు. మన గగన ప్రాంతంలోకి చొచ్చుకొని వచ్చే శత్రువిమానాలపై వెంటనే కాల్పులు జరిపి శత్రువుకు తగిన విధంగా బుద్ధి చెప్పేందుకు అతడు తన బంకర్‌లో అప్రమత్తంగా కూర్చొని ఉంటాడు.

కార్పోరల్ దోగ్రాకు శతఘ్నులు ప్రయోగించడంలో శిక్షణ లభించలేదు. 'ఏరో — ఇంజన్‌ఫిట్టర్' గా అతడు వైమానిక దళంలో చేరాడు. అప్పుడప్పుడు వచ్చే విమానాల ఇంజన్లను జాగ్రత్తగా పరిశీలించి వాటిలోని లోపాలు సరిచెయ్యడం అతడి పని. కానీ, ఆ తరువాత విమాన విధ్వంసక శతఘ్నులు ప్రయోగించడంలో గట్టి తర్ఫీదు పొంది 'మాస్టర్ గన్నర్' గా తయారయ్యాడు.

కార్పోరల్ దోగ్రా సహచరులు అతడు ఉపయోగించే విమాన విధ్వంసక శతఘ్నిలో స్థానికంగానే అవసరమైన మార్పులు చేసి దానిని మరింత శక్తివంతంగా తయారుచేశారు ఈ విమాన విధ్వంసక శతఘ్ని మామూలు శతఘ్నుల కన్నా ఎన్నోరెట్లు వేగంగా శత్రు విమానాలపై గుళ్ళు కురిపించి వాటిని నేల కూల్చగలదు.

ఎలాంటి విమానాన్నయినా అతడు అతితేలికగా, తప్పు లేకుండా గుర్తించగలడు. ఇందుకు కారణం అతడికి ఉన్న అనుభవమే. ఎన్నో రకాల విమానాలు, వాటి యంత్రాలు గురించి క్షుణ్ణంగా తెలిసి ఉండడంవల్ల, విమాన విధ్వంసక శతఘ్నులు ప్రయోగించడంలో సుశిక్షితులైన వారికన్నా ఎంతోనేర్పుతో అతడు తన ఆయుధాన్ని ప్రయోగించగలడు.

మన వైమానిక దళంలో కార్పోరల్ దోగ్రా నుండి వైమానికులు వందల సంఖ్యలో ఉన్నారు. వీరందరు తమ విధులను సంతోషంగా, అప్రమత్తంగా నిర్వహిస్తున్నారు. దుస్సాహసానికి పూని మనపై దాడిచేసేందుకు వచ్చే శత్రువుపై చావుదెబ్బకొట్టి, సర్వనాశనం చెయ్యడమే తమ పవిత్ర కర్తవ్యం అని ఈ వీరులందరికీ తెలుసు. ఈ వీరులందరూ తమ కర్తవ్యాన్ని నిర్భయంగా, ఆత్మ విశ్వాసంతో నిర్వహిస్తూ మన దేశాన్ని శత్రుదాడినుండి రక్షిస్తున్నారు.

నౌకాదళ సాంప్రదాయాలను నిలబెట్టిన కెప్టన్ ముల్లా

సబ్‌మెరైన్ విధ్వంసక 'ఖుక్రీ నౌక' నావికాదళ సాంప్రదాయాలను పూర్తిగా పాటిస్తూ చివర వరకూ ఆ నౌకలోనే ఉండిపోయిన నౌక కమాండింగ్ ఆఫీసర్ కెప్టెన్ మొహిందర్‌నాథ్ ముల్లా వీరగాథ తెలియవచ్చింది.

ఆయనకు రాష్ట్రపతి మహావీరచక్ర అవార్డు ప్రకటించారు.

మన నౌక ఖుక్రీ సముద్రంలో మునిగిపోయింది. 1200 టన్నుల బరువైన ఈ నౌక సబ్‌మెరైన్‌లను వేటాడి ముంచేందుకు వినియోగించేది.

అది 9వ తేదీ రాత్రి. శత్రువుల సబ్‌మెరైన్ ఒకటి మన నౌకను టార్పిడోచేసింది. నౌక మునిగిపోతూంది. 18 మంది ఆఫీసర్లు 174 మంది సైలర్లు కూడా నౌకతోపాటు మునిగిపోతున్నారు. కెప్టిన్ ముల్లా ప్రాణరక్షణ చేసుకొనడానికి ఎన్నిమార్గాలైనా ఉన్నాయి. కాని ఆయనలా చెయ్యలేదు, చివరివరకూ నౌకలోనే నిలిచివున్నారు. చివరివరకూ తన తోటివారితో నౌకలోనే ఉంటూ పోరాడుతూ వచ్చారు.

నౌక పూర్తిగా మునిగిపోతుండగా ప్రాణాలను రక్షించుకొంటూ కొందరు ఈదుతూ వెళ్ళారు. వారు వెనుదిరిగిచూసే సరికి నౌక అతి వేగంగా మునిగిపోతున్నది. నౌక పైభాగాన ఎత్తైన ప్రదేశంలో (కమాండర్ కూర్చుని ఉత్తర్వులిస్తుంటారు. ఆ ప్రదేశంలో) కెప్టెన్ కూర్చునే కుర్చీలో ముల్లా కూర్చొని ఉన్నారు.

ఆయన జాడ ఇప్పుడు తెలియడంలేదు. నౌకా దళం సాంప్రదాయాలను ఆయన ఈ విధంగా చివరివరకు పాటిస్తూ వచ్చారు. ముల్లా న్యాయశాఖ వర్గాలలో పేరు పొందినవారు. ఆయన కుటుంబం అలహాబాదుకు చెందింది. ఆయన గొప్ప మేధావి.

పశ్చిమ రంగంలో ఆయన శత్రుసేనలను దెబ్బతీసేందుకు అన్వేషిస్తుండగా కొద్ది సెకన్లలో మూడు టార్పిడోలు నౌకపై వచ్చిపడ్డాయి. మూడు నిమిషాలలో నౌక మునిగిపోయింది.

నౌకలోనుండి పారిపోవడానికి ఎన్ని అవకాశాలున్నా ఆయన అలా చేయలేదు. నౌకలోని 18 మంది ఆఫీసర్లు 176 మంది ఇతర సిబ్బందితో సహా నౌకతోబాటు మునిగిపోవడానికే సిద్ధమయ్యారు.

నౌకను రక్షించలేము అని తెలియగానే ఆయన నౌకను విడిచి లైఫ్ బోట్లలోకి వెళ్ళాల్సిందిగా ఉత్తర్వులిచ్చారు. ఈ ఉత్తర్వులు అమలుపరుస్తూ 33 సంవత్సరాల యువలెఫ్టినెంట్ జోగిందర్ కృష్ణన్‌సూరి కూడా నౌకతో బాటుగా మునిగిపోయారు.

సిబ్బందిలో అనుభవం లేని వారు నౌకలోని ఉక్కు కడ్డీలను పట్టుకుని దానితోనే ఆత్మరక్షణ చేసుకోవాలని తలచి అలాగే చేయబోగా కెప్టెన్ వారిని సురక్షితమైన జలాలలోకి త్రోసి వేసి ఈదుకుంటూ వెళ్ళిపోవాల్సిందిగా వారిని ఆదేశించారు.

ఈదేటప్పుడు రక్షణగా ఉండే జాకెట్‌ను ధరించాల్సిందిగా ఒకరు కోరగా కెప్టిన్ ముల్లా శాంత గంభీరస్వరంతో "వెళ్ళండి మిమ్మల్ని మీరు రక్షించుకోండి, నా గురించి ఆందోళన పడకండి" అన్నారు.

ఆయన గొంతులో భయం లేదు. చాలా ప్రశాంతంగా ఉంది.

తొలి బలి


ఇండియాలోనే రూపొందించబడి ఇండియాలోనే తయారైన 'హెచ్ ఎఫ్ 24' (మరుత్) విమానం ఇటీవల రాజస్థాన్ రంగంలో పాకిస్తాన్ విమానాన్ని మొదటి సారిగా బలి తీసుకొన్నది.

గస్తీ కార్యక్రమాలను నిర్వహిస్తున్న మరుత్ విమానం నాలు శాబర్ జెట్స్‌ను చూసింది. ఆ నాలుగు విమానాలపై భారత విమానదళం పైలట్ మరుత్‌తో లంఘించి కాల్పులు జరిపి ఒక దానిని కూల్చివేశాడు.



పాకిస్తానీ సైనిక పైశాచిక కృత్యాలకు బలైపోయిన ఢాకాలోని బుద్ధిజీవులు కొందరు

మిగిలినవాటిలో రెండు శాబర్‌జెట్స్ తోకముడిచాయి అయితే మూడవ విమానం మన విమానం క్రిందకి వచ్చింది. ఒక దశలో పాక్ విమానం దాదాపుగా మరుత్ వెనుకగా వచ్చి గురిచూసి దెబ్బతీసే లోగానే మన పైలట్ చాకచక్యంతో శత్రువును పట్టి కొట్టించి క్షేమంగా స్థావరానికి వచ్చాడు



మహావీరచక్ర గ్రహీతలు (ఎడమనుంచి కుడికి) మేజర్ హోషియార్, సెకండ్ లెఫ్టినెంట్ అరుణ్ ఖేతర్‌పాల్ (మరణానంతరం), లెఫ్టినెంట్ నాయక్ అల్బర్ట్ ఎక్కా (మరణానంతరం)

"యుద్ధం ముగిసినా దేశ రక్షణ కృషి కొనసాగ వలసిందే"

-పంచాయతీరాజ్ సంస్థల ప్రాంతీయసమావేశాల్లో ముఖ్యమంత్రి ఉద్బోధ



రాష్ట్రంలో రాఫిల్‌ను నిర్వహించడం ద్వారా రక్షణ నిధికి మూడు కోట్ల రూపాయలు వసూలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిశ్చయించినట్లు ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు డిసెంబరు 28న కాకినాడలో జరిగిన ప్రాంతీయ పంచాయతీ రాజ్ మహాసభను ప్రారంభిస్తూ తెలియజేశారు.

రాఫిల్ టికెట్ల అమ్మకంలో ప్రభుత్వంతో ప్రధాన శాఖల అధిపతులు ఏ విధంగా సహకరించగలరనే విషయం ముఖ్యమంత్రి చర్చలు జరిపారు.

రాష్ట్రంలో రక్షణ నిధికి 10 కోట్ల రూపాయలు సేకరించడంలో ఎట్టి ఇబ్బంది ఉండబోదని ఆయన అన్నారు. తలకొక రూపాయ చొప్పున విరాళం ఇవ్వడం ద్వారా ఐదు కోట్ల రూపాయలు సేకరించవచ్చునని, మిగిలిన డబ్బు ఇతర విరాళాల ద్వారాను, రాఫిల్ టికెట్ల ద్వారాను సేకరించ వచ్చునని ఆయన అన్నారు.

యుద్ధం అయిపోయినందున ఇక రక్షణ కృషి అవసరం లేదని ఎవరూ అనుకొనరాదని ముఖ్యమంత్రి అన్నారు. పాకిస్తాన్ భారత దేశానికి ఎప్పుడూ తలనొప్పిగానే ఉంటున్నదని, పాకిస్తాన్ ఎప్పటికీ మనకు స్నేహపాత్రమైన పొరుగుదేశం కాలేదని ఆయన అన్నారు.

బంగ్లా దేశ్ స్వయం సమృద్ధి సాధించేటట్లు చూడడం భారత దేశ బాధ్యత అని ఆయన అన్నారు. కొత్తగా అవతరించిన బంగ్లాదేశ్‌కు బియ్యం అవసరాలను ఆంధ్రప్రదేశ్ సమకూర్చగలదని ఆయన హామీ ఇచ్చారు.

రక్షణనిధి సేకరణలో పూర్తిగా కృషి చేయవలసిందిగా జిల్లా పరిషత్తులు, పంచాయతీ సమితులు, పురపాలక సంఘాలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో అక్కడికక్కడే రక్షణ నిధికి 8 లక్షల రూపాయలు వసూలయ్యాయి. ఇందులో తూర్పు గోదావరిలో 7 లక్షల రూపాయలు, పశ్చిమ గోదావరిలో లక్ష రూపాయలు వసూలయ్యాయి.

ఈ మహాసభలో వ్యవసాయశాఖ మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం మాట్లాడుతూ అధికోత్పత్తికై విజ్ఞప్తి చేశారు. బంగ్లాదేశ్‌కు ఆహార ధాన్యాలు సప్లయి చేయవలసిన అవసరాన్ని ఆయన వక్కాణిస్తూ దేశ రక్షణ దీక్షలో వివిధ సంస్థలవారు పడుతున్న పోటీని వివరించారు. ఎరువులు సరిగా అందుబాటు చేయబడగలవనీ, వాటి ద్వారా అధికోత్పత్తి సాధించి బంగ్లాదేశ్‌ను ఆదుకోవాలనీ ఆయన కోరారు. ఎరువులు సరఫరా కాకపోవడానికి వాటి కొరత మాత్రమే కారణమని ఆయన వివరించారు. ఇక ముందు సక్రమంగా పంపిణీ అవుతుందని ఆయన హామీ ఇచ్చారు.

అంతకు మునుపు దేవాదాయశాఖ మంత్రి శ్రీ రుద్రరాజు రామలింగరాజు ప్రసంగిస్తూ చైనా అమెరికాలవంటి పెద్ద రాజ్యాలు పరాభవం పొందాయనీ, అవి కక్ష సాధించదలుస్తాయనీ, మనం సర్వ సన్నద్ధంగా ఉండాలనీ, ప్రమాదం తీరిపోలేదనీ అన్నారు.

ముఖ్యమంత్రి ఈ సమ్మేళనంలో మాట్లాడుతూ తూర్పు పశ్చిమ గోదావరి జిల్లాల ప్రజలు, హైదరాబాద్ నగర ప్రజలు ఇప్పటికి మూడు నాట్ విమానాలు విరాళంగా ఇవ్వదలిచారని. వాటిని స్వీకరింపజేస్తూ రక్షణ మంత్రిని పిలిచి ఒక ఉత్సవం చేయాల్సి ఉంటుందనీ.ఆ విషయం తాను రక్షణమంత్రికి సూచించి వున్నాననీ అన్నారు.

దేశ రక్షణ నిధి సేకరణ పంచాయతీ రాజ్ వ్యవస్థల పని అని. దీన్ని విజయవంతం చేసి మన రాష్ట్ర ప్రతిష్ఠ నిలపాలనీ ముఖ్యమంత్రి కోరారు.

సమ్మేళనంలో ఇంకా విశాఖపట్నం జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ సాగి సీతారామరాజు. కృష్ణాజిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ పిన్నమనేని కోటేశ్వరరావు శాసన సభ్యులు శ్రీ వావిలాల గోపాల కృష్ణయ్య; శ్రీ సి. వి కె. రావు, శ్రీ లుకలాపు లక్ష్మణదాస్, శ్రీ ఎం. ఎస్. సంజీవరావు (ఎం పి), విశాఖ మున్సిపల్ అధ్యక్షుడు శ్రీ బి. సత్యనారాయణమూర్తి, మందస సమితి అధ్యక్షుడు శ్రీ వజ్జీ తులసీదాసు, పెరవలి సమితి అధ్యక్షుడు శ్రీ మృత్యుంజయరావు, శాసన సభ్యులు శ్రీ మాలె వెంకట నారాయణ కూడా ప్రసంగించి తమ తమ సూచనలు చేస్తూ సర్వ విధాలా తమ సహకారాన్ని, సహాయాన్ని వాగ్దానం చేశారు. సభలో రక్షణ నిధికిగాను అక్కడికక్కడే 8 లక్షల రూపాయలకు పైగా వసూలయ్యాయి.

శ్రీ ముళ్ళపూడి హరిశ్చంద్ర ప్రసాద్ తణుకులోని ఆంధ్ర షుగర్స్ సంస్థ తరపున లక్ష రూపాయలు, ఆ సంస్థ సిబ్బంది తరపున రు. 9725 రూపాయలకుగాను చెక్కుల్ని ముఖ్యమంత్రికి అందజేశారు. తూర్పు గోదావరి జిల్లా పరిషత్ అధ్యక్షుడు శ్రీ ఎస్.బి.పి.కె. సత్యనారాయణరావు ధన్యవాదాలందజేశారు.

కరీంనగర్ సమావేశం

రానున్న రిపబ్లిక్ దినోత్సవంలోగా 10 కోట్ల రూపాయల మేరకు జాతీయ రక్షణ నిధికి విరాళాలు సేకరించ వలసిందిగా పంచాయతీరాజ్ అధికార పదవులలోనివారికి ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు విజ్ఞప్తి చేశారు. కరీంనగర్‌లో డిసెంబరు 30వ తేదీన జరిగిన తెలంగాణా ప్రాంత పంచాయతీరాజ్ సదస్సులో తెలంగాణా ప్రాంత పంచాయతీరాజ్ అధికార పదవులలోనివారు, పురపాలక సంఘాధ్యక్షులు, పార్లమెంటు, శాసన సభ్యుల సమావేశంలో ప్రసంగిస్తూ ముఖ్యమంత్రి పై విధంగా అన్నారు.

తెలంగాణా ప్రాంతంలో 9 జిల్లాల జిల్లాపరిషత్ అధ్యక్షులు, తమ తమ జిల్లాలకు నిర్ణయించిన కోటాలను పూర్తి చేయగలమని హామీ ఇచ్చారు.

జాతీయ రక్షణ నిధి వసూళ్ళ కార్యక్రమం నిర్ణయించుకోవడానికి వివిధ పంచాయతీ సమితులకు కోటాలు నిర్ణయించడానికిగాను జనవరి 11న సమావేశాలు జరపవలసిందిగా జిల్లాపరిషత్తు లన్నిటిని ముఖ్యమంత్రి కోరారు.

తమ తమ జిల్లాలలోని జనసంఖ్యకన్నా తాము సేకరించే నిధి మొత్తం తగబోదని జిల్లాపరిషత్తుల అధ్యక్షులు చేసిన వాగ్దానం పట్ల ముఖ్యమంత్రి హర్షం ప్రకటించారు

"యుద్ధ విరమణ జరిగినప్పటికీ ఆ ప్రమాదం తొలిగిపోలేదు ఇది ప్రమత్తంగా ఉండతగిన సమయంకాదు" అని ఆయన అన్నారు.

యుద్ధ సన్నాహాలకు తోడ్పడే ప్రచురణలు వెలువరించడం ప్రచార కార్యకలాపాల నిర్వహణకు అవసరమైన నిధులు లభింపచేసే విషయంలో నిబంధనల జాప్యాన్ని తొలగించగలమని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. యుద్ధ సన్నాహాల కృషి నిర్వహణ అన్ని రాజకీయ పార్టీల సమిష్టి బాధ్యత అనీ, దానికి రాజకీయ ఉద్దేశాలు ఆపాదించరాదనీ ఆయన అన్నారు.

పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి శ్రీ తోట రామస్వామి ప్రసంగిస్తూ యుద్ధ సన్నాహాలు ప్రత్యేకించి రక్షణ నిధి సేకరణ, తమ విద్యుక్త ధర్మంగా భావించి సహకరించాలనీ సైనికుల కుటుంబాలకు అన్ని విధాలా తోడ్పడాలనీ ప్రజల కోసం తాము సర్వత్యాగాలకు సిద్ధపడగా ప్రజలు తమను విస్మరించారన్న భావన జవాన్లకు కలుగనీయరాదని అన్నారు.

పరిశ్రమల శాఖమంత్రి శ్రీ చొక్కారావు ప్రసంగిస్తూ, తెలంగాణా ప్రాంతం వెనుకబడినదైనా యుద్ధకృషికి తోడ్పడడంలో సంపన్న రాష్ట్రాలకు తీసిపోరాదని అన్నారు

శ్రీ వి. బి. రాజు ప్రసంగిస్తూ, విదేశీ సహాయం వల్ల ప్రజలలో చొరవ నశించినదనీ, అట్టి సహాయ.వల్లకలిగే అపదలను ఇప్పుడు గుర్తెరగడంతో ప్రజలు తమ కాళ్ళపై నిలబడడానికి సిద్ధమైనారనీ అన్నారు.

శ్రీ రామగోపాల్‌రెడ్డి (పార్లమెంటు సభ్యుడు) ప్రసంగిస్తూ, అణ్వస్త్రాల తయారీకై భారత దేశం వనరులను స్వయంగా సమకూర్చుకోవాలని అన్నారు.

పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ తెలంగాణాకు, బంగ్లాదేశ్‌కు పెక్కు పోలికలున్నాయన్న వాదాన్ని ప్రస్తావిస్తూ, వాటి రెంటికి మధ్య పెక్కు తేడాలు ఉన్నాయనీ ఈ ప్రాంతపు సమస్య పరిష్కరించి న్యాయం చేకూర్చడానికై తెలంగాణా ప్రాంత ప్రజలతో ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి చర్చలు జరిపారని అన్నారు.

పార్లమెంటు సభ్యుడు శ్రీ సత్యనారాయణరావు, హనుమకొండ పంచాయతీ సమితి సభ్యుడు శ్రీ సత్యనారాయణ, పటన్ చెరువు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ రామచంద్రారెడ్డి ప్రభృతులు ప్రసంగించారు.

ప్రొద్దుటూరు సమావేశం

రాష్ట్రంలోని మూడు ప్రాంతాలనుండి రక్షణనిధికి ఎక్కువగా విరాళాలు సేకరించిన జిల్లాలను ప్రాంతానికి ఒకటి చొప్పున ఎన్నుకొని ప్రభుత్వం గౌరవించ గలదు. అని ప్రాంతీయ ప్రాతిపదికపై జరుపుతున్న పంచాయతీరాజ్ మహాసభలలో చివరి దానిలో ముఖ్యమంత్రి ఈ సమాచారాన్ని జనవరి 4 న ప్రకటించారు. ఎంపికచేసే ఈ జిల్లాలను ఏ విధంగా గౌరవించాలో ప్రభుత్వం త్వరలో నిర్ణయి చగలదు.

ప్రాంతీయ పంచాయతీరాజ్ సభలకు జిల్లాపరిషత్ సభ్యులు పంచాయతీ సమితుల అధ్యక్షులు, పార్లమెంటు సభ్యులు, శాసన సభ్యులు, మునిసిపాలిటీల ఛైర్మెన్‌లు, జిల్లాల అధికారులు హాజరయినారు.

ప్రొద్దుటూరులో జరిగిన రాయలసీమ ప్రాంతం పంచాయతీ రాజ్ సభలో ముఖ్యమంత్రి రిపబ్లిక్ దినానికి ముందుగా మనిషికి ఒక రూపాయి చొప్పున రక్షణనిధికి విరాళాలను వసూలుచేయడం పూర్తి చేయాలని పంచాయతీలను, మునిసిపాలిటీలను కోరారు. ప్రభుత్వం ఈ విధంగా ఐదుకోట్ల రూపాయలను సేకరించదలుస్తున్నదని; రాఫిల్‌ద్వారా ఇతర విధాలద్వారా మరో ఐదుకోట్లు రూపాయలను సేకరించగలదని ముఖ్యమంత్రి తెలిపారు.

రిపబ్లిక్ దినోత్సవాల సందర్భంగా జిల్లా కేంద్రాలకు ఒక్కొక్క మంత్రి చొప్పున హాజరవుతారని. ఆయా జిల్లాలలో రక్షణ నిధికి వసూలయిన మొత్తాలను జిల్లా కలెక్టరు మంత్రులకు అందచేస్తారని, అప్పటి వరకు రక్షణ నిధికి ఎంత మొత్తం వసూలయినదో ప్రభుత్వానికి తెలియగలదని ముఖ్యమంత్రి అన్నారు.

రిపబ్లిక్ దినం నాటికి ఐదుకోట్ల రూపాయలను వసూలు చేయగలుగుతామన్న విశ్వాసాన్ని ముఖ్యమంత్రి వ్యక్తంచేశారు. ఉదారతకు, త్యాగభావానికి రాష్ట్రప్రజలు పేరుబడసిన వారని పంచాయతీరాజ్ సంస్థలు వారిలో తగు ఉత్సాహాన్ని జనింపచేసి విరాళాలను వసూలు చేయాలని శ్రీ నరసింహారావు కోరారు.

యుద్ధం ముగిసినా యుద్ధప్రమాదం తొలగిపోలేదని, అందువల్ల మనం ప్రమత్తగా ఉండకూడదని ముఖ్యమంత్రి అన్నారు.

బంగ్లాదేశ్ ప్రజలు ఇబ్బందుల్లో ఉన్నారని, వారికి తోడ్పడి వారి ఆర్థిక పరిస్థితిని అభివృద్ధి పరచడం మనకర్తవ్యమని తెలియజేశారు. వెనుకబడిన జిల్లా అయిన ఆదిలాబాద్‌లోని మంచిర్యాల మున్సిపాలిటీ 18 వేల రూపాయల విరాళాలనువసూలుచేసి ప్రభుత్వానికి పంపినదని ముఖ్యమంత్రి తెలిపారు.

ఉపముఖ్యమంత్రి శ్రీ బి. వి. సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాయలసీమ వెనుకబడిన ప్రాంతమైనా, జాతి ప్రయోజనాలకు తోడ్పడటంలో ఎపుడూ వెనుకాడ బోదని అన్నారు. కర్నూలు జిల్లాలో జాతీయ రక్షణనిధికై వసూలు చేసిన మొత్తం ఒక లక్ష ఎనుబది వేల రూపాయల చెక్కును ఆయన ముఖ్యమంత్రికి అందచేశారు.

పంచాయతీరాజ్ మంత్రి శ్రీ తోట రామస్వామి సైనికుల కుటుంబాలకు తోడ్పడవలసినదిగా పంచాయతీరాజ్ సంస్థలనుకోరారు.


పార్లమెంటు సభ్యులు పెండేకంటి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ, ప్రధాని శ్రీమతి ఇందిరా గాంధీ విజయాన్ని సాధించిపెట్టి మన దేశ కీర్తి ప్రతిష్ఠలను ఇనుమడింప చేశారని. బంగ్లాదేశ్ కోసం మనం పోరాడుతున్న సమయంలో అమెరికా నిర్వహించిన పాత్ర, మన దేశం అన్ని విషయాలలో స్వయం ఆధారితంగా ఉండాలనే గుణపాఠాన్ని ఇస్తున్నదని అన్నారు.

పార్లమెంటు సభ్యురాలు శ్రీమతి టి. లక్ష్మీకాంతమ్మ, కడప జిల్లా పరిషత్ అధ్యక్షులు వి. రామస్వామి రెడ్డి, ఆత్మకూరు పంచాయతీ అధ్యక్షులు నాగలక్ష్మి రెడ్డి, పార్లమెంటు సభ్యులు వై. ఈశ్వర రెడ్డి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్ అధ్యక్షులు గురువారెడ్డి, కర్నూలు జిల్లా పరిషత్ అధ్యక్షులు లక్ష్మీకాంత రెడ్డి నెల్లూరు జిల్లా పరిషత్ అధ్యక్షులు గోపాలకృష్ణారెడ్డి కడపజిల్లా, శ్రీకాకుళం జిల్లా అధ్యక్షులు మొదలయినవారు ఈ సభలో ప్రసంగించారు. మారంపాలెం పంచాయతీ సమితి అధ్యక్షులు రాజరెడ్డి తన సమితిలో లక్ష రూపాయలను జాతీయ రక్షణ నిధికై సేకరించినట్లు తెలిపారు. చిత్తూరు జిల్లాలో జాతీయ రక్షణ నిధికి రెండు లక్షల ఏబది నాలుగు వేలు వసూలు అయినవి. సైనికుల కుటుంబాలకు ఇవ్వడానికై కడప జిల్లా వాసి బి. సుబ్బారావు రెండు ఎకరాల భూమిని విరాళంగా ఇచ్చారు.

రాష్ట్ర సమాచార మంత్రి ఎ. వాసుదేవరావు, స్పీకరు శ్రీ కె.వి. వేమారెడ్డి, విధానమండలి అధ్యక్షులు శ్రీ పి. రంగారెడ్డి, మంత్రి శ్రీ సి. సుబ్బారాయుడు, మంత్రి శ్రీ కె. గోపాలనాయుడు, మంత్రి శ్రీ మానిక్ రావు, మంత్రిణి శ్రీమతి పద్మా భాస్కర రెడ్డి గార్లుకూడా ఈ సభకు హాజరైనారు.

ఉత్పత్తులను హెచ్చించండి: స్వశక్తిమీద నమ్మకం పెంచండి






(1) తిరుమల, తిరుపతి దేవస్థానం అధ్యక్షులు జనవరి 5 న ముఖ్యమంత్రికి తిరుపతిలో రు. 10 లక్షలను రక్షణనిధికి విరాళంగా యిచ్చారు.

(2) సమాచార, పౌరసంబధ శాఖా మంత్రి నిజామాబాదులో డిసెంబరు 17 న రక్షణ నిధి విరాళాన్ని స్వీకరిస్తున్నారు.


(3) గూడూరులోని పి. ఆర్. క్లబ్బువారు డిసెంబరు 15న ఆర్థిక మంత్రికి వెయిన్నూట పదహార్లను రక్షణనిధి నిమిత్తం అందజేస్తున్న దృశ్యం.


(4) రవాణా మంత్రికి డిసెంబరు 23 న ఖమ్మంలో ఖమ్మంజిల్లా లారీయజమాన్ల సంఘంవారు రక్షణ నిధి నిమిత్తం రు. 1,111ల చెక్కును అందజేశారు.

(5) సమాచార, పౌరసంబంధశాఖామంత్రికి డిసెంబరు 19న హైదరాబాదులోని రవీంద్రభారతిలో సహకార సంఘోద్యోగుల సాంస్కృతిక సంఘం వారు రక్షణ నిధికి విరాళాన్ని అందజేశారు.



రక్షణ నిధికి విరాళాలు










ఆంధ్రప్రదేశ్ అమర వీరులు

ఇటీవలి పోరాటంలో దేశ రక్షణ తత్పరులై అసువు లర్పించిన ఆంధ్రప్రదేశ్ వీరులు, వారిసన్నిహిత బంధువులు వారి చిరునామా మొదలైన వివరాలు ఈ దిగువ పేర్కొనబడ మైనది. వీటిని బ్రిగేడియర్ ఎం. కె. బాలచంద్రన్ అందజేశారు.

1. సిపాయ్ షణ్ముగచారి (శ్రీమతి ఆది లక్ష్మి (తల్లి), మహాదేవపురం గ్రామం. పోస్టు. వెంగళరాజు కుప్పం. పుత్తూరు. చిత్తూరు జిల్లా)

2 మేజర్ జి. టి. రెడ్డి. (శ్రీమతి. సి. లక్ష్మమ్మ, కె. సి. నర్సప్ప. పాత గుంతకల్, పోస్టు. గుంతకల్. అనంతపురం జిల్లా)



3. సెకెండ్ లెఫ్టినెంట్ సి. వి. బి. అప్పలస్వామి. (శ్రీ బర్ష అప్పలస్వామి 3_4_714, 1వ నెం వీధి, లింగపల్లి బాగ్, హైదరాబాదు_27)

4. లెఫ్టినెంట్ ఎం. వి. ఎస్. సత్యనారాయణ, (శ్రీ ఎం. రవీంద్ర నాథ్, పాకాల వీధి, విశాఖ పట్నం)

5. సెకండ్ లెఫ్టినెంట్, వై. బాబూరావు, (శ్రీమతి వై. సుబ్బమ్మ గురుజాల, గుంటూరు జిల్లా)

6. కెప్టెన్ అశోక్ కుమార్, 14 (శ్రీ ఎన్. మధుసూదన్. 2/7 మారేడ్ పల్లి రోడ్, సికింద్రాబాద్)

7. సిపాయ్ సుబ్బ గంగయ్య (శ్రీమతి జయమ్మ-(తల్లి). బోయ చిన్న గంగ పల్లి గ్రామం, చినత మాకుల పల్లి, పలమనేరు తాలూకా, చిత్తూరు జిల్లా)

8 లెఫ్టినెంట్ ఎం. సంపత్ కుమార్ (ప్రస్తుత చిరునామా శ్రీమతి సుందరి ఎస్. కుమార్ (భార్య) 1_20 నావల్ ఆఫసర్ ఫ్లేట్, కొలభా, బొంబాయి. అసలు చిరునామా 194/15 సి. ఎస్. వీధి, తిరుపతి)

9. ఎన్. వి. కుమార్ (శ్రీ ఎన్. ఎస్, రావ్ (తండ్రి) 107/55 ఎ. మసీదు వద్ద, సాయీ నిలయం. రవీంద్ర నగర్, సీతాఫల్ మండి, సికిందరాబాదు)

10 లెఫ్టినెంట్ నాయిక్ బల్లి దేవేందర్ రావు (శ్రీ లింగయ్య (తండ్రి) నెం, 26, పోలీసు క్వార్టర్స్, నాంపల్లి, హైదరాబాదు జిల్లా)



11. ఫ్లైట్ లెఫ్టినెంట్ ఎ. ఆర్. డకొస్టా, ఫ్లెయ్యింగ్ పైలట్ (శ్రీమతి ఎ. ఆర్. డకొస్టా (భార్య) 3_5_804/2/1 కింగ్‌కోఠి రోడ్డు, హైదరాబాదు)

12. ఫ్లైట్ లెఫ్టినెంట్ ఆర్. బి. మెహన్, ఫ్లెయ్యింగ్ నేవిగేటర్ (శ్రీ ఆర్. బి. మెహత (తండ్రి) 4_1_1079, బొగ్గుల కుంట, హైదరాబాదు)

13. నాయక్ జి. చిన్న అప్పారావు. (శ్రీమతి జి. శేషమ్మ (భార్య) కోతఆపకాలు గ్రామం. తొండంగి పోస్టు, తుని తాలూకా, తూర్పు గోదావరి జిల్లా)

14. సిపాయ్ సగరపు తాతబ్బాయి, (శ్రీమతి తలుపులమ్మ (భార్య)బెండపూడి, అన్నవరం తాలూకా, తూర్పు గోదావరి జిల్లా)

15 కొప్పుసెట్టి భాస్కరరావు. శ్రీమతి రత్నకుమారి (భార్య) నెం. 812,3 ఎపిఎస్ పి. క్వార్టర్స్ రామనారాయణ పేట, పోస్టు కాకినాడ, తూర్పు గోదావరి జిల్లా)

16. నాయక్ ఎస్, అబ్దుల్ అజీ, (శ్రీమతి అజ్మతున్నీసర్ఫ ఖుదైజ కాతున్ (భార్య) ఇంటి నం. 13/111, ఖదపూడ స్ట్రీట్, నంది కొట్కూర్ తాలూకా, కర్నూలు జిల్లా)

17. సాపర్ షేక్ జైనుల్లాబుద్దీన్(శ్రీమతి వహీదున్నీసా బాయ్ (భార్య) చిన్న మట్లపూడి గ్రామం,పెద్ద మట్లపూడి పోస్టు. రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా)

18. సాపర్ మహ్మద్ ఉమర్ (శ్రీమతి ఖైరున్నీసాబీ (భార్య) ధాలెష్ పాలెం గ్రామం, నిజాంపట్నం పోస్టు, రేపల్లె తాలూకా, గుంటూరు జిల్లా)

19 సాపర్ తాడంకి అర్జునరావు (శ్రీమతి రత్నా సుశీల. (భార్య) మధిర పాడి గ్రామం. వయా. కాటూరు, ఈదు పల్లి పోస్టు, కృష్ణా జిల్లా)

20. లాన్స్‌నాయక్ లక్ష్మీనారాయణ (శ్రీమతి మహాలక్ష్మమ్మ (తల్లి) కె/ం సుబ్బన్న (తండ్రి) రోమదం గ్రామం పెద్ద సీడి పోస్టు, శ్రీకాకుళం జిల్లా)

21. సిపాయ్ పిల్లియల చిట్టిబాబు, (శ్రీమతి చిట్టెమ్మ (తల్లి) చిన వాల్తేరు గ్రామం, వాల్తేరు, విశాఖజిల్లా)

22, సిపాయ్ సందెపాగ్ ఫ్రాన్సిస్ (శ్రీమతి సంపతమ్మ (తల్లి) సత్తెన పల్లి గ్రామం, సత్తెన పల్లి, గుంటూరు జిల్లా)


23. సిపాయ్ నడగాన అప్పన్న (శ్రీమతి లక్ష్మమ్మ (భార్య) పెద కొత్తూరు, పారాపురం గ్రామం, కొత్తూరు పోస్టు, పాతపట్నం తాలూకా, శ్రీకాకుళం జిల్లా)

24. సిపాయ్ లింగం (శ్రీమతి సాలమ్మ (భార్య) కంది కుంద గ్రామం, తిరుమల్‌గిరి పోస్టు. సికిందరాబాదు)


25 సిపాయ్ వెంకట స్వామి (శ్రీమతి రామక్క (తల్లి) పద్దికలిగిరి గ్రామం, చిన్నకాగిరి పోస్టు, పూతల పట్టు టవున్, చిత్తూరు జిల్లా)

26. సిపాయ్ సయ్యద్ ఫరీద్ ఖాన్ (శ్రీమతి అబ్బెక్‌బే (తల్లి) జయపూర్ గ్రామం, చిన్నూరు తాలూకా, మంచిర్యాల టవున్, ఆదిలాబాద్ జిల్లా)

27. సిపాయ్ ఉపాల దశరథ్ (శ్రీమతి లక్ష్మమ్మ (తల్లి) ఇంటి నెంబరు. 3_7_217, కాకాగూడ, తిరుమలగిరి పోస్ట్, హైదరాబాదు.)



రాజస్థాన్ రంగంలో వీరోచిత మరణం పొందిన కెప్టెన్ జి. తిమ్మారెడ్డి తల్లి శ్రీమతి గుంతకల్లు లక్ష్మమ్మకు అనంతపురం జిల్లా కలెక్టరు శ్రీ ఆర్. వి. కృష్ణన్ గుంతకల్లులో డిసెంబరు 30న రూ. 5000ల బ్యాంకు డ్రాఫ్టును అందజేస్తున్న దృశ్యం.



వీరమరణం పొందిన తిమ్మారెడ్డి పేరు మీద గుంతకల్లు ఆసుపత్రిలో విడిగా ఒక బ్లాకును నిర్మించే నిమిత్తం వీరయోధుని తల్లి శ్రీమతి గుంతకల్లు లక్ష్మమ్మ తరపున తిమ్మారెడ్డి సోదరుడు శ్రీ జి. చంద్రశేఖరరెడ్డి జిల్లా కలెక్టరుకు రూ. 9750ల బ్యాంకు డ్రాఫ్టును అందజేస్తున్న దృశ్యం.

భారత్ బాంగ్లా భాయ్ భాయ్

శ్రీ. జె. బాపురెడ్డి

భారత్ బాంగ్లా భాయ్ భాయ్
అఖండ విజయం మనదేనోయ్

స్వాతంత్ర్యమునే సవాలు చేసిన
పాకిస్తాన్ పని తీరిందోయ్ ప్రజాస్వామ్యమే గెలిచిందోయ్ భారత్॥

నిరంకుశత్వము నియంతృత్వము
సమూరాంధుల వలసాధిపత్యము
సమైక్య భారత బంగ్లాశక్తికి
చిటపట చిటపట కూలినవోయ్ భారత్॥

త్యాగమూర్తి షేక్ ముజీబు కలలు
బాంగ్లాదేశ్‌గ పండినవోయ్
నవతా యువతా సమతా దీప్తులు
నవభారతమున నిండినవోయ్ భారత్॥

జై జై స్వతంత్ర భారత బాంగ్లా
జనతా సమైక్యతా యుగేందిరకు
జై జై దేశ సురక్షా దీక్షా
వీర సేనలకు విప్లవేందిర భారత్॥

అంతా ఒక్కటే మనమంతా ఒక్కటే

శ్రీ వక్కలంక లక్ష్మీపతిరావు

అంతా ఒక్కటే మనమంతా ఒక్కటే
దేశాలు వేరైనకాని పద్మమొక్కటే
వ్యక్తులు వేరైన కాని జాతి యొక్కటే
భాషలు వేరైన కాని భావమొక్కటే అంతా॥

హిందువైన ముస్లిమైన భరతమాత బిడ్డడే
ధనమున్నా లేకున్నా తల్లిప్రేమకర్హుడే

తూర్పేమి పడమరేమి ఉత్తర దక్షిణములేమి అంతా॥
ఉన్న దేశమొక్కటే ఉన్నజాతి ఒక్కటే
ఒక్కటే ఒక్కటే... అంతా॥

ఒక పతాక నీడక్రింద
ఉన్నాం మనమొక్కటే
రాజ్యాంగపు దృష్టిలోన
ప్రజలంతా ఒక్కటే
ఒక్కటే ఒక్కటే... అంతా॥

(దేశభక్తి గేయాలు
ఆకాశవాణి సౌజన్యంతో)

"మన కర్తవ్యం"

ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ఆంధ్రప్రదేశ్ ప్రజానీకానికి వివిధ నాయకుల ఉద్బోధ

"ధర్మానికి జయం లభించింది. పాకిస్తాను మిలిటరీ ప్రభుత్వం, వారిని బలపర్చినవారు పన్నిన ఎత్తుగడలు విఫలమైనాయి.

ఐనప్పటికీ మనము అప్రమత్తులమై ఉండాలి. పంటలు అధికముగా పండించాలి పరిశ్రమలలోకూడ ఉత్పత్తి పెంచాలి. మనకు ఆర్థిక సహాయాన్ని నిల్పివేయడానికి కొందరు చూస్తున్నారు. అన్ని రంగాల్లోనూ ఉత్పత్తులు అధికం చేయాలి. ఇతరులమీద ఏవిధంగాను ఆధారపడగూడదు.

మన కృషిలో ఏవిధమైన అలక్ష్యము పనికిరాదు. యుద్ధ సమయంలో ఏవిధంగా నడుంకట్టి మనమంతా కలిసి కృషిచేశామో, అదే విధంగా యికముందుకూడా మనం నిర్విరామంగా అన్ని రంగాలలోను కృషి చెయ్యాలి. మన అర్థిక వ్యవస్థను పునరుద్ధరిచుకుంని, స్వయంపోషక సమాజంగా వర్థిల్లాలి. ఇక ఏ దేశం మీద మనం ఆధారపడి ఉండడం అంత మంచిది కాదు. మన దేశం సువిశాలమైనది. జలసంపదతోను, ఖనిజ సంపదతోను విరాజిల్లుతున్న దేశం. అన్ని రంగాలలోను స్వయం సమృద్ధిని పెంచుకుని. ప్రపంచంలో, అగ్రశ్రేణికి చెందిన దేశంగా మనం అభివృద్ధి పొందాలి. మనం సంకల్పించుకుంటే, అచిర కాలంలోనే మనం ఆ స్థితిని అందుకోగలం."

—శ్రీ తోట రామస్వామి
పంచాయతీరాజ్ శాఖా మంత్రి

"వ్యవసాయ పారిశ్రామిక రంగాలలో అధికోత్పత్తి దేశ రక్షణకు పునాది వంటిది. రైతులు కార్మికులు సాంకేతిక నిపుణులు వ్యాపారులు దృఢ దీక్షతో పనిచేసి ధైర్యసాహసాలు ప్రదర్శిస్తున్న మన సైనికులకు అండదండలు కల్పించాలని మన ప్రియతమ నాయకులు భారత ప్రధాని శ్రీమతి ఇందిరాగాంధి అన్నారు. ఇదే మనకు శంఖారావం. ప్రతి నిమిషం ఎంతో విలువైనది. కాలం వృధా పుచ్చక కర్తవ్య పరాయణులుగా రంగంలోకి దూకాలి మనదేశపు ౫౬ కోట్ల ప్రజలకేగాక, బంగ్లాదేశ శరణార్థులకు కావల్సిన ఆహారోత్పత్తికి ద్విగుణీకృతమైన కృషి చేయాలి. విదేశీ సహాయంకొరకు అఱ్ఱలు చాచకూడదు. అయితే ఆహారోత్పత్తి వట్టి నినాదాలతో జరిగేది కాదు. మనకు అందుబాటులోనున్న వనరులను పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. వీటిని వృధా చెయ్యకుండా పూర్తిగా సద్వినియోగం చేసుకోవాలి. తక్కువ కాలం ఎక్కువ దిగుబడినిచ్చే పంటలను పండించాలి. ఆహార ధాన్యాలు క్రిమికీటక వగైరాలవల్ల తరుగుపోకుండా జాగ్రత్తపడాలి. ప్రతివ్యక్తి ఆహారధాన్యాలను చాలాపొదుపుగా ఉపయోగించుకోవాలి.

మానవశక్తి సద్వినియోగం చేసి, ఒక్క కంకి పండేచోట రెండు కంకులు పండించాలి. బంజరు భూములను పంటచేలుగాను, ఎడారుభూములను సస్యశ్యామలంగాను చేయాలి. ఆహారధాన్యాలేకాక, పాలు, గ్రుడ్లు, మాంసం అధికోత్పత్తికి ద్విగుణీకృతమైన కృషి చేయాలి ఇవి చాల అవసరం"

— శ్రీ కాకాని వెంకటరత్నం
వ్యవసాయ శాఖామంత్రి

దేశసంరక్షణకు యుద్ధంలో విజయం సాధించడానికి జవాన్లు ఎంత అవసరమో సైనికులకు అండదండలుగా నిలిచే ప్రజలకు కావలసినంత ఆహారం పండించడం కూడా అంతే ముఖ్యం.

"ప్రతివాడూ ఒకభుజంవేసినపుడే ఒకఘనకార్యం జరుగుతుంది. మన ప్రజాస్వామ్య పరిరక్షణకు మన కర్తవ్యాన్ని విస్మరించరాదు. విరాళాలు ధనరూపంలోనే కాదు, వస్తురూపంలోనూ యివ్వవచ్చు.

ఉత్పత్తులను పెంచాలి. అయిన ఉత్పత్తులను సక్రమ పద్ధతులలో విడుదల చేయాలి.

వ్యాపారస్థులు యీతరుణంలో అక్రమ లాభాల దృష్టి విడనాడాలి. నిత్యావసర వస్తువులను ప్రజలకు అందుబాటులో ఉంచాలి. అప్పుడే వారు కూడా దేశప్రజలకు యథోచితమైన సేవ చేసిన వారవుతారు."

—శ్రీ పిడతల రంగారెడ్డి
శాసనమండలి అధ్యక్షులు

"భారతదేశానికి పరదేశాలను ఆక్రమించే అసూయతీ లేదు. ఎప్పుడూ లేదు. కాగా భారతదేశం శాంతిని కోరేదేశం. అయిన పాకిస్తానుకు మన దేశాన్ని క్షమించడమే పరిపాటు అయింది. కాశ్మీరులో, కచ్‌లో, ఇక 1965 లో మనపై పెద్దఎత్తున యుద్ధం ప్రారంభించి, చివరకు పలాయనం చిత్తగించింది. ఇవన్నీ పాకిస్తాన్ ప్రజలకు తెలియవనికాదు. భారతదేశం పురోగమిస్తుంటే తమ పాకిస్తాన్ పురోగమిస్తుందని వారికి తెలుసు. కాని వారు నోరు తెరచి మాట్లాడటానికి అవకాశం లేదు. సైనిక నియంతృత్వంలో ప్రజాభిప్రాయానికి తావులేదు. ధర్మంతోపాటు సైనిక బలంకూడా భారతదేశం వైపున ఉందని పాకిస్తాన్ ప్రజలకు తెలుసు. మన వీర జవాన్ల విజయపరంపరలకు పాశ్చాత్య దేశాల్లోని, అమెరికాలోని విజ్ఞులు దిగ్భ్రమ జెందుతున్నారు. అప్పటి గాంధీజీ అహింసా శక్తిని పాశ్చాత్య ప్రభువులు సరిగా అర్థం చేసుకోలేక పోయారు. అలాగే ఇప్పటి ఇందిరాగాంధీ వజ్ర సంకల్పాన్నీ సరిగా అర్థం చేసుకొనలేక పోతున్నారు.

సమ్మెలకు, తగాదాలకు ఇది సమయం కాదు ఉత్పత్తులను అధికం చేయాలి. ముఖ్యంగా వ్యాపారస్తులు వస్తువుల ధరలను అక్రమంగా పెంచకూడదు. వినియోగవస్తువులను దాచకూడదు. బ్లాకు మార్కెట్ పద్ధతిమానాలి. ఇలాంటి అక్రమ వ్యాపారం మామూలుగా కూడా సంఘ విద్రోహం. ఇప్పుడైతే ఇది దేశద్రోహం అని చెప్పాలి జవాన్లు అక్కడ ప్రాణాలు అర్పిస్తుంటే కొందరు వ్యాపారులు యిక్కడ లాభాలు ఆర్జించుకుంటున్నారు అనే అపనిందకు గురికాకూడదు."

— శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి

"మనము మన మన రంగాలలో నడుము కట్టుకొని మనము చేసే ప్రతి పనిని పట్టుదలతో వేయింతలు చేయడానికి స్థిర సంకల్పం కావలయును. ఉత్పత్తి పెంచవలయును. ఐక్యతను భాష, రాష్ట్ర, మత సామరస్యములను పెంపొందించుకొనవలయును. ధరలను పరిమితముగా యుంచుటకు ఒక ప్రక్క ప్రభుత్వము వేరొక ప్రక్క మనము కృషి చేయవలసియుండును. సైనికులను ప్రత్యేకించి సైనిక కుటుంబాలను మన ఆత్మీయులుగా భావించి గుర్తించుకొని వారి అవసరములను ఆదుకొనుటకు అన్ని విధముల మనము ముందుకు రావలయును. పాకిస్తాన్‌తో యుద్ధము పేరున అసాంఘిక శక్తులు ముఖ్యంగా హిందూ ముస్లిం చీలికలు కలుగజేయుటకు ప్రయత్నములు చేయుదురు. వారిని వేయికళ్ళతో కనిపెట్టి చూచుచు మనము చాలా శ్రద్ధగా యుండ వలయును. హిందూ ముస్లిం ఐక్యతను స్థిరముగా కాపాడవలయును.

బంగ్లాదేశ్ ప్రభుత్వం సుస్థిర పడటానికి మనము అన్ని విధాలా తోడు పడదాము. పశ్చిమ పాకిస్తాన్‌లోకూడ అన్ని సమస్యలు సక్రమంగా సంతృప్తికరంగా పరిష్కారమగు వరకు వెనుకకు తిరిగేది లేదు. ప్రధానికి సైనిక శక్తికి అండగా నిలిచెదము. మన సత్యము, మనసిద్ధాంతములపై ఉండే మన విశ్వాసము, మన దేవుడు సదా మనలను రక్షిస్తూ యుండును."

— డా. ఎం. చెన్నారెడ్డి

"ఒక విధంగా యీ పోరాటం ప్రజాస్వామ్యానికి—నియంతృత్వానికి. స్వేచ్ఛకు—నిరంకుశత్వానికి. సమైక్యతకు—విచ్ఛిన్నతకూ, నాగరికతకూ—ఆటవికత్వానికి జరిగిన సమరం.

ఈ సమయంలో ధరలు పెంచకుండా అదుపులో ఉంచవలసిన ధర్మాన్ని వర్తకులు పాటించాలి. అవసరంగా ఆదనంగా ధాన్యాలు నిల్వచేసే పద్ధతులు విరమించాలి. దాచుకున్న డబ్బు. బంగారం ప్రభుత్వానికి యిచ్చి రక్షణకు అనువైన చర్యలన్నీ తీసుకోవాలి.

ఇవన్నీ చేస్తే, ప్రభుత్వానికి, ఎంతో చేయూత యిచ్చినట్టుగా ఉంటుంది. అదేమన జవాన్లకు అండ, ప్రోత్సాహం."

— శ్రీ గౌతు లచ్చన్న
స్వతంత్రపార్టీ నాయకులు

"బంగ్లాదేశ్ సమస్యను అక్కడి ప్రజలకు అంగీకారమైన విధంగా సత్వరం గుర్తించాలనీ, ఏమాత్రం ఆలస్యం జరిగినా తీవ్ర పరిణామాలకు దారితీయనున్నదనీ భారత ప్రభుత్వం ప్రపంచ దేశాలను హెచ్చరించింది.

సోవియట్ యూనియన్, మరికొన్ని సోషలిస్టు దేశాలను మినహాయించి మిగతా దేశాలన్ని యీ సమస్య పరిష్కారానికి తోడ్పడలేదు.

గాయపడిన వీరజవాన్లకోసం రక్తదానం చేయాలి. యుద్ధరంగంలో పోరాడిన మన సైనికులకు వారి కుటుంబాలకు సహాయం చేయాలి. ఇందులకు ప్రజానీకాన్నంతా మనం సమీకరించాలి. ఈ కృషిపై కేంద్రీకరించవలసిందిగా కమ్యూనిస్టు పార్టీకి చెందిన శాసనసభ్యులందరికీ ఆదేశాలివ్వబడ్డాయి.

రాష్ట్ర ప్రజానీకంలో మత సామరస్యాన్ని కాపాడాలి. దేశరక్షణకు మతసామరస్యానికి వ్యతిరేకులైన వారిని ఒక కంట కనిపెట్టివుండాలి.

దేశంలోని ఆత్యయిక పరిస్థితిని తమ స్వలాభాలకోసం ఉపయోగించుకో జూచే స్వార్థపర వర్గాలను దొంగ నిల్వలుచేసి ధరలు పెంచే వారిని సంఘవ్యతిరేకశక్తులను బహిర్గత పరచాలి ప్రభుత్వం వీరిపై కఠినచర్యలు తీసుకొనేటట్లు చూడాలి"

— శ్రీ వై. వి. కృష్ణారావు
లెజిస్లేచర్ కమ్యూనిస్టు పక్ష నాయకులు

"మన ప్రధానమంత్రి అన్నట్లుగా మన ధైర్యసాహసాలు సడలకుండా ఉండడానికి మన ఆదర్శాలను నిలబెట్టడానికి కళాకారులు, రచయితలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్రంగా కృషిచేయాలి. దేశంలోని మహిళామణులకు ప్రత్యేకంగా విజ్ఞప్తి. ముఖ్యంగా వారు పొదుపుచేయాలి. మనమందరం అన్ని విధాల త్యాగాలు చేయాలి. రక్తదానం చేయాలి. ఇది చాలా అవసరం,

— శ్రీమతి జె. ఈశ్వరీబాయి
రిపబ్లికన్ పార్టీ నాయకులు

(ఆకాశవాణి సౌజన్యంతో)

జయహో దిగ్జయహో

"శశాంక"

జయహో దిగ్జయహో
నేల నాలుగు చెరగులందున
బాల సూర్యుని కిరణముల వలె
శౌర్య పటిమను చాటుకొంటూ
సాగిపోయే భరత సేనకు, నేడే ॥జయహో॥

తనువులంటే గడ్డిపోచగ
తలచి శత్రువునెదురుకొంటూ
దేశరక్షణ దీక్ష దాల్చి
తీవరించే భరత సేనకు, నేడే ॥జయహో॥

కడుపు నిండగ తిండి మరచి
కంట నిద్దుర కూడ విడచి
కన్న భూమిని భక్తి కొలిచి
కదిలిపోయే భరత సేనకు, నేడే ॥జయహో॥

కదన భూమి కేగుదాం

శ్రీ ముక్కామల నాగభూషణం

కదనభూమి కేగుదాం
కత్తి దూసి దూకుదాం
కరకు శత్రు శిరము నరికి
ప్రజల శక్తి చాటుదాం
శత్రు బలగ మెంతరా
దాని తాహతెంతరా
అంతగలిసినా తంతె దాని_
అంతుతేల్చవచ్చురా
తెగిన మొండె మూసినా
పడిన శిరసు గాంచినా
అదురు బెదురు లేక వేగ
ఎదురు తిరిగి గెల్చుదాం
రక్తనదుల నీదుదా
శత్రువులను నరుకుదాం
మృత్యువునకు వెరవమంచు
పోరి జయము గాంచుదాం

దేశభక్తి గేయాలు
(ఆకాశవాణి సౌజన్యంతో)

'సహనం, అవగాహన అవసరం'

—ముఖ్యమంత్రి

తెలంగాణాకు చెందిన ముఖ్యమంత్రి తెలంగాణా ప్రాంతం సమస్యలను శీఘ్రంగా పరిష్కరించడానికి పూనుకోగలరని ప్రజలు ఆశించడంలో ఎంతయినా వాస్తవం వున్నదని ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావుగారు యిటీవల పాత్రికేయులకు యిచ్చిన ఇంటర్వ్యూలో తెలియజేశారు.

అయితే యీ కొత్త ఏర్పాటువల్ల ఆంధ్రప్రాంతం అభివృద్ధి విషయంలో అలక్ష్యం చూపడం జరుగుతుందన్న ఏవిధమైన ఆలోచనకూ తావులేదనికూడా ఆయన తెలియజేశారు. "నిజానికి అలాటి భావం నాకెక్కడా కనిపించనే లేదు" అన్నారాయన.

రాష్ట్రీ పారిశ్రామికీకరణలో ముఖ్యమంత్రి ఆశాభావాన్ని వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పారిశ్రామిక వాతావరణం దినదిన ప్రవర్ధమానమౌతున్నదని చెప్పారు.

ప్రశ్న : మీరు ముఖ్యమంత్రిగా పదవిని చేపట్టినపుడు తెలంగాణా సమస్యల పరిష్కారానికి స్పష్టమైన, వ్యక్తిగతమైన దృక్పథం అవలంబిస్తానని చెప్పారు. మీరు యీ పదవిని చేపట్టి నాలుగు నెలలు కావస్తోంది కదా. యీ సమస్యలకు ఒక కొత్త పరిష్కార మార్గాన్ని కనుగొన్నానని చెప్పగలరా ?

ముఖ్యమంత్రి : తెలంగాణా సమస్యల పరిష్కారానికి నేను అనుసరించే మార్గం—తెలుగు ప్రజల సమిష్టి వారసత్వంలో ఒక భాగం. వారి భాష, చరిత్ర, భౌగోళిక పరిస్థితులు ఒక్కటే. వారు అభివృద్ధి చెందాలంటే ఒక్కటిగానే వుండాలి కూడా. ఈ విషయాన్ని నేడు మళ్ళీ గట్టిగా నొక్కి చెప్తున్నాను. ఏవో తాత్కాలికమైన లోపాలవల్ల మూడు వేల సంవత్సరాలుగా పెనవేసుకున్న బాంధవ్యాలను తెగతెంపులు చేసుకోలేము అటువంటి లోపాలు సంభవించినప్పుడు వాటిని తొలగించుకుని, సహనం, అవగాహన, అన్నదమ్ముల మన్న ఐక్యతా వాతావరణం —వీటిని నెలకొల్పడానికి మరో కొత్తపద్ధతి ఆలోచించాలి. ఇప్పుడు నేను చేస్తున్నదీ అదే. ఈ విషయంలో కొంత వరకు విజయం సాధించాననే చెప్పగలను.


ప్రశ్న : తెలంగాణా సమస్య అనేక అంశాలకు సంబంధించిన సమస్య. అయితే వీటిలో అసలు ముఖ్యాంశం ఏమిటి ? ఇది ప్రధానంగా ఆర్థిక, విషయాలమీద ఆధారపడ్డ సమస్యా? లేక ఆర్థిక రాజకీయాలు రెండూ కలగలిపిన సమస్యా?

ముఖ్యమంత్రి: తెలంగాణా 'సమస్య' అనిమనం దేన్ని అంటున్నామో అది ప్రధానంగా ఆర్థికమైన వెనుకబడిన తనానికి సంబంధించిన సమస్య. ఈ విషయాన్ని లోగడ నేను చాలాసార్లు చెప్పాను కూడా. ఈ ప్రాంతంలో వనరులు తగినంతగా లేవు. అందువ యిది శీఘ్రంగా అభివృద్ధి చెందలేక పోయింది. ఈ ఆర్థిక సమస్యకు రాజకీయమైన సమస్యలు జతపడి వున్నాయనుకోండి. నిజానికి ఏ ఆర్థిక సమస్యా కూడా రాజకీయాలకు అతీతంగా వుండదు. ఈ రెండూ విడదీయలేనంతగా పెనవేసుకుని వుంటాయి ఈ తెలంగాణా సమస్య కూడా అలాటిదే.

ప్రశ్న : మీ సారథ్యంలో యిటు తెలంగాణా అభివృద్ధిచెంది, అటు విశాల ఆంధ్ర ప్రదేశ్ ఏర్పడినప్పటినుంచీ శ్రద్ధ చూపించబడుతున్న ఆంధ్రప్రాంతం తగినంతగా శ్రద్ధ చూపించబడదేమోనన్న భావం రాష్ట్రం అంతటా బలపడుతున్నట్టు తోస్తుంది. దీనికేమన్నా ఆధారముందా ?

ముఖ్యమంత్రి: ఏ ఆధారమూ లేదు. పైపెచ్చు తెలంగాణా సత్వరాభివృద్ధి మొత్తం రాష్ట్రంలోనే అభివృద్ధి త్వరితగతిని సాధించడానికి తోడ్పడుతుంది. ఆంధ్ర ప్రాంతంలో అభివృద్ధి విషయంలో తగినంతగా ఆసక్తి కనబరచరనే భయానికి తావేలేదు. నిజానికి ఈ రెండు ప్రాంతాల్లో కూడా యీసమస్యను బాగా అవగాహన చేసుకున్నారని. ప్రభుత్వానికి తగిన అవకాశాన్నివ్వడానికి ప్రజలు సిద్ధంగా వున్నారని నా అంచనా. ఎవరైనా అసంతృప్తి చెందుతున్నట్టుగా ఎక్కడాకనిపించనే లేదు.

(ఇండియన్ హెరాల్ సౌజన్యంతో) ★



2

మాల్యవంతం తూర్పుకనుమలలో ఒక భాగం. అది అత్యున్నతంగా వుంటుంది. దానిసానువులలో చెట్లు దట్టంగా పెరిగి వుంటాయి. ఆ పర్వతాన్నానుకొని భయంకరమైన అరణ్యముంది. ఆ అరణ్యం మధ్యలో గోదావరీనది ప్రవహిస్తున్నది. ఆదృశ్యం చూడడానికి చాల అందంగా వున్నది.

మాల్యవంతంలో కొంత దిగువన ఒక పెద్ద గుండువున్నది. అది ఒక ఛత్రంలాగా వున్నది. దానిక్రింద సుమారు ఒక వంద మంది సులభంగా కూర్చోవచ్చు. దానిప్రక్కనే చెట్లుదట్టంగా పెరిగి వుండడం వల్ల ఆగుండు బయటికి కనబడదు. ఆనాడుగుండు క్రింద చాల మంది కూర్చొని చర్చించు కొంటున్నారు. వారిలో ముగ్గురు ముసలివారు, తక్కినవారు యువకులు.

"చక్రవర్తి ఏమయ్యాడో తెలియడంలేదు. ఏ వార్తను నమ్మాలో, ఏ వార్తను నమ్మకూడదో అర్థం కావడంలేదు," అన్నాడు అన్నమంత్రి.

అన్నమంత్రి రుద్రమదేవి కాలంలోను, ప్రతాప రుద్రుని కాలంలోను గజసాహిణిగా వుండినవాడు. అతడు యౌవనంలో వున్నప్పుడెన్నో యుద్ధాలలో గెలిచాడు. ఓరుగల్లుపై జరిగిన కడపటి దాడిలోకూడా చాల గట్టిగా పోరాడాడు. వృద్ధుడైనప్పటికీ అతణ్ణెదిరించడానికి మొగలు సేనానులెంతో భయపడ్డారు. ప్రతాప రుద్రదేవుడే పట్టుబడకుండావుంటే అన్న మంత్రి వెనుదీసేవాడు గాడు. చక్రవర్తి పట్టు బడ్డాడని వింటూనే అతడు సొమ్మసిలి క్రింది కొరిగి పోయాడు. తెప్పరిల్లే సరికి ఓరుగల్లు తురుష్కుల చేతుల్లోవుంది. విశ్వాసపాత్రులైన భటులతణ్ణి తీసుకొని వెళ్లి ప్రమాద రహిత స్థానంలో వుంచారు. అందువల్ల అతడు బ్రతుక గలిగాడు.

ఓరుగల్లు మహమ్మదీయుల వశమవుతూనే దాని పేరును సుల్తానా పూరుగా మార్చి వేశారు. దానికి ఒక మహమ్మదీయుణ్ణి సుబేదారుగా నియమించారు. ప్రతాప రుద్రుణ్ణి బందీగా తీసుకొని వెళ్లి పోయారు. తరువాత చక్రవర్తి ఏమయిందీ ఎవరికి తెలియ లేదు. తుగ్లక్ అతణ్ణి ఢిల్లీకి తీసుకొని వెళ్లాడని అచ్చటతణ్ణి సంహరించాడని కొందరంటారు. అతణ్ణి మహమ్మదీయ మతంలో చేర్చి వేశారని మరి కొందరంటారు. ఢిల్లీకి వెళ్లే త్రోవలో అతడు తప్పించు కొన్నాడని ఇక కొందరంటారు. అవమానాన్ని భరించలేక నర్మదానదిలోబడి మరణించాడని తక్కిన వారంటారు. ఈ విధంగా ప్రతాప రుద్రుని ఉనికిని గూర్చి తలకొక రీతిగా చెబుతున్నారు. అందువల్ల ప్రజలు మాత్రం ఆ చక్రవర్తి ఢిల్లీ సుల్తాను హస్తాల నుండి తప్పించుకొని ఎచ్చటో దాగి వున్నాడని సమయ మరుదెంచినప్పుడు బయటబడి సుల్తాను నెదిరించి తీరుతాడని అను కొంటున్నారు. వారా కాకతీయ ప్రభువును మరువ లేకున్నారు. ప్రతాప రుద్రు డొక మహా వీరుడేగాక జనరంజకుడైన చక్రవర్తి గనుక, మహాపండితుడు గనుక, ప్రాభవవైభవాలతో కూడి వుండిగూడ ప్రజల కందు బాటులో వుండేవాడు గనుక వారతడు మరణించాడన్న విషయాన్నే విశ్వసించ లేకున్నారు. చక్రవర్తి మరణించాడని ఎవరైనా అన్నప్పుడు వారిపై కోపించి ఆలాటి మాటలు చెప్పవద్దని వారిని గదురు కొన్నారు. ఆ ప్రభువు మీద ప్రజలకున్న ప్రేమ ఆలాటిది.



" ఏమనడానికి వీలులేకున్నది. ఇదమిత్థమని చెప్పడానికి తగిన ఆధారం లేకున్నది " అన్నాడు కొలని రుద్రదేవుడు.

రుద్రదేవుడుగూడ వృద్ధుడే. ప్రతాప రుద్రుని కాలంలో అతడు డెబ్బది రెండు దుర్గాలకు అధిపత్యం వహించాడు. చక్రవర్తి కాంచీపురం మీదికి దండెత్తినప్పుడు రుద్రదేవుడుగూడ అతనితో వెళ్ళి పంచ పాండ్యులను ఓడించి వున్నాడు. ప్రతాపంలో అతనికెనయైన వారాదినాలలో యెవ్వరూ లేరు. ఈనాడుగూడ అతని పౌరుషం ఏ మాత్రం తగ్గలేదు. ప్రతాప రుద్రుడు లేనప్పటికీ, ఒకవేళ అతడు మరణించి వున్నప్పటికీ ఢిల్లీ సుల్తానుకు లోబడకుండా వుండాలని అతనికి వ్యతిరేకంగా పోరాడి ఓరుగల్లును గెలుచుకోవాలని అతనికుంది.

అందుకనే అతడు, చక్రవర్తి ఏమయితేనేమి ? ప్రతిఘటన కొనసాగవలసిందే అన్నాడు.

" అది సాధ్యమయ్యే పనేనా ? " అన్నాడచ్చట వారిలో నున్న ఒక నాయకుడు.

అన్నమంత్రి ఆ నాయకునివైపు చూచాడు. అతడు యువకుడు. అన్నమంత్రి చిరునవ్వు నవ్వాడు. ముడతలు బడిన అతని ముఖానికా చిరునవ్వు కొంత అందాన్నిచ్చింది.

" యువకులే అది సాధ్యమేనా అంటే మాబోటి ముసలు లేమనాలి ? " అన్నాడు, అన్నమంత్రి "మేమందరం సంసిద్ధంగానే వున్నాము," పెదకోమటి వేమారెడ్డి అన్నాడు.

వేమారెడ్డి యువకుడు. అద్దంకి పరిపాలకుడు. ధైర్య సాహసాలు గలవాడు.

" అలావుండాలి బిడ్డలంటే, వేమారెడ్డి మాటలు వింటుంటే ఆంధ్రజాతి పౌరుషం నశించ లేదనిపిస్తున్నది " అన్నాడు సింగమ నాయకుడు.

సింగమ నాయకుడు గూడ వృద్ధుడే. అచ్చట చేరి వున్న సుమారు డెబ్బై ఎనభై మందిలోకి అన్నమంత్రి, రుద్రదేవుడు, సింగమనాయకుడు వీరు ముగ్గురే వృద్ధులు. తక్కిన వారందరు యువకులు. వారు కోడెప్రాయంలో, చురకత్తులలాగా వున్నారు.

ఆ యువకులలో ప్రోలయ నాయకుడు, కాపయ నాయకుడు, గణపతినాయకుడు, వేమారెడ్డి మొదలగువారు ముఖ్యులు, వారితో పాటు కొప్పుల నాయకుడు, రాజమండ్రి, మొదలయిన తీరాంధ్ర ప్రాంతాల నాయకులు వున్నారు.

" రుద్రదేవుడన్నట్లు ప్రతిఘటన సాగవలసిందే. కాని దానికొక నిర్దిష్ట కార్యక్రమముండాలి." అన్నాడు అన్నమంత్రి.

" ఆ కార్యక్రమాన్ని రూపొందించవలసిన వారు మీరే గదా ? " ప్రోలయ నాయకుడన్నాడు.

యువకుడైన ప్రోలయ నాయకుడు మేటి శూరుడు, యుద్ధాలలో కాకలు తీరిన యోధుడు. ఓరుగల్లుమీద జరిగిన మొదటి నాలుగైదు దాడులను త్రిప్పి కొట్టడంలో ఎంతో విక్రమంతో పోరాడిన ధైర్యశాలి. అతడు ముసునూరి కుటుంబానికి చెందినవాడు.

ముసునూరి కుటుంబం సముద్ర తీర ప్రాంతంలో చాల ప్రఖ్యాతి గాంచిన కుటుంబం. వారికి కోరుకొండ, రాజమండ్రి, కొలను అమరావతి, చేబ్రోలు, కంపిల, గంగినేనికొండ, మాలకొండ, కొప్పుల, అరవీడు పరిపాలకులతో బాంధవ్యాలున్నవి. అందువల్ల వారికి ప్రాంతాలలో మంచి పలుకుబడి వుంది. అంత పలుకుబడి గలిగిన కుటుంబం తీర ప్రాంతంలో మరొకటి లేదు.

ప్రోలయ నాయకుడు వేంగి విషయ నివాసియైన పోచినాయకుని కుమారుడు. అతన్ని పోలనీడు అనికూడ అంటారు. ఇతనికి, దేవ, కామ, రాజ నాయకులని ముగ్గురు పిన తండ్రులున్నారు. ఎరపోతనాయకుడని ఒక సోదరుడున్నాడు. ఇతని పిన తండ్రి అయిన దేవనాయకునికి కాపనాయకుడు, ముక్కంతి నాయకుడు అని యిద్దరు కుమారులు, కామనాయకునికి దేవనాయకుడు కుమారుడు. రాజనాయకునికి అనపోత నాయకుడు కుమారుడు. ముసునూరి వంశానికి సంబంధించిన యువకులందరు ఆనాడు మాల్యవంతంలో జరుగుతున్న సమావేశంలోనే వున్నారు. ఢిల్లీ సుల్తాను మీద ఏలాగైనా పగతీర్చుకొని మరలా ఓరుగల్లును శత్రుహస్తాల నుండి విడిపించాలని ఉబలాట పడుతున్నారు. వారిలో కాపయ్య నాయకుడు మరింత ఆదుర్దా పడుతున్నాడు.

ప్రోలయ నాయకునికి కాపయ్య కుడిభుజంలాంటి వాడు. అందులో ఒకరు అనలమైతే మరొకరు అనిలం. ఒకరు భీముడైతే మరొకరు అర్జునుడు. వారు విడదీయరాని కవలల వంటివారు. యోధాను యోధులు.

ప్రోలయ మాటలు విన్నాడు అన్నమంత్రి. " ఆ కాలందాటి పోయింది. ఇక కార్యక్రమాన్ని రూపొందించ వలసింది. దానిని నిర్వహించ వలసింది మాబోటి యువనాయకులే, మేము మీకు సలహాలు మాత్రమే యివ్వగలం. " అన్నాడు అన్న మంత్రి.

" చక్కగా చెప్పారు అన్నమంత్రిగారూ. " అన్నాడు కొలని రుద్రదేవుడు.

" ఇప్పుడు మీరందరూ ఒక అధ్యక్షుణ్ణి ఎన్నుకోవాలి. ఆ యధ్యక్షుని నాయకత్వం క్రింద నడవాలి, " అన్నాడు అన్న మంత్రి.

అదే మంచిదన్నాడు సింగమ నాయకుడు. సింగమ నాయకుడంటే అందరికీ ఎనలేని గౌరవమున్నది. అతడు రేచర్ల కుటుంబానికి చెందిన వాడు. ఆ కుటుంబానికి మూల పురుషుడైన రేచర్ల మంత్రుడు గణపతి దేవుణ్ణి దేవగిరి రాజుల కారాగారం నుండి విముక్తి నొందించి అతని జీవిత మంతా ఆ చక్రవర్తికి బాసటగా ఉండినవాడు. అనాటినుండి ఈ నాటివరకు రేచర్ల వారు కాకతీయుల యెడ విధేయులై వున్నారు. అందువల్ల వారి కంత గౌరవం గలిగింది. కనుకనే ' అదేమంచిదని ' అతడన్నప్పుడు అచ్చట చేరిన నాయకులెవ్వరూ కాదన లేక పోయారు.

అధ్యక్షుణ్ణి ఎన్నుకోవాలి అన్న విషయం నిర్ణయమైన తరువాత ఎవరిని ఎన్నుకోవాలి అనే సమస్య ఉత్పన్నమయింది.

అన్నమంత్రినే అధ్యక్షుడుగా ఉండమన్నారు కొందరు. కాని అందు కతడంగీకరించలేదు. కొందరు కొలని రుద్రదేవుని పేరును సూచించారు. అతడుగూడ అందుకంగీకరించలేదు. అడవులబట్టిపోయిన ప్రతాపరుద్ర చక్రవర్తి సోదరులైన అమ్మన దేవుణ్ణి మరికొందరు సూచించారు. అన్నమంత్రి అందు కంగీకరించ లేదు.

"అమ్మనదేవుడెచ్చటున్నాడో ఎవరికీ తెలియదు. పైగా అతడున్నా అకడీ పనికి చాలడు" అన్నాడు అన్నమంత్రి.

"అయితే మరెవరిని చేదాము ?" ప్రశ్నించాడు. ప్రోలయ నాయకుడు.

"నిన్నే చేదాము. ఈ పరిస్థితుల్లో నీవే తగిన నాయకుడవు." అన్నాడు అన్నమంత్రి.

"చక్కగా చెప్పావన్నాడు" రేచర్ల సంగమ నాయకుడు. యువనాయకులందరూ అదేమంచిదన్నారు. ప్రోలయనాయకుడెంత వద్దన్నా వారు వినలేదు. అందరూ అతని నాయకత్వాన్నంగీకరించ డానికి సిద్ధపడ్డారు.

అప్పుడన్న మంత్రి ప్రోలయ నాయకుణ్ణి ఆంధ్ర భూమండలాధ్యక్షుడుగా ప్రకటించాడు. ఆ ప్రకటన అందరినీ ఆనందంలో ముంచివేసింది.

అధ్యక్షుణ్ణి నిర్ణయించిన తరువాత అవలంభించవలసిన కార్యక్రమాన్నిగూర్చి చర్చలు జరిగాయి. ప్రతివారు తమకు తోచిన సలహాలు చెప్పారు. ఆ సలహాలనన్నిటినీ విని కాపయ్య నాయకుడు అన్నాడు—

"వెంటనే సామ్రాజ్యమంతటినీ ఆక్రమించడం సులభ సాధ్యమైన విషయంగాదు. ఢిల్లీ సుల్తాను ఓరుగల్లులో, దేవగిరిలో, ద్వారసముద్రంలో, కంపలిలో తన సైన్యాలను వుంచి వున్నాడు. అందువల్ల ఆ ప్రాంతాలనన్నిటినీ పట్టుకోవడం చాలా కష్టం. మనవద్ద ఆ సైన్యాన్ని ఎదిరించగలిగిన సత్తా లేదు. కనుక మహమ్మదీయ సైన్యాలు లేని తీర ప్రాంతాన్నే ముందు మనం కబళించాలి. అదిగూడ మంచి అదనుచూచి ప్రతిఘటించాలి."

ఆ మాటల్ని వింటూనే త్రిపురారిదేవుడందుకొన్నాడు.

"ఔనౌను. కాపయ్య చెప్పింది నిజమే. ఇచ్చట చేరిన నాయకులు కూడ తీరఆంధ్రానికి చెందినవారే. అంతేగాని ఓరుగల్లు ప్రాంతానికిగాని, తుంగభద్ర ప్రాంతానికిగాని చెందిన వారెవ్వరూ లేరు. కనుక మనం ఇచ్చటనున్న మన బలాన్ని కూడగట్టుకొని సుల్తానుమీద మొదటి దెబ్బ తీయాలి. మన కార్యక్రమాలకు ఈ మాల్యవంతాన్నే కేంద్రంగా వుంచుకోవాలి."

కాపయ్య, త్రిపురారి చెప్పిన మాటలు అందరికీ నచ్చినవి. కాపయ్య రాజకీయ ప్రతిభకు, త్రిపురారి తెలివికి అందరూ మెచ్చుకొన్నారు.

"కనుక మనం ఈ ప్రాంతం నుండే విజృంభించాలి. అప్పుడే ఒక చిన్న నగరాన్ని నిర్మించుకుంటే అది దుర్భేద్యంగా వుంటుంది. ఒకవైపున అరణ్యం, ఒకవైపున గోదావరి, మరొక వైపున మాల్యవంతం. ఇంతకంటె అనుకూలమైన ప్రదేశం మరొకటుండదు. పైగా ఇది ఓరుగల్లుకు దక్కిన ప్రదేశాలకంటే కొంత దగ్గరగాగూడ వుంటుంది. ఇతర ప్రాంతాన్ని ఆక్రమించిన తరువాత దీనిని పదిలంగా ఎంచుకొని ఆ మీద ఓరుగల్లు మీద పడవచ్చు" అన్నాడు అన్నమంత్రి.

"తుంగభద్రానదీ ప్రాంతంలో నున్న వారిని కూడ కలుపుకొంటే మంచిదేమో" అన్నాడు వేమారెడ్డి.

"అదికూడ అవసరమే. తరువాత ఆవిషయాన్ని పరిశీలిద్దాము." అని అన్నాడు అన్నమంత్రి.

ఆ తరువాత తీరాంధ్ర ఆక్రమణకు చేయవలసిన వ్యూహ రచనను గూర్చి కొంతసేపు చర్చ జరిగింది. వివరాలన్ని ప్రోలయ నాయకుడే రూపొందించాలని, అన్న మంత్రితోను, రుద్రదేవునితోను, సింగమ నాయకునితోను, అప్పుడప్పుడు సలహా తీసుండాలని. తీయబడిన నిర్ణయాలనెప్పటికప్పుడు నాయకుల కందరికీ తెలియ జేస్తూండాలని నిర్ణయించ బడింది. రేకపల్లె వద్ద నగర నిర్మాణం గావించబడాలని, దానికి ప్రతినాయకుడూ ఆర్థికంగా సాయం గావించాలని తీర్మానించబడింది. తీరాంధ్రలో వున్న యువకులలో దాదాపు నూటికి డెబ్బై మందినైనా తమకు సాయం తీసుకొనడానికి, వారిలో వీలైనంత మందిని సైనికులుగా చేర్చుకొనడానికి అంగీకరించబడింది.

ఆనాడు జరిగిన చర్చలు, చేయబడిన తీర్మానాలు అచ్చట చేరిన వారికందరికీ ఒక విధమైన ఆనందాన్ని, నూతనో త్తేజాన్ని, ఏమాత్ర బలాన్ని చేకూర్చాయి. అందరికంటె హెచ్చుగా అవి అన్న మంత్రి కెంతో సంతృప్తిని కలిగించాయి. అతని కోరికకు రూపకల్పన జరుగుతున్నందుకతని కెంతో ఆనందం కలిగింది.

(సశేషం)

దేశరక్షణ మన ప్రథమ కర్తవ్యం

నగర వార్తా చిత్రాలు




బంగ్లాదేశ్‌కు మద్దతుగా డిసెంబరు 12 న యాకుత్ పురాలో జరిగిన బహిరంగ సభలో ముఖ్యమంత్రి ప్రసంగించారు





బంగాదేశ్‌కు మద్దతుగా సికింద్రాబాదులో డిసెంబరు 19 న అన్ని పక్షాలతో కూడిన ఊరేగింపుకు ముఖ్యమంత్రి అధ్వర్యం వహించారు.



బంగ్లాదేశ్‌కు మద్దతును తెలియజేస్తూ డిసెంబరు 18 న అన్నిపార్టీలవారూ కలిసి చార్మినార్ నుంచి సుల్తాన్‌బజార్ వరకు బ్రహ్మాండమైన ఊరేగింపు ఏర్పాటు చేశారు. ఈ ఊరేగింపుకు ముఖ్యమంత్రి నాయకత్వం వహించారు.







మధ్య : ఉపముఖ్యమంత్రి డిసెంబరు 9న ప్రాథమిక భూమి తనఖా బ్యాంకుల ప్రతినిధుల 10వ వార్షిక సమావేశంలో ప్రసంగిస్తున్న దృశ్యం.


క్రింద : వైస్ అడ్మిరల్ ఆర్. డి. కటారి (రిటైర్డ్) డిసెంబరు 1న రాష్ట్ర సమాచార కేంద్రంలో సరిహద్దు పరిస్థితిపై ప్రసంగిస్తున్నప్పటి చిత్రం.

కుడివైపు పైన : ముఖ్యమంత్రి జనవరి 1న అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శనకు జ్యోతిని వెలిగించి ప్రారంభోత్సవం చేస్తున్న చిత్రం

క్రింద : మాజీ ముఖ్యమంత్రి శ్రీ కాసు బ్రహ్మానందరెడ్డి జనవరి 3న ఆంధ్రప్రదేశ్ సచివాలయ సాంస్కృతిక సంఘక రజితోత్సవాలకు ప్రారంభోత్సవం జరుపుతున్న దృశ్యం







శ్రీ కె. అచ్యుతరెడ్డి


★

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ రెవిన్యూ శాఖామంత్రి శ్రీ కె. అచ్యుతరెడ్డిగారు జనవరి 23 వ తేదీ రాత్రి 10 గం. లకు స్వర్గస్థు లయ్యారు.

శ్రీ కె. అచ్యుతరెడ్డి 1914 జూన్ 20వ తేదీన మహబూబునగర్ జిల్లా, నాగర్ కర్నూలులో జన్మించారు. వీరు న్యాయశాస్త్రపట్టభద్రులు. మహబూబునగర్‌లో ప్రాథమిక విద్య పూర్తి చేశారు. వీరు తమ బాల్యంనుండి రాజకీయాలలో ఉత్సాహం చూపేవారు. 1936లో వీరు ఉస్మానియా విశ్వవిద్యాలయం నుండి పట్టభద్రులైనారు. 1938లో న్యాయశాస్త్రం చదివారు. ఈ సమయంలోనే రాష్ట్ర కాంగ్రెస్‌లో చేరారు. వందేమాతరం ఉద్యమం కార్యాచరణ మండలి అధ్యక్షునిగా వ్యవహరించారు. తత్ఫలితంగా నిర్బంధంగా చదువుకు స్వస్తిచెప్పి నాగపూర్ వెళ్ళారు. 1928లో జోగిపేటలో జరిగిన ఆంధ్రమహాసభలో కార్యకర్తగా పని చేశారు. కీ. శే. సురవరం ప్రతాపరెడ్డి యీ సభకు అధ్యక్షత వహించారు. అప్పటినుండి రాష్ట్ర కాంగ్రెసు ఏర్పడేవరకు ఆంధ్ర మహాసభ ప్రతినిధిగా వ్యవహరించారు.


శ్రీ అచ్యుతరెడ్డి 1912 ఉద్యమంలో పాల్గొని జైలుశిక్ష అనుభవించారు. 1947 లో కూడా తిరిగి అరెస్టుచేయబడి 1948 సెప్టెంబరులో పోలీసుచర్య అనంతరం మాత్రమే విడుదల అయ్యారు. 1941 నుండి సహకార ఉద్యమంతో సన్నిహిత సంబంధం ఉంది. 1956 నుండి 1962 వరకు ఎనిమిది సంవత్సరాలపాటు సహకార అపెక్స్‌బ్యాంకు అధ్యక్షుడుగా వ్యవహరించారు. అనేక సహకార సంస్థలకు డైరెక్టరుగా ఉన్నారు. కేంద్ర సహకార కేంద్రం ఉపాధ్యక్షుడుగా పనిచేశారు. వీరికృషివల్లనే అనేక సహకార సంస్థలు వెలిశాయి.

1957 నుండి 1962 వరకు తెలంగాణా ప్రాంతీయ సంఘం ప్రప్రథమ అధ్యక్షులుగా వ్యవహరించారు. 1952 నుండి 1962 వరకు తిరిగి 1967 నుండి శాసనసభ్యులుగా ఉంటున్నారు. వీరు ఎ.ఐ.సి.సి సభ్యులు. హిందీ భాషాప్రియులు. ఒకటిన్నర దశాబ్దంపాటు హిందీ ప్రచార సభ అధ్యక్షులుగా ఉన్నారు. వీరు సూటిగా మాట్లాడే తత్వంగలవారు. ప్రజల మన్నన, ఆదరాభిమానాలు పొందిన తెలంగాణా నాయకులలో వీరు ఒకరు. నిరాడంబరులు.



రాష్ట్ర రెవిన్యూ మంత్రి శ్రీ కె. అచ్యుతరెడ్డి జనవరి 23 వ తేదీన హైదరాబాదులో స్వర్గస్థులయ్యారు శ్రీ అచ్యుతరెడ్డిగారి భౌతికకాయాన్ని శ్మశాన వాటికకు ఊరేగింపుగా తీసుకొని వెళ్తున్న దృశ్యం ఈ చిత్రంలో చూడవచ్చు.

హైదరాబాదు విముక్తి పోరాటంలో ప్రముఖపాత్ర వహించిన స్వామీ రామానంద తీర్థ జనవరి 22 వ తేదీన హైదరాబాదులో కన్ను మూశారు. వారి అంతిమయాత్ర దృశ్యం



ఆచార్యసత్తముడు

—తిరుమల రామచంద్ర

పదేండ్ల నాటి మాట. తెలుగునాడు ప్రముఖులను ఆంధ్రప్రభ సచిత్ర వార పత్రిక పాఠకులకు పరిచయం చేయడానికి నియుక్తులమయిన నేను, నా మిత్రుడు, సహపత్రికా రచయిత శ్రీ నీలంరాజు మురళీధర్ తిరుపతి చేరాము ......ఆయన గృహంలో అడుగుపెట్టాము. విద్యార్థుల మధ్య ఆసీనులై వున్నారు. అప్పుడాయన శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షులు. నామిత్రుడు శ్రీ మురళీధర్ మెడలో కెమేరా వేలాడుతున్నది.



నేను ఆయనకు చిరపరిచితుడను. ఆంధ్రవిశ్వ విద్యాలయం ప్రచురించిన ద్విపద భారతం లిఖిత ప్రతిని తంజావూరు సరస్వతీ మహల్ పుస్తక భాండాగారం నుంచి నకలు చేసి, ముద్రణకు సిద్ధపరచిన తొలియిద్దరిలో నేనొక్కడిని. రెండవవాడు మిత్రుడు శ్రీ కొమ్మనమంచి జోగయ్య శర్మ. పింగళివారే సంపాదకుడుగావున్న రంగనాథ రామాయణ ప్రచురణలో కూడ శ్రీ గన్నవరపు సుబ్బరామయ్య గారితో పాటు శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రి గారికి వశంవదుడ్నిగానున్నవాడిని. నా అప్పటి పనీ ఆయనకు తెలుసు. మేమిద్దరం నమస్కారం అనగానే తిరిగి చూచి మందహాసంతో కుశల ప్రశ్న చేశారు. మేము మా ఆగమన కారణం తెలిపాము. ఒక్కసారిగా ముఖం మీది మందహాసం మాయమయింది. ఆకృతి గంభీరమయింది.

"ఊహూఁ! నాకు మీ ప్రచారం అక్కరలేదు. నాపనేదో నేను చేస్తున్నాను. పత్రికలలో గొప్పలు నాకు వద్దు" అన్నారు.

"మీకు కాదండీ గొప్ప. మాకు. మాపత్రిక కండీ. తామర తంపరగా శిష్య సంతతి ఉన్న మీ విద్యా కుటుంబం అందరికీ—తెలుగు సీమలోని వారందరికీ—తెలియాలని మా పత్రిక ఆశిస్తున్నది. దేశంలోని వివిధ రంగాలలోని ప్రముఖులను పరిచయం చేయదలచింది. మా పత్రిక విజ్ఞప్తిని మీరు మన్ననచేయాలి" అన్నాము.

ఆయన ససేమిరా ఒప్పుకోలేదు మేము నిరాశతో వెనుదిరిగి పోవలసి వచ్చింది. అంత సరళోపసర్పణీయమైన ఆయన మూర్తి అంత త్వరలో, త్వటిలో గంభీరా దృశ్యం కావడం ఏమిటా—అని విస్తుపోయాము ... ఔను! ఎందుకుకాదు? ఆయనకు ఈషణత్రయాన్ని కూడా మించిన చతుర్థేషణ—కీర్తీషణ—లేదు కీర్తీషణ ఉన్నవాడు కదా ప్రచారప్రాగల్భ్యాలకు లంగలార్చుతాడు నేలను నింగిని ఏకం చేస్తాడు! ఆయనకు అవి అవసరం లేదు. సచ్ఛిష్యులే సంచార ప్రచార సాధనాలు. ఆయన షడ్దర్శనాల ఆచార్యుడు. నిజమైన ఉపాధ్యాయుడు...అనుకుంటూ తిరిగి వచ్చాము. నేనూ, శ్రీ మురళీధర్.

చప్పున జ్ఞాపకం వచ్చింది ఆయన చన కవితను గురించి—

"నికరమ్మై అకలంకమైన సరకుల్
నిర్దుష్టముల్ నీ పరీ
క్షకు తాళంగల మేటి క్రొందినుసు మీ
కనప్పు మోసంపు వ
ర్తకుడన్‌గాను కులక్రమాగతము బే
రందిద్దీ భాషాకుమా
రకులారా కొనబిరండు భవ్యకవితా
రంభ ప్రియం భావుకుల్"

అని అర్ధశతాబ్ది కిందే అన్నపద్యం! ఈ ప్రచార పరాఙ్ముఖత్వం ఆయనకు అనాటినుంచే ఉంది. కొంచెం మనసు కుదుటపరుచుకున్నాము.

ఔను! ఆయన పింగళి సూరన్న వంశ-వాడనని చెప్పుకొనే వారు గదా. సూరన్నకున్న వన్నెలలో కొన్నైనా తప్పవు గదా! ఆయన డాక్టర్ పింగళి లక్ష్మీకాంతం గారు.

శ్రీ పింగళి లక్ష్మీకాంతం కృష్ణా జిల్లా చల్లపల్లి తాలూకా చిట్టూర్పు గ్రామంలో 1892 జనవరి 10 వ తేదీన జన్మించారు. ఆయన తండ్రి శ్రీ వేంకటరత్నం గారు. తల్లి శ్రీమతి కుటుంబమ్మ. మచిలీ పట్నంలోని హిందూ హైస్కూలులో చదివేటప్పుడే ఆయనకు తెలుగు భాషపై తీపి కలిగింది. దానికి కారణం కింకవీంద్ర ఘటాపంచాననేత్యాది బిరుదాంచితులైన శ్రీ చెళ్లపిళ్ల వేంకటశాస్త్రి గారు. ఆయన గురువులు. శాస్త్రిగారి శిష్యులందరూ చండప్రచండులే. శ్రీ లక్ష్మీకాంతంగారి భాషా శక్తిని శ్రీ వేంకటశాస్త్రిగారు బాగ ప్రోత్సహించారు. శుశ్రూష వల్ల ఆయనకు చక్కని శైలీ, అవధాన ప్రజ్ఞ కలిగాయి. ఈ శైలీ ప్రజ్ఞలు గుర్వనుగ్రహ మని ఆయన ఒక సందర్భంలో ఇలా చెప్పుకున్నారు.

"అంకిలి మాన్పి భాగవత
మౌ పలుకుల్ వెలయించి పద్యకం
వంకలు తీర్చి దిద్ది రస
వంతముగా నొనరించె నెప్పుడా
కింకవి రాజ మత్తగజ
కేసరి సద్గురుదాంచితుండు మా
వేంకట శాస్త్రి సద్గురు
కవి ప్రభువున్ మదినిల్పి గొల్చెదన్".

లక్ష్మీకాంతంగారు కుటుంబపు చిక్కులవల్ల, తండ్రిని కోల్పోవడం వల్ల ఎట్లో ఎస్. ఎస్. ఎల్. సి పూర్తి చేశారు. జీవిత కోసం కష్టపడవలసి వచ్చింది, విజయవాడ సబ్‌కోర్టులో కాపీయిస్టుగా కుదురారు. రెండేళ్ళు పనిసాగింది. కాపీయిస్టు అయినవాడు కోర్టులో నిలబడే వ్రాయడం అప్పటి ఆచారం. కూర్చుని వ్రాయగూడదు లక్ష్మీకాంతం గారు కూర్చుని వ్రాస్తున్నారట. సబ్ జడ్జీ ఇది చూచారట. నిలబడి వ్రాయాలని మందలించారట. ఆయన కవి—అలాటి మందలింపులకు తలఒగ్గని ప్రకృతి. మరునటి ఉదయమే నౌకరీకి తిలాంజలి యిచ్చారు.

ఈ ప్రవృత్తి ఆయనలో జీవితమంతా ఉండేది. నా మిత్రులు శ్రీ కేశవపంతుల నరసింహశాస్త్రిగారు ఒక సన్నివేశం గురించి చెప్పారు. శ్రీ లక్ష్మీకాంతంగారు ఆకాశవాణి విజయవాడ కేంద్రములో ప్రొడ్యూసర్‌గా ఉన్నప్పుడు న్యూఢిల్లీలో ఒక ప్రొడ్యూసర్ల సమావేశంలో పాల్గొనవలసి వచ్చిందట. దానికి అధ్యక్షుడు కేంద్ర ప్రభుత్వ సమాచార ప్రసార శాఖా మంత్రట. ఆయన ప్రతి ప్రొడ్యూసర్‌నూ, వేలెత్తి కదిలిస్తూ, ఇలా రమ్మన్నట్టు పిలిచాడట. లక్ష్మీకాంతంగారు మంత్రి ప్రవర్తనను తీవ్రంగా నిరసించారట. ఎదుటివాడూ పెద్దమనిషేననే భావం మంత్రికి కలిగింది. దానితో ఆ మంత్రి యీయన వద్దకేవచ్చి మాట్లాడాడట.

ఆయన విజయవాడ సబ్ కోర్టు నౌకరీకి ఇస్తీఫా ఇవ్వడం మేలయింది. లేకపోతే, ఆంధ్ర సాహిత్యం సంపన్నమయ్యేదా? నౌకరీ వదిలారేగాని, జీవిక ఎట్లా? నాటకాలలో వేషాలు వేయడం మంచిదనుకున్నారు. రాత్రి వేళము అదొక ఔత్సాహిక వృత్తి అయింది ఉదయం చదువు మచిలీపట్నంలోని నోబెల్ కళాశాలలో ఇంటర్మీడియేటులో చేరారు. నాలుగేళ్లూ కళ్ళుమూసుకొని, పళ్ళు బిగబట్టిచదివారు. పట్టభద్రులయ్యారు. ఈ నాటకాలలో వేషాలు వేయడము దాదాపు ఒకటిన్నర దశాబ్దంపాటు జరిగిందని ఆయన ఇలా చెప్పుకున్నారు—

"శ్రీ చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు తాము వ్రాసిన నాటకములను వారి శిష్యులచే ప్రదర్శింప జేసేవారు. అందువలన వారి శిష్యులలో ఒకడనైన నేను కూడా వేషంవేసి నటించే అవకాశం కలిగింది. వారు ఏ ఊరిలో శతావధానం చేస్తారో ఆ ఊరిలోనే మాచే నాటకం వేయించేవారు. శ్రీ శాస్త్రిగారు తన శిష్యులను కవిత్వంలోనే కాక నటనలో కూడా తర్ఫీదు చేశారు. చక్కగా పద్యాలు చదవడం సాహిత్య పాఠాన్ని తూచా తప్పకుండా చెప్పడానికి తోడ్పడింది... ఒక దఫా రాజమండ్రిలో నాటకానికి ధర్మరాజు వేషం వేసే శిష్యుడు రాలేకపోయాడు. అప్పుడు శ్రీ శాస్త్రిగారు ఆ వేషం నన్ను వేయమన్నారు. వేశాను. అదే నా ప్రథమ నాటకం. దానివల్ల తిక్కన భారతం పరిశ్రమ చేయడానికి దోహదం కలిగింది. నా కృషికి ప్రోత్సాహం కలిగింది. 1912 నుండి 1927 వరకు నాటకాలలో వేషాలు వేశాను ... ఆ కాలంలో వేషం వేసేవారిని ఒక విధంగా చిన్న చూపు చూసేవారు. కాని, చెళ్ళపిళ్ళ వేంకటశాస్త్రిగారు తమ శిష్యులచేత వేషాలు వేయిస్తున్నారని ఒక గౌరవం వచ్చింది. చదువుకొన్నవారు వేస్తున్నారంటే కళకు కొంత గౌరవం. మేమంతా భాషా సేవకులంగానే నాటకాలు వేశాము."

మహానటుడు శ్రీ యడవల్లి సూర్యనారాయణగారు, పింగళి లక్ష్మీకాంతంగారు తనకు పోటీదారని పరిగణించినట్టు నాటక రంగములో తలనెరసిన శ్రీ కె. వి. గోపాలస్వామి (ఆంధ్ర విశ్వవిద్యాలయం మాజీ రిజిష్ట్రారు) ఇటీవల తెలుపడాన్నిబట్టే లక్ష్మీకాంతంగారు నటుడుగా ఆనాడు ఎంత కీర్తిగడించిందీ అర్థమౌతుంది. శ్రీ గోపాలస్వామి గారన్నట్టు లక్ష్మీకాంతంగారి వంటి నటులవల్ల చెళ్ళపిళ్ళవారి నాటకాలకు ప్రాచుర్యం కలిగినదన్నా ఆశ్చర్యంలేదు.

నాటకాలకోసం గురువుల వెంట తిరగడంలో లక్ష్మీకాంతంగారికి చిన్ననాడు అవధానాలు చేసే అభిరుచీ కలిగింది. తిరుపతి వేంకటకవులు చెరియొక పాదంచెప్పి అవధానం చేస్తే, తాము చెరియొక పదం చెప్పడమేకాక ప్రాచీన నవీన కవితల్లోను అవధానం చేయగలమని చెప్పుకొన్నారు. పింగళి కాటూరివారలు వేమవరం అవధానం గురించి లక్ష్మీకాంతం గారి సన్నిహితులు చెప్పగా గుర్తున్న సంగతి వ్రాస్తున్నాను. అప్పుడు లక్ష్మీకాంతం గారిది నూగు మీసాలనూత్నయౌవనం. సభవారు తిరుపతి కవులకు ఒక సమస్యయిచ్చి పూరించమంటే, "మా శిష్యుడు పూరిస్తాడు" అంటూ లక్ష్మీకాంతం గారికి అప్పగించారు. ఆయన ఆచార్యాజ్ఞ పాలించి సెభాసనిపించు కొన్నారు. ఆ పూరిత పద్యమిది:—

"రమ్మని పిల్వనంపిన ఆ
రాతుల యందలి భీతిజేసి ప్రా
ణమ్ములు దక్కవంచు నయ
నమ్ముల బాష్పములుప్పతిల్ల శో
కమ్మున కొంప్రమం దిరికి
కానగ రాదిది వింతకాదు కో
ప్రమ్మున దాగియుంట ప్రతి
పక్షులకున్ సహజమ్ము కాదొకో!"

లక్ష్మీకాంతంగారి కవితాలతా వికాసానికి మచిలీపట్నం ప్రధానాల వాలమయింది. శ్రీ కాటూరి వెంకటేశ్వరరావు గారి సౌహార్దం ఆయన కవితకు కొత్త సౌరభం కలిగించింది. ఈ సౌరభపు గుమగుమలతో ఆయన మచిలీపట్నం నోబుల్ హైస్కూలులోను నోబుల్ కళాశాలలోను కొంతకాలం తెలుగు పండితులుగా పని చేశారు. పింగళి కాటూరి తమ గురువులలాగే జంటకవులయ్యారు. వారే ఒకానొక సందర్భంలో చెప్పికొన్నట్టు ఒకరు పద్యకుసుమాపచయం చేస్తే మరొకరు వాటిని మాలగా గ్రహించారు. ఒకరు వివిధ వర్ణాలు సిద్ధపరిస్తే, మరొకరు చిత్రాలు గీచారు. ఒకరిది భావ

వయితే మరొకరిది భాష, ఒకరిది పదబంధమైతే మరొకరిది భావబంధం. ఇలా ఓవిధం ఇద్దరినీ పెనవేసుకుంది. తొలకరిలో ఎర్పన మిచ్చి పర్వాల సౌందరనందంలో అసందాకం పండింది.

పింగళివారు మచిలీపట్నంలో ఇలా ఒక వైపు విద్యార్థులను, మరొక వైపు సహృదయులను అలరిస్తుండగా ప్రత్యేకాహ్వానంపై మదరాసు విశ్వ విద్యాలయం ప్రాచ్య పరిశోధనాలయంలో పరిశోధకులుగా చేరారు.

అప్పుడు ఆయనకు మహోపకారులు, పరిశోధకులు, తెలుగు జాతికి అపూర్వకావ్యాలు వెలికితెచ్చిన వారు, భారత జాతికి భరత నాట్య శాస్త్రాన్నీ, అపూర్వ సంస్కృత రూపకాలు, కుందమాల చతుర్భాణి వంటివాటిని అన్వేషించి యిచ్చినవారు (తర్వాత భావలింగస్థలానికి భరత కోశం సిద్ధపరచి ప్రసాదించిన వారు) అయిన శ్రీమానవల్లి రామకృష్ణ కవిగారితో పరిచయం కలిగింది. దాని మధుర ఫలమే సౌందరనందం. అశ్వఘోషుడు సంస్కృతంలో సౌందరనంద కావ్యాన్ని రచించాడు. ఆ కథనే క్షేమేంద్రుడు తన అవదాన కల్పలతలో సుందరీ నందావదానమనే పేరుతో మధుర మోహనంగా చెప్పాడు. రామకృష్ణ కవిగారు ఆ కావ్యాన్ని అనువదించవలసిందని లక్ష్మీకాంతంగారితో ఏదో ప్రసంగవశాన అన్నారు. అశ్వఘోషుని రచనను పింగళి కాటూరి కవులు అధ్యయనం చేసి కావ్యం రచించారు. అది అశ్వఘోషుని కావ్యానికి అనువాదం కాదని అనుసరణ, కథానుసరణ మాత్రమేనని శ్రీ బ్రహ్మశ్రీ శాస్త్రిగారు చెప్పగా నేనూ పరిశీలించినవారిలో ఒకణ్ణి.

దానినుండి ఒక పద్యం ఉదాహరిస్తాను:—

'రానా ఇలలో సుందు, ఓ సుందరియా
చిన్నారి ఒక పువ్వు ఏ
లాసిందిట్టే వనసి, పెండ్లాడే ప్రే
మాలోప కోర ఎదో
దూనా నాన్నుభవమ్మె లా మరిగి ఎ
ద్యాద్రైశిత్రమ్ములో, సముల్
కానన్ రాదు గదోయి, కౌముదిలో
పిమ్మటు నాయోయినో'

తరవాత ఆంధ్ర విశ్వవిద్యాలయంలో తెలుగు ఆనర్సు తరగతులు ఏర్పాటు చేసే దృష్టితో తెలుగు శాఖను విస్తరించే ఉద్దేశం కలిగింది, వైస్ ఛాన్సలర్ శ్రీ కట్టమంచి రామలింగారెడ్డిగారికి. లక్ష్మీకాంతంగారికి ఆంధ్ర విశ్వవిద్యాలయంలో స్థానం లభించింది. 1931 నుండి 47 వరకు తెలుగు శాఖలో వివిధ పదవులు నిర్వహించారు. ఆ పదిహేడు సంవత్సరాలలోను ఆయన అసంఖ్యాకంగా శిష్యులను తీర్చి దిద్దారు; విశ్వవిద్యాలయం పక్షాన ద్విపద భారతం, రంగనాథ రామాయణం మొదలయిన గ్రంథాలు పరిశీలనాత్మకంగా పీఠికలతో ప్రచురించారు.

ఆంధ్ర విశ్వ విద్యాలయాచార్య పదవి నుండి విరమించిన తర్వాత 1953 నుండి 61 వరకు ఆకాశవాణి విజయవాడ కేంద్రంలో స్పోకెన్‌వర్డ్ ప్రొడ్యూసర్‌గాను, సలహాదారుగాను పనిచేసినమీదట శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయంలో తెలుగు శాఖ అధ్యక్షులుగా పనిచేసి విరమించారు. తిరుపతిలో ఉన్నప్పుడే గౌతమ వ్యాసాలు ఆంధ్ర సాహిత్య శిల్ప సమీక్ష, కుమార వ్యాకరణం అనే సంస్కృత వ్యాకరణం రచించారు.

కేంద్ర సాహిత్య అకాడమీ సభ్యులుగా ఏడేళ్లపాటువున్న లక్ష్మీకాంతంగారిని రాష్ట్ర సాహిత్య అకాడమీ విశిష్ట సభ్యత్వంతో గౌరవించింది. కారేజీ తెలుగు పాఠ్య గ్రంథాల నిర్మాణం కోసం ప్రభుత్వం ఏర్పరచిన తెలుగు అకాడమీ ప్రత్యేక సంఘానికి అధ్యక్షులుగా పని చేశారు.

ఆకాశవాణి ప్రొడ్యూసరుగా ఆయన ఎన్నో మంచి కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఉగాది పండుగలలో అమరవాణి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిన శ్రేయస్సు ఆయనదే. ప్రభాత సమయాల భక్తిరంజని కార్యక్రమ ప్రమాణం పెరిగి రంజకంకావడానికీ ఆయనే కారకులయారు.

శ్రీ వెంకటేశ్వర విశ్వ విద్యాలయం 1970 లో ఆయనను గౌరవ డాక్టరేట్ బిరుదంతో గౌరవించింది.

లయుత సహస్ర మాసాలు పూర్తిగా జీవించి, ఈ సంవత్సరం 1972 జనవరి 10 వ తేదీన రాజధానిలోని ఉస్మానియా ఆస్పత్రిలో కన్ను మూశారు శాశ్వతంగా.

రెండు నెలల క్రితం ఆయనను కలుసుకోవడానికి రాజధానిలో దర్శించడం సంభవించింది. ఆంధ్ర వాఙ్మయ చరిత్రను రచిస్తున్నానని సూచించారు. గ్రంథమిప్పుడు వరకు వచ్చానని అన్నారు. పత్రికా రచయితలకు ఉన్న చాపల్యం కొలదీ, "ఆంధ్ర వాఙ్మయ చరిత్రలు, ఏవి చరిత్రలు అనంతంగా ఉన్నాయే. ఇటీవల మిత్రుడు ఆరుద్ర వ్రాశాడే పదమూడు సంపుటాలు" అన్నాను, కొంత జంకుతూనే. "ఔను వ్రాశారు. పూర్వపు శ్లోకం మీకు జ్ఞాపకం లేదు—సర్వత్రే పరమాణౌచ పదార్థత్వం వ్యవస్థితం— అన్నది." అన్నారు. నేను నిరుత్తరుణ్ణయ్యాను. ఔను, ఎవరి పరిశీలన వారిది. ఎవరి విమర్శ వైశారద్యం వారిది. ఎవరి సిద్ధాంతాలు వారివి. దాదాపు మూడు దశాబ్దాలు నిరంతరంగా కావ్యాలంకార భాషా శాస్త్ర పాఠాలు చెప్పిన వారి అనుభవం వేరు; చదివినది వేరు. అంతే కాదు; విషయ నివేదనపరాయణుడైన కేవల చరిత్రకారుని రచన వేరు. ప్రతిభ, దానికి వన్నె పెట్టే వ్యుత్పత్తి, దానికి అనుగుణమైన కవి హృదయ పరిశీలన దానిని పూర్తిగా రహస్యంగా వ్యక్తీకరించే కవితామయ రచన గుత్తగొన్న వారి వాఙ్మయ చరిత్రల సొంపే వేరు.

నాకు పింగళి లక్ష్మీకాంతం గారితో పోల్చదగిన ప్రాచీనుడు ఒక్కడే కనిపిస్తాడు. అతడు క్షేమేంద్రుడు. ఇద్దరికి సమానమైనవి కవిత, విమర్శనం, లౌకిక ప్రజ్ఞ, పరిపాలన ప్రాగల్భ్యం. ★

మహాభారతము

తెపెగంటుల లక్ష్మణశాస్త్రి

54

రాజా! పుణ్యాశ్రమములందు, దేవాలయములందు పూజ్య భావములేక ప్రజలు అతి క్రోధులై, ధర్మ విహీనులై, మాంస భక్షకులై, సురాపానము చేయుచు నెప్పుడు ఉందురో అప్పుడు యుగప్రళయము కలుగును. ఎప్పుడు పువ్వునుండి పువ్వు, ఫలము నుండి ఫలము పుట్టునో అప్పుడు ప్రళయము వచ్చును. అప్పుడు మేఘము అకాలములో వర్షించును. మానవులు అక్రమముగా పనులు చేయు చుందురు. శూద్రులు బ్రాహ్మణులపైన పగబట్టి యుందురు. శిష్యులు గురువులను బెదరించు చుందురు. మిత్రులు—బంధువులు స్వార్థముతోనే మెలగుదురు, సర్వప్రాణులు లేకుండ పోవును. దిక్కులు మండుచుండును. నక్షత్రములు కాంతిహీనములగును. గ్రహములు, వాయువులు ప్రతికూలములై ఆకాశమునుండి తోక చుక్కలు అతిభయంకరముగా పడును. ఏడుగురు సూర్యులొక్క సారిగా ప్రపంచమును తపింప జేసెదరు. పిడుగుల ధ్వని అధికమై దిక్కులు ప్రజ్వరిల్లును. సూర్యుడు ఉదయాస్తములందు రాహు గ్రస్తుడై యుండును. ఎల్లప్పుడు పరుషములాడుచు స్త్రీలు రోదనమునందే ప్రీతిగలవారై పతుల మాట వినరు. పుత్రులు తలిదండ్రులను చంపెదరు. పతి హననమునందు దార్యలు పుత్రులకు తోడగుదురు. అమావాస్య పర్వమునందు కాక ఇతర కాలములందు రాహువు సూర్యుని మ్రింగును. అగ్ని నలువైపుల దహించును. అన్నోదకములులేక ప్రజలు నశించెదరు. పశు పక్షి మృగాదుల ధ్వని పిడుగు ధ్వనివలె కటువుగా నుండును. అప్పుడు, మిత్రులను, బంధువులను, పరిజనులను ప్రజలు విడిచెదరు. యుగాంతమునందు ప్రజలు 'ఓ నాయనా! ఓ కొడుకా!' అని అరచుచు భూమండలమంతయు తిరిగెదరు.

రాజా! ప్రళయానంతరము తిరిగి కృతయుగము ఆరంభించును. మరల బ్రాహ్మణాది వర్ణములు పుట్టును. తమ తమ కర్మల నాచరించెదరు. అప్పుడు లోకకల్యాణముకొరకై దైవము గూడ అనుకూలించును. సూర్య చంద్రులు, బృహస్పతి, పుష్య నక్షత్రము అనుకూలమగు కర్కాటక రాశిలోనే చేరెదరు. అప్పుడు కృతయుగ మారంభించును. దేశమంతట అనుకూల వాయువులు వీచును. వానలు పడును. నక్షత్రములు బాగుగా నుండి క్షేమము—ఆరోగ్యము ఏర్పడును.

అప్పుడు భగవంతుడు 'కల్కి'గా అవతరించును. 'సంభలము' అను గ్రామములో నొక పవిత్ర బ్రాహ్మణ గృహమునందు 'విష్ణుయశుడు' అను పేరుతో మహాతేజస్వియై కల్కి యవతరించును. అతనికి తలచినంత మాత్రమున సమస్త వస్తు వాహనములు, శస్త్రాస్త్రములు పుట్టును. యోధులు కూడ పుట్టెదరు. అతడు ధర్మమును గెలిపించును. చక్రవర్తియగును. గగ్గోలుపడియున్న లోకమును శాంతపరచును. కలియుగమును నశింపజేయుటకే ఆ యవతారము వచ్చును. అతడు దుష్టశక్తులను నశింపజేసి తిరిగి ధర్మప్రతిష్ఠాపనము చేయును.

ధర్మరాజా! అప్పుడు భగవంతుడగు కల్కి ప్రపంచములోని చోరులను నశింపజేసి అశ్వమేధ యాగమును చేసి అందులో సమస్త భూమండలమును బ్రాహ్మణులకు దక్షిణగానిచ్చును. అతడు గొప్ప యశస్సును సంపాదించి బ్రహ్మ నిర్మితమగు మంచి పద్ధతులను లోకములో స్థాపించి చివరకు పుణ్యారణ్యమునకు తపశ్చర్యకై వెడలి పోవును. అట్లు కల్కి స్థాపించిన కృతయుగములో మానవులు కల్కి చూపిన మార్గములో నడచుచుందురు. అంతటను క్షేమ మేర్పడును. విప్రోత్తముడగు కల్కి శత్రువులను, చోరులను రూపుమాపుటలో తత్పరుడై సమస్త భూమండలములో పర్యటించుచుండును. ప్రచారకుడై విజితభూములను చేకూర్చిపెట్టి సత్పురుషుల స్తుతికి పాత్రుడగును. అధర్మమంతయు నశించును. సర్వజనులు క్రియాపరులగుదురు. లోకములో పుణ్యకార్యములనేకము లొనగుచుండును. సత్పురుషులు నిర్భయులై సంతుష్టి చెందెదరు. ఆశ్రమాది పుణ్యస్థలములు క్షేమముగా నుండును. ప్రజలు సత్యనిష్ఠ గలవారై యుందురు. భూమి సస్య శ్యామల మగును. మనుష్యులు దానవ్రత పరాయణులగుదురు. బ్రాహ్మణులు జపములు యజ్ఞములు చేయుచు ధర్మాచరణ తత్పరులగుదురు. రాజులు ధర్మముతో భూమిని పాలించెదరు. చాతుర్వర్ణ్యమువారు తమతమ ధర్మములను ఆచరించు చుందురు.

ధర్మరాజా! నాలుగు యుగముల ధర్మములు, ప్రళయము, యుగసంఖ్య నీకు తెలిపితిని. వాయుదేవుడు, మునీశ్వరులు నాకు చెప్పిన ప్రకారముగా నీకు భూత-భవిష్యత్-వర్తమానముల స్థితిని

జెప్పితిని. చిరంజీవి నైన నేను అనేక ప్రపంచ ప్రళయములను యుగములను కనులార చూచి నీకు చెప్పితిని. రాజా ! నీవు నీసోదరులతో నేను చెప్పబోవు మాటలను ఇంకను వినుము మీకు ధర్మ సంశయము పూర్తిగా తీరును.

రాజా ! నీ మనస్సు నెప్పుడును ధర్మమునందే నిలుపుము. ధర్మాత్ముడు ఈ లోకమునందును పరలోకమునందును సుఖము బొందును. నేను చెప్పు మంచిమాటలను వినుము. ఎప్పుడుగూడ నీవు బ్రాహ్మణులను అవమాన పరచకుము. బ్రాహ్మణుడు కోపించిన యెడల సమస్త లోకములను నశింప జేయగలడు'' అని మార్కండేయ మహాముని చెప్పిన ధర్మవచనములను విని ధర్మరాజు ''మహామునీ ! ప్రజారక్షణము చేయునప్పుడు నేను ఎట్టి ధర్మములను అవలంబవలెను ? నేను ఎట్లు నడచుకొనినచో నాకు ధర్మచ్యుతి కలుగదు ?'' అని ప్రశ్నించెను. మార్కండేయ మహాముని యిట్లు బదులు చెప్పెను :—

ప్రజాపాలకుల ధర్మములు

'రాజా! సర్వప్రాణుల యందు దయ, ప్రజలయందు అనురాగము గలిగి, అసూయ లేనివాడవై, సత్యము పలుకుచు కోమల స్వభావము కలవాడవై ఇంద్రియ నిగ్రహముతో ప్రజా రక్షణము చేయుము అధర్మమును విడిచి ధర్మము నాచరించుచు, దేవతలను, పితరులను పూజించుచు నుండుము. పొరపాటున చేసిన అధర్మమును దానము చేత పోగొట్టుకొనుము. అహంకారము లేక యెల్లప్పుడు నీవు పరాధీనుడననుకొను చుండుము. ప్రజల యిచ్ఛ తప్ప నీకు స్వేచ్ఛ ఉండ గూడదు. ఈ విధముగా మెలగుచు నీవు సర్వప్రపంచమును జయించి సుఖపడుము.

'రాజా! నీకు భూతము-భవిష్యత్తునగు ధర్మమును తెలిపితిని. నీకు తెలియనిదేమియు లేదు. కనుక నీవు మనస్సులో క్లేశము నందకుము. కాలాను సారముగా వచ్చు కష్టములకు నీ వంటి ప్రాజ్ఞులు మోహము చెందగూడదు. ఒకొక్కప్పుడిట్టి చెడ్డ కాలము దేవతలకు గూడ వచ్చును. ప్రజలందరు కాలమోహితు లగుదురు. ఇందులో సందేహము లేదు. సందేహించినచో ధర్మలోపమునకు పాల్పడెదవు. ఉత్తమ కుల వంశమున జన్మించితివి కనుక మనోవాక్కాయముల చేత నేను చెప్పిన ధర్మములు అన్నియు ఆచరింపుము.''

ఆ మహాముని మాటలచేత ప్రసన్నుడై యుధిష్ఠిరుడు ఆయన చెప్పిన మేరకు సర్వము అనుష్ఠించెదనని ఆ మునికి మాట యిచ్చెను. అక్కడి వారందరు మిక్కిలి సంతుష్టులైరని చెప్పి వైశంపాయనుడు మార్కండేయముని చెప్పిన తర్వాతి కథను జనమేజయునకు ఇట్లు చెప్పదొడంగెను :—

''రాజా! అపూర్వమైన బ్రాహ్మణ మహిమను గూర్చి యింకను చెప్పెదను వినుము. పూర్వము అయోధ్యా పట్టణము నందు ఇక్ష్వాకుకులోత్పన్నుడగు 'పరీక్షిత్తు' అనురాజు ఒకప్పుడు వేటకై వెడలెను. అశ్వముపై నెక్కి యాతడొక మృగమును తరుము కొనుచుపోయెను. ఇట్లా మృగము చేత చాల దూర మీడ్చుకొని పోవబడి యా రాజు ఆకలి దప్పులచే బాధపడుచు నొక చోట నల్లని దట్టమగు నొక చిన్న వనమును చూచెను. అందులో ప్రవేశించి అందలి రమ్య సరస్సులో అశ్వముతోనే దిగెను. నీరు త్రాగి శ్రమ తీర్చుకొని అశ్వమునకు అచటి తృణములు బిసములు (తామర తూండ్లు) ఆహారముగా నిచ్చి కొలను తీరమునందు విశ్రమించెను. అప్పుడొక మధుర గానమును వినెను. 'నిర్మానుష్య' మగు నీ ప్రదేశము నందు గీత ధ్వని యెక్కడిదని యతడాశ్చర్య పడెను.

''అతిరూప సౌందర్యవతియగు నొక కన్యక పాడుచు పువ్వులు గోయుచుండెను. ఆమెనక్కడచూచెను. 'నీవెవతె' వని యా రాజు ఆమెనడిగెను. ఆమె 'నేనుకన్య' ననెను. అతడు 'నిన్ను ప్రేమించి కోరుచున్నా' ననెను. దానికామె 'నాకు జలమును చూపగూడదు, ఆ నియమము పాటించినచో నిన్ను బెండ్లియాడెద ననెను. ఆ నియమము నంగీకరించి పరీక్షిత్తు ఆమెను పెండ్లియాడి యామెతో నానందపూర్వకముగా విహరించి అచ్చట కూర్చొనియుండగా నతని సైన్యమచటికి వచ్చెను. అప్పుడు పరీక్షిత్తు ఆకన్యతో బాటు ఒక పల్లకీలో కూర్చొని స్వనగరమునకు పోయి ఏకాంతమునందామెతో విహరించుచు కాలము గడపుచుండెను. నగరవాసులకు గాని, రాజ భవనవాసులకు గాని కనపడకుండ నతడుండెను.

''అప్పుడు ప్రధానామాత్యుడు సంగతి యేమని అంతఃపుర స్త్రీల నడిగెను. వారు అంతిపురములోకి జలము తీసికొని పోకూడదు. ఇది చిత్రముగా నున్నదనిరి, అది విని మంత్రి ఉదకము లేని యొక సుందర వనమును నిర్మింపజేసి అందొక మూలకు ఒక బావి త్రవ్వించి దానిని ముత్యముల వలతోను లతలతోను గప్పి మూసియుంచి యా సంగతి చెప్పక రాజును వనములో ప్రవేశింప జేసెను. రాజు అందులో నామెతో నిష్టసల్లాపములుసలుపుచు నొక నాడు మిక్కిలి దప్పిగొని లతలు గప్పిన మండపమును చూచెను ప్రియురాలితో నందులో ప్రవేశించి రాజు అచ్చట ఒక సుందరమగు బావిని చూచెను. ఆ యిరువురు ఆ బావిలో దిగిరి, అందులో మునిగి ఆమె మరల పైకి రాలేదు. అందే అదృశ్యమయ్యెను.

రాజు ఎంత వెదకినను ఆమె కానరాలేదు. అప్పుడా బావిలోని నీరంతయు తోడించి చూడగా నొక బిలము వద్ద నొక కప్ప యుండెను. దానిని చూచి మిక్కిలి క్రుద్ధుడై రాజు దేశములోని మండూకములన్నింటిని చంపుటకు నాజ్ఞాపించెను. తన దర్శనార్థమై వచ్చు వారందరు రాచ దర్బారులో చచ్చిన మండూకమును తనకు కానుకగా దెచ్చిన వారే తనను చూచుటకు రావలెనని ఉత్తరువు చేసెను.

ఇట్లు మండూక వధము అవి జరుగుచుండగానన్ని దిక్కులలోను కప్పలకు అతి భయము కలిగి మండూక రాజు వద్దకు పోయి మొరపెట్టుకొనెను. అంత మండూక రాజు తాపస వేషముతో రాజు కడకు పోయి యిట్లనెను. "రాజా! మండూక వధము

చేయకుము. అది ఏ యపరాధమును చేయలేదు. కోప పడకుము క్రోధముగలవాని సంపదలు నశించును. దానిని చంపుటచేత నీకు గలుగు లాభమేమి" ఆ మాటలు విని ప్రియురాలి నాశముచే కలిగిన దుఃఖముచేత రాజు ఇట్లనెను "నా ప్రియురాలిని చంపినవి గనుక మండూకము లన్నింటిని వధించి తీరెదను. నేను క్షమించను. నన్ను అడ్డగించకుము". అది విని మండూక రాజు, మహారాజా! ప్రసన్నుడవు కమ్ము. నా పేరు 'ఆయువు'. నేను మండూకములకు అధిపతిని. నీ ప్రియురాలు నా కూతురే. ఆమె పేరు 'సుశోభన'. ఆమె నిన్ను విడిచిపోవుట చాలతప్పు. ఈ విధముగానే పూర్వముగూడ ఆమె అనేకరాజులను వంచించి నది."అని చెప్పెను. ఆ మాట విని రాజు, 'ఆమెను నేను కోరుచున్నాను. తెచ్చియిమ్ము.' అనెను. వెంటనే మండూకరాజు పుత్రిని తెచ్చి రాజునకు సమర్పించి 'రాజునకు పరిచర్య చేయుము' అని కూతునకు ఆజ్ఞాపించెను. కూతురుపై చాలకోపముగలవాడై మండూకరాజు 'ఓసీ! నీవు అనేక రాజులను మోసము చేసితివి. కనుక నీ సంతానము బ్రాహ్మణ విరోధియగుగాక, అని శాపమిచ్చి 'నీ అసత్యవాదిత్వమునకు ఇదియే నీకు దండనము' అని చెప్పి వెడలిపోయెను.

ఆ తరువాత రాజు ఆమెను గైకొని యామెతో ననేక విధములగు కామోపభోగములను అనుభవించి ఆమెయందు ముగ్గురు పుత్రులను గనెను. వారి పేర్లు 'శల—దల—బల'అని. జ్యేష్ఠుడగు శలుని, రాజ్యమునందు అభిషిక్తుని జేసి రాజు తపస్సుకై వనమునకు పోయెను.

ఒక నాడు శలుడు వేటకై పోయి ఒక మృగమును తరిమెను. 'రథమును వేగముగా తోలు'మని సారథికి చెప్పెను. 'ఈ పట్టుదల తగదు. నీ గుఱ్ఱములు మృగమును అందుకొన జాలవు. 'వామ్య' అను పేరుగల అశ్వములైనచో ఈ మృగమును త్వరగా వెన్నాడ గలవు. అప్పుడు నీవు సులభముగా మృగమును పట్టుకొనగలవు.' అని సారథి చెప్పెను. 'వామ్యములు' ఎచ్చట నున్నవి చెప్పుము. చెప్పకున్నచో నిన్ను చంపెదను.' అని రాజు అనెను. ఆ మాటవిని సారథి 'వామ్యములున్నచోటు చెప్పినచో వామదేవముని కోపించి నాకు శాపమిచ్చును. చెప్పకున్నచో ఈ రాజు నన్ను చంపును' అని ఏమియు చెప్పక ఊరకుండెను. అప్పుడు రాజు ఖడ్గముచూపి 'నిన్ను చంపెద' ననెను. సారథి భయపడి 'మనో వేగముగల వామ్యములు అను అశ్వములు వామ దేవ ముని వద్ద ఉన్నవి.' అని చెప్పెను. అప్పుడు వామదేవాశ్రమము నకు శలుడు పోయి వామ్యములిమ్మని కోరెను. 'ఇచ్చెదను కాని నీ పని అయిన పిదప నా వామ్యాశ్వములను తిరిగి నాకు ఇవ్వ వలెను ' అని వామదేవముని చెప్పెను. ఆ మాటకు అంగీకరించి శలుడు వామదేవుని నుండి వామ్యములను తీసికొనిపోయి వాటిని తన రథమునకు కట్టి క్షణములో మృగమును తరిమి పట్టుకొని సారథితో 'ఈ అశ్వరత్నములు బ్రాహ్మణుల వద్ద ఉండదగవు. కనుక వామదేవునకు తిరిగి యివ్వనక్కరలేదు.' అని చెప్పి తన పట్టణమునకు పోయి వామ్యాశ్వములను అంతఃపురములో కట్టి యుంచుకొనెను.

అచట వామదేవముని 'యువకుడగు రాజపుత్రుడు శ్రేష్ఠము లగు నా యశ్వములను తీసికొనిపోయి తిరిగి నాకు ఈయకున్నాడే' యని చింతించి బాధపడెను. ఒక నెల వేచియుండి ఆత్రేయుడు అను తన శిష్యుని రాజుకడకు ' నీ పని ముగిసినచో గుఱ్ఱములను తిరిగి పంపుము ' అను సందేశముతో పంపెను. శిష్యుడు పోయి రాజునడిగెను. రాజు 'ఈ ఉత్తమాశ్వములు రాజులకు తగినవే కాని బ్రాహ్మణులు వీటికి అర్హులుకారు కనుక నేనీయను. వెడలి పొమ్ము.' అని శిష్యుని ఊరకే పంపెను. ఆత్రేయుడు పోయి వామదేవున కాసంగతి తెలిపెను. ఆ ముని కోపపడి స్వయముగానే రాజుకడకు పోయి యడిగెను. 'అశ్వములనీయ' నని రాజనెను. ఇరువురికి ఇట్లు సంవాదము జరిగెను.

వామ :— రాజా! నీవు ఈ యశ్వములతో అసాధ్యమగుకార్యమును నెరవేర్చికొంటివి. ఇక వీనిని తిరిగి నాకిమ్ము. లేకున్న నిన్ను వరుణుడు పాశములతో బంధించును.

రాజు :— మునీశ్వరా! ఇదుగో ఈ యెద్దులు చక్కగా బలిసి యున్నవి. వీనిని నీవు తీసికొనిపొమ్ము. బ్రాహ్మణులకు తగిన వాహనములు వృషభములే యగును, వీనిని బండికి కట్టుకొని యథేచ్ఛగా సంచరింపుము. నీ బరువును మోయుటకు వేదములు ఉండనే ఉన్నవి కదా!

వామ :— రాజా! వేదములు అందరి భారమును వహించుటకు ఉండనే యున్నవి. కాని అవి పరలోకములో మా వంటి వారి బరువును మోయగలవు. ఈ లోకములో మావంటి వారందరి బరువును ఇటువంటి వాహనములే మోయ గలవు గనుక వీనిని నాకు ఇమ్ము.

రాజు :— బ్రాహ్మణా! నీభారమును ఈ లోకములో మోయుటకు నాలుగు మంచి గాడిదలుగాని, కంచర గాడిదలనుగాని, లేక వాయువేగముగల మంచి యశ్వములను గాని యిచ్చెదను. ఈ వామ్యాశ్వములు క్షత్రియులకే తగి యున్నవి కాని నీవంటి బ్రాహ్మణులకు తగవు కనుక నేనీయను.

వామ :— "రాజా! బ్రాహ్మణుని యీ యశ్వధనమును అపహరింప దలచి నీవు మహాఘోర పాపమును చేయు చున్నావు సుమా! ఈ యశ్వములను నాకు తిరిగి యీయనిచో క్రూర కర్మలగు నలుగురు భయంకర రాక్షసులు శూలములతో నిన్ను నాలుగు ముక్కలుగా ఖండించి వేయుదురు."

రాజు :— మునీశ్వరా! నీవు బ్రాహ్మణుడవై యుండి కూడ నన్ను మనోవాక్కాయములతో సంహరింప జూచు చున్నావు. ఈ సంగతి నా సేవకులకు తెలిసినచో నిన్ను శిష్యులతో సహితముగా త్రిశూలములచేత ఇప్పుడే ఖండించెదరు. జాగ్రత్త సుమా?

వామ:— రాజా! 'తిరిగి నాకు ఇచ్చెద' నని యీ వామ్యాశ్వములను తీసుకొని పోయి నాకు ఈయక అసత్యవాదివైతివి. నీవు బ్రతుకదలచితివేని వెంటనే నాకు వీనిని ఇమ్ము.

రాజు:— మునీశ్వరా! ఈ గుఱ్ఱములు వేటకు ఉపయోగపడును. బ్రాహ్మణులు వేటాడరు గనుక వీనితో నీకు అక్కర లేదు. నీవు అసత్యవాదివి. ఐనను నిన్ను నేను దండించను. నేటినుండి నీ యాజ్ఞలో మెలగుచుండి పుణ్యలోకములకు పోయెదను. కాని ఈ యశ్వములను మాత్రము నీకు తిరిగి ఈయను.

వామ:— మనస్సు—వాక్కు—కాయము ఈ మూడింటిచేత విధింపబడు ఆజ్ఞగాని దండనముగాని బ్రాహ్మణునిపైన పనికిరావు. ఈ సత్యమును తెలుసుకొని యెవడు బ్రాహ్మణులను అనుసరించి క్లేశమును సహించియైనను వారికి సేవచేయునో అతడు లోకములో శ్రేష్ఠుడై సుఖముగా జీవించును.

యుధిష్ఠిర మహారాజా! వామదేవముని యిట్లనుచుండగనే ఘోర రూపులగు రాక్షసులు వచ్చి శూలములతో శలమహారాజును చంపుచుండగా నారాజు బిగ్గరగా, "ఇక్ష్వాకు వంశస్థులు కాని, నా సేవకులు గాని, నన్ను విడిచినను విడుతురు గాక. నేను మాత్రము వామదేవుని యీ వామ్యాశ్వములను ఎప్పుడు గూడ అతనికి తిరిగి యీయను" అని అరచెను.

అట్లా రాజు అరచుచుండగనే అతనిని రాక్షసులు చంపి నేలపై పడవేసిరి. ఆ సంగతి తెలిసి యిక్ష్వాకు వంశపు క్షత్రియులు శలుని తమ్ముడగు దలుని రాజ్యాభిషిక్తుని జేసిరి. అప్పుడు వామదేవముని మరల దలుని యొద్దకుబోయి, "రాజా! బ్రాహ్మణుల వస్తువును తిరిగి వారికిచ్చుటయే ధర్మము. ఆధర్మమునుండి నిన్ను రక్షింపదలచుకొనినచో నా వామ్యాశ్వములను నాకు తిరిగి యిచ్చివేయుము" అనెను. ఆ మాటకు దలరాజు మిక్కిలి కోపించి తన సారథితో, "విషములో ముంచబడిన నా బాణమును దెమ్ము. దానితో నీ బ్రాహ్మణుని జంపెదను. ఇతనిని కుక్కలు కఱచి కఱచి తినుగాక" అనెను. అదివిని వామదేవుడిట్లనెను.


"రాజా! నీకు శ్యేనజిత్తు అనునొక పదేండ్ల వయస్సుగల కొడుకున్నాడు కదా. అతనియెడల నీకు చాల ప్రేమ యున్నది. ఈ విషబాణము అతనిని గొట్టి చంపును గాక". (వామదేవుడిట్లాజ్ఞనివ్వగనే యా బాణము ధనస్సునుండి విడిపోయి యంతఃపురములో నున్న రాజకుమారుని వధించెను. అదివిని దలుడిట్లనెను—"ఇక్ష్వాకు వంశక్షత్రియులారా! మీకు ప్రియము చేయుటకై నేడీ బ్రాహ్మణుని మథించి మథించి వధించెదను. మఱియొక బాణమును తెండు. నేడు నా పరాక్రమము చూడుడు" అదివిని వామదేవుడిట్లనెను. "రాజా! నీవు నన్ను చంపుటకుగాను తేదలచిన యీ బాణమును నీవు ధనస్సుకో నెక్కుపెట్టి విడువజాలవు సుమా." వెంటనే రాజు అశక్తుడై యిట్లనెను:— "రాజులారా! యిప్పుడు నేనీ బాణమును విడువజాలకున్నాను. వామదేవమునిని చంపవలెనను నుత్సాహము క్రమముగా తగ్గుచున్నది. కనుక ఈ మహాముని దీర్ఘాయుష్యముతో జీవించుగాక". అప్పుడు వామదేవుడు రాజుతో "రాజా! నీవీ బాణముతో నీ భార్యను స్పృశింపుము. నీకు బ్రహ్మహత్యాపాపము పోవును". అని చెప్పగనే రాజు అట్లే చేసెను అప్పుడారాణి వామదేవునితో "మునీశ్వరా! నేను ప్రతిదినమీక్రూరస్వభావుడైన భర్తను సేవించుచు మంచి మాటలు మాటాడుచుండుమని యితనికి ఉపదేశించుచు బ్రాహ్మణులను సేవించుచుండెదను. కనుక ఈనా సత్కర్మల ఫలముగా నాకు పుణ్యలోకములు ప్రాప్తించునట్లు వరమిమ్ము" అని యనెను. ఆ మాటకు వామదేవుడు "రాజకుమారీ! నీవలన నీ రాజకులము బ్రాహ్మణ కోపమునుండి రక్షింపబడెను. నీ యీ మంచిపనికి మెచ్చితిని. వరము కోరుము. ఇచ్చెదను. నీవు నీ బంధుజనుల కత్యంత హితురాలవుగా నుండి యీ ఇక్ష్వాకు రాజ్యమునేలుము" అని యనెను. ఆ మాటకు రాణి యిట్లనెను. "భగవన్! నా పతి నేటినుండి సమస్త పాపములనుండి విముక్తుడగుగాక. ఇతడు పుత్రులతోను బంధువులతోను సుఖముగా నుండునట్లాశీర్వదింపుము. ఇదియే నేను గోరు వరము".

రాణి మాటలువిని వామదేవమహాముని సంతుష్టుడై ఆమె కోరిన వరమునిచ్చెను. దలరాజు సంతుష్టుడై వామ్యాశ్వములను తిరిగి ఆ మునికి నమస్కారపూర్వకముగా నిచ్చివేసెను". అని మార్కండేయ మహాముని యుధిష్ఠిరునకు జెప్పెను.

ఇంద్ర బకమునుల సంవాదము

యుధిష్ఠిరుడు, మహర్షులు మార్కండేయునితో నిట్లనిరి:— "బ్రహ్మర్షీ! బకుడు ఎట్లు దీర్ఘాయుష్యము గలవాడయ్యెను?" మార్కండేయుడిట్లు బదులుచెప్పెను:— "రాజా! బకుడు మహాతపశ్శాలియు, దీర్ఘాయుష్మంతుడును నయ్యెను. పూర్వము దేవాసురుల యుద్ధము ముగియగానే యింద్రుడు త్రిలోకాధిపతియయ్యెను. అప్పుడు సమస్త ప్రపంచము సుభిక్షముగా నుండి ప్రజలు మహానందము ననుభవించుచుండిరి. ఇంద్రుడు ఐరావత గజమునెక్కి యొకనాడు సుభిక్షముగానున్న దేశమును చూచుటకు పోయెను. అంతటను తిరిగి ఆనందము ననుభవించి భూలోకమునకు పోయెను. అచ్చట సముద్రతీరమునందు రమ్యమగు ప్రదేశములోనున్న బకుని యాశ్రమమును చూచెను.

(సశేషము)



కరీంనగర్‌లో డిసెంబరు 30వ తేదీన ముఖ్యమంత్రి శ్రీ పి. వి. నరసింహారావు బహిరంగసభలో ప్రసంగించారు

నావికులకు మిఠాయి బహుమానం

విశాఖ పటణం జిల్లా కలెక్టరు శ్రీ యస్. యన్ ఆచంట చేసిన విజ్ఞప్తి ఫలితంగా, విశాఖ పట్టణంలోని స్వచ్ఛంద సంస్థలు మిఠాయి తినుబండారాలు సేకరించి కలెక్టరుకు అందజేశాయి

ఇవి నావికులకు పంచిపెట్టడం జరిగిందని కలెక్టరు తెలియ జేశారు.

నిరుద్యోగులైన ఇంజనీర్లకు ఉపాధికల్పన పథకం


విశాఖ పటణం జిల్లా పరిషత్తు, నిరుద్యోగులుగా వున్న ఇంజనీర్లకు సహాయపడే ఉద్దేశంతో వారికి కంట్రాక్టులు ఇవ్వడానికి ఒక పథకం రూపొందించింది

జిల్లా కలెక్టరు శ్రీ యస్. యన్ ఆచంట, జిల్లా పరిషత్తు ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు ఈ విషయంలో తగిన సూచనలు చేసూ జిల్లా అంతటా—ముఖ్యంగా, కంట్రాక్టర్ల కొరతగా వున్న గిరిజన ప్రాంతాలలో పనులను అమలు పరచడానికి నిరుద్యోగులైన ఇంజనీర్లకు కంట్రాక్టులు ఇవ్వాలని ఆదేశ మిచ్చారు.

జిల్లా పరిషత్తు కంట్రాక్టర్లుగా పని చేయదలచు కొన్నటు వంటి ఇంజనీరు రిజిస్టరు చేయించుకోవడానికి వారికి సహాయ పడ వలసిందని వాల్తేరులోని ఆంధ్ర యూనివర్సిటీలోని ఎంప్లాయ్ మెంటు ఆఫీసర్‌ను కోరడం జరిగింది. ఇంత వరకు ముగ్గురు ఇంజనీర్లు రిజిస్టరు చేయించుకొన్నారు. ముందు ముందు ఇంకా



మన నౌకాదళం ముంచివేసిన పాకిస్తాన్ సబ్‌మెరైన్ ఘాజి శిథిలాలను మొదటి సారి కనుగొన్న వైజాగ్ జాలర్లు శ్రీ అప్పయ్య, శ్రీ సత్యాలు గార్లకు డిసెంబరు 15న విశాఖపట్నంలో ఏర్పాటుచేసిన ఒక సమావేశంలో వైస్ అడ్మిరల్ శ్రీ ఎన్ కృష్ణన్ చెరొక రూ. 501 లను బహుమతిగా యిచ్చారు. ఈ మొత్తాన్ని వారు జాతీయ రక్షణ నిధికి విరాళంగా ఇచ్చివేశారు



కరీంనగర్‌లో డిసెంబరు 30న ముఖ్యమంత్రి శ్రీ పి. వి నరసింహారావు పంచాయతీరాజ్ సభ్యుల, అధికార్ల సభలో రక్షణ నిధికి తీసుకోవలసిన చర్యలను గురించి ప్రసంగించారు.

యెక్కువ మంది ఇంజనీర్లు జిల్లా పరిషత్తు కంట్రాక్టులు చేపట్ట గలరని కలెక్టరు ఆశాభావం వెల్లడించారు.

పశ్చిమ గోదావరి జిల్లాలో వ్యవసాయాభివృద్ధికి ప్రపంచబ్యాంకు ఋణం

పశ్చిమ గోదావరి జిల్లాలో వ్యవసాయాన్ని అభివృద్ధి పరచడానికి ఆంధ్ర బ్యాంకు, షెడ్యూల బ్యాంకుల ఏజెన్సీ ద్వారా ప్రపంచ బ్యాంకు నుంచి త్వరలోనే ఆర్థిక సహాయం లభిస్తుంది.

జిల్లా కలెక్టరు శ్రీ యస్ ఆర్. గోవిందరాజన్ డిసెంబరు 18వ తేదీన జంగారెడ్డి గూడెంలో ఆంధ్ర బ్యాంకు బ్రాంచి ఆఫీసుకు ప్రారంభోత్సవం జరుపుతూ ప్రపంచ బ్యాంకు నుంచి రూ 75 లక్షల ఆర్థిక సహాయం లభించ గలదని ఈ మొత్తాన్ని రైతులకు ఋణాలుగా ఇవ్వడం జరుగుతుందని తెలిపారు.

ఈ పథకం కింద రూ 60 లక్షల ఖర్చుతో కుమార దేవం పంపింగ్ స్కీము చేపట్ట బడుతుందని ఆయన అన్నారు రబ్బీ కాలంలో పొగాకు, ఇతర పంటలకు కూడా ఋణాలివ్వ వలసిన అవసరం గురించి ఆయన నొక్కి చెప్పారు

చింతల పూడి తాలూకాలోని రాఘవపురం గ్రూప్‌కు చెందిన గ్రామాలకు రాష్ట్రవిద్యుచ్ఛక్తి సంఘం విద్యుచ్ఛక్తి పథకాన్ని మంజూరు చేసింది ఈ పథకాన్ని అమలు పరచడానికై ఆంధ్ర బ్యాంకు ఋణ సహాయం చేయడానికి ముందుకు వచ్చిందని ఆయన తెలిపారు

తుమ్మూరు గడ్డ రిజర్వాయరు

విశాఖ పట్టణం జిల్లాలోని బక్కన్న పాలెం గ్రామం దగ్గర తుమ్మూరు గడ్డపై రిజర్వాయరును నిర్మించడానికి నిర్మాణం పనుల కొరకు రూ 4,36 000 లు ప్రత్యక్ష పరోక్ష ఖర్చులకు రూ 4,93,490 లను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది.


యాత్రాకేంద్రంగా కొల్లేరు

యాత్రా విషయాల శాఖా మంత్రి డా. సి హెచ్. దేవానంద రావు డిసెంబరు 21 వ తేదీన కొల్లేరును సందర్శించిన తరువాత శ్రీపరుగు గ్రామంలో జరిగిన ఒక బహిరంగ సభలో ప్రసంగిస్తూ మనోహర దృశ్యాలతో చూపరులకు ఆహ్లాదం కలిగిస్తున్న కొల్లేరు సరస్సు యాత్రా కేంద్రంగా అభివృద్ధి పరచ బడుతుందని చెప్పారు. ఇక్కడ యాత్రికులకు అన్ని సౌకర్యాలు కల్పించబడగలవన్న ఆశాభావం ఆయన వెల్లడించారు.

జిల్లా రెవిన్యూ ఆఫీసరు శ్రీ కె సత్యనారాయణ రావు ప్రసంగిస్తూ కొల్లేరు అభివృద్ధికై తీసుకోవలసిన చర్యలను గురించి చెప్పారు. శాసన సభ్యులు శ్రీ యం. వి వెంకట నారాయణ, పెద పాడు పంచాయితీ సమితి అధ్యక్షులు శ్రీ జి చిన్న కనకయ్య గారలు ప్రసంగిస్తూ కొల్లేరు అభివృద్ధికి సత్వర చర్యలు గైకొనాలని అభ్యర్థించారు.

వ్యవసాయ గోష్ఠి, ప్రదర్శన


వ్యవసాయ శాఖా మంత్రి శ్రీ కాకాని వెంకటరత్నం నవంబరు 28 న నల్లగొండలోని టౌను హాలులో వ్యవసాయ గోష్ఠి ప్రదర్శనకు ప్రారంభోత్సవం చేశారు ఈ సమావేశానికి జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య అధ్యక్షత వహించారు. మంత్రి తమ ప్రారంభోపన్యాసంలో వ్యవసాయ దారులు దేశీ విత్తనాలను మరిచి పోయి మేలు రకం విత్తనాలు, సంకర జాతి విత్తనాలు, జగన్నాథ.



ఇటీవలి 14 రోజుల భారత–పాకిస్తాన్ సంఘర్షణలో మన నౌకాదళం ముంచివేసిన పాకిస్తాన్ సబ్‌మెరైన్ 'ఘాజీ' శిధిలాలను చూపిస్తున్న వైస్ అడ్మిరల్ ఎస్. కృష్ణన్

జయ, కావేరి మొదలగునవి వాడాలని సలహా యిచ్చారు. నల్గొండ జిల్లాలో పొద్దు తిరుగుడు పూలు, మిరప తోటలు పెంచడం అవసరమని ఆయన సూచించారు.

జిల్లా కలెక్టరు శ్రీ కె. ఓబయ్య ప్రసంగిస్తూ, మేలు రకాల విత్తనాలను ఉపయోగించి క్రొత్త పద్ధతులను అనుసరించి పంటలు ఎక్కువగా పండించాలని వ్యవసాయదారులకు సలహా యిచ్చారు వచ్చే మూడు సంవత్సరాలలో స్వల్ప కాలిక, మధ్య కాలిక, దీర్ఘ కాలిక ఋణాలు సన్న కారు రైతుల అభివృద్ధి పథకం క్రింద రూ. 13 కోట్లు యివ్వబడుతుందని చెప్పారు. మెట్ట వ్యవసాయం గూర్చి పాడి పశువుల అభివృద్ధి పర్చవలసిన అవసరాన్ని గూర్చి ఆయన చెప్పారు.



తూర్పు భాగపు నౌకాదళం జనవరి 1న విశాఖపట్టణం మెయిన్ రోడ్డు మీదుగా విజయ కవాతు జరిపిన దృశ్యం.

జిల్లా పరిషత్తు అధ్యక్షులు శ్రీ కె. రంగారెడ్డి కూడా ప్రసంగించారు. మొక్కల సంరక్షణాధికారి శ్రీ కె. చక్రపాణి వందన సమర్పణ చేశారు.

ఏజన్సీ ఉత్పత్తి-మార్కెటింగు సంఘానికి ప్రారంభోత్సవం

గిరిజన సంక్షేమ శాఖామంత్రి శ్రీ కె. భీమారావు యిటీవల అసిఫాబాదులో వంకిడి ఏజన్సీ ఉత్పత్తి-సహకార మార్కెటింగు సొసైటీ కార్యాలయానికి ప్రారంభోత్సవం జరుపుతూ గ్రామస్థుల అవసరాలను తీర్చడానికి కృషిచేయ గలనని హామీ యిచ్చారు.


విశాఖ పట్నం లోని గిరిజన సహకార కార్పొరేషన్ మేనేజింగ్ డైరెక్టరు శ్రీ వి. చంద్రమౌళి ప్రసంగిస్తూ ఈ కార్పొరేషన్ చేపట్టిన పథకాలను అమలుపర్చే విషయంలో సహకరించవలసినదని ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

వంకిడి సమితి అధ్యక్షులు శ్రీ టి. తిరుపతి, అసిఫాబాదు అధ్యక్షులు శ్రీ రామచంద్రరావు అన్నాజి, అసిఫాబాదు సబ్-కలెక్టరు శ్రీ పి. సి. ఫారక్ గారలు కూడా ప్రసంగిస్తూ ఈ సొసైటీ అధ్యక్షులు గ్రామీణుల సంపాదించడానికి పథకాలను అమలుపర్చడానికి చేస్తున్న కృషిని వివరించి చెప్పారు. ఈ ప్రారంభోత్సవ కార్యక్రమానికి జిల్లా రెవిన్యూ ఆఫీసరు శ్రీ వి. చాంగ్‌సన్, ఆదిలాబాదులోని డివిజినల్ జనరల్ మేనేజరు, శాసనమండలి సభ్యులు శ్రీ ముకాసిర్‌షా హాజరైనారు. మంత్రి ఖూరుదా, సోంగామ్ వెంకులం గ్రామాలలో హరిజన నివేశన స్థలాల పథకం, రోడ్డు పనులు, త్రాగునీటి సౌకర్యాలు, పట్టాల కేటాయింపు కార్యక్రమాల ప్రగతిని పరిశీలన చేశారు.


ఎడేపల్లి గ్రామానికి విద్యుచ్ఛక్తి

సమాచార, పౌరసంబంధ శాఖామంత్రి శ్రీ ఎ. వాసుదేవరావు డిసెంబరు 31న వరంగల్ జిల్లా, కొడకండ్లబ్లాక్‌లోని ఎడేపల్లి గ్రామంలో విద్యుచ్ఛక్తి సరఫరా ప్రారంభోత్సవ కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. ఆయన ఈ సందర్భంలో ప్రసంగిస్తూ సంఘంలో ఆర్థిక అసమానత్వాలను తొలగించడానికి ప్రభుత్వంవారు నిర్ణయం తీసుకొన్నారని తెలిపారు. కేంద్రప్రభుత్వంలో శ్రీమతి ఇందిరాగాంధి నాయకత్వాన, రాష్ట్రప్రభుత్వంలో శ్రీ పి. వి. నరసింహారావు నాయకత్వాన, ముఖ్యంగా బలహీన వర్గాలవారిని అభివృద్ధి పర్చడానికి వివిధ రకములైన సంక్షేమ కార్యక్రమాలను చేపట్టారని తెలిపారు. ప్రభుత్వం వివిధ చట్టాల క్రింద బీదప్రజల ఆర్థిక స్తోమతను పెంపొందించడానికి తగిన చర్యలు తీసుకొంటున్నదని ఆయన తెలిపారు. ప్రభుత్వం చేపట్టిన ఈ కార్యక్రమంలో ప్రభుత్వానికి సంపూర్ణ సహకారం యివ్వాలని ఆయన ప్రజలకు ఉద్బోధించారు.

విద్యుచ్ఛక్తి శాఖామంత్రి శ్రీ వి. కృష్ణమూర్తి నాయుడు, విద్యుచ్ఛక్తి సరఫరాకు ప్రారంభోత్సవం చేస్తూ గ్రామీణ విద్యుచ్ఛక్తి చాలవరకు మంచి అభివృద్ధి చెందిందని చెప్పారు విద్యుచ్ఛక్తిని తగువిధముగా ఉపయోగించుకొని తమ ఆర్థిక పరిస్థితులను మెరుగు



వైజాగ్ పురపాలకసంఘం అధ్యక్షుడు శ్రీ జి.వి. రమణ జనవరి 1వ తేదీన తూర్పు నౌకాదళ విభాగాధిపతి ఫ్లాగ్ ఆఫీసర్ వైస్ అడ్మిరల్ ఎస్. కృష్ణన్‌కు పౌరసన్మానం జరిపినప్పటి చిత్రం



భద్రాచలంవద్ద గోదావరి నదిమీద డిశంబరు 12న తెప్పోత్సవం జరిపినప్పటి చిత్రం.

పరుచుకోవాలని ఆయన ప్రజలను కోరారు శ్రీ ఎన్. యతిరాజా రావు, మంత్రిగారికి స్వాగతం చెప్పారు. ఈ సందర్భంలో ఏర్పాటైన సభలో శాసన సభ్యురాలు శ్రీమతి విమలాదేవి, శ్రీ సోమనరసింహారెడ్డి, శ్రీ భాస్కరరెడ్డి గారలు కూడా ప్రసంగించారు.

కైకలూరులో కార్మిక వార్డుకు ప్రారంభోత్సవం

కృష్ణా జిల్లా కలెక్టరు శ్రీ పి. శ్రీనివాస శాస్త్రి డిసెంబరు 2న కైకలూరు లోని ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మిక వార్డుకు ప్రారంభోత్సవం చేశారు. ఈ వార్డును నిర్మించడానికి అయ్యే ఖర్చును జిల్లా సంక్షేమ నిధినుండి మంజూరు చేశారు. ఈ సందర్భంలో కలెక్టరు ప్రసంగిస్తూ ప్రజలనుండి రూ. 35,000 లు విరాళాలు సేకరించి అదనంగా 20 పడకలుగల వార్డును ఏర్పాటు చేయడం జరుగుతుందని హామీ యిచ్చారు. ఈ సమావేశానికి జిల్లా పరిషత్తు అధ్యక్షుడు శ్రీ పి. కోటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఆయన ప్రసంగిస్తూ కైకలూరు తాలుకాలోని వెనుక బడిన ప్రాంతాలను అభివృద్ధి పరచడానికి కావలసిన నిధులను కేటాయించాలని జిల్లా కలెక్టరును కోరారు. కైకలూరు పంచాయతీ సమితి అధ్యక్షుడు శ్రీ ఎం. వి. నరసింహారాజు ప్రసంగిస్తూ అదనంగా 20 పడకలు కలిగిన వార్డును నెలకొల్పడానికి కావలసిన ఆర్థిక సహాయం జిల్లా సంక్షేమ నిధినుండి చేయాలని కలెక్టరును కోరారు.

వైకుంఠపురం లిఫ్టు ఇరిగేషన్ పథకం


సమాచార, పౌర సంబంధ, చిన్నతరహా నీటి పారుదల శాఖా మంత్రి శ్రీ పి. వాసుదేవరావు రాయపురిలో ప్రసంగిస్తూ, వైకుంఠపురం లిఫ్టు ఇరిగేషన్ పథకంలో మొదటి దశలో ఏర్పడిన కొన్ని లోపాలను వచ్చే సంవత్సరంలో సరిదిద్దడం జరుగుతుందని చెప్పారు.

ఈ సందర్భంలో ఏర్పాటైన సభకు చెఱకు సంఘం అధ్యక్షుడు శ్రీ పద్మారావు అధ్యక్షత వహించారు. రాయపూడి పంచాయతీ సమితి అధ్యక్షులు శ్రీ శ్రీనాధచౌదరి, మంత్రికి సన్మాన పత్రం సమర్పించారు. రాయపూడి, దాని పరిసర గ్రామాల అవసరాలను గురించి శాసన సభ్యులు శ్రీ రత్తయ్య, తాడికొండ సమితి అధ్యక్షులు శ్రీ అప్పారావు ప్రసంగించారు. మందడంలో డ్రైనేజి కాలవ నిర్మాణం జరగాలని శ్రీ శ్రీనాధచౌదరి మంత్రిని అభ్యర్థించారు. వైకుంఠపురం లిఫ్టు ఇరిగేషన్ పథకం రెండవ దశ నిర్మాణానికి ఆర్థిక సహాయం చేయబడుతుందని, గ్రామస్థుల సహకారంతో భూమి సేకరణ కార్యక్రమం పూర్తి అయిన తర్వాత మందడంలో మురుగు కాలవ నిర్మాణం జరుగుతుందని మంత్రి శ్రీ వాసుదేవరావు హామీ యిచ్చారు కృష్ణయ్య పాలెంలో లిఫ్టు ఇరిగేషను పంపింగు పథకం చేపట్టడం జరుగుతుందని మంత్రి ఆ గ్రామ ప్రజలకు హామీ యిచ్చారు. మల్కాపురం తదితర గ్రామాలను కూడా ఆయన సందర్శించారు

కడపలో అరవిందుని అస్థికల ప్రతిష్ఠాపన

కడపలో డిసెంబరు 5వ తేదీన అరవింద మహర్షి అస్థికలు వేద పఠనం మధ్య శాస్త్రోక్తంగా ప్రతిష్ఠాపించ బడినాయి. కీ. శే. డా. ఎ. లక్ష్మీనర్సయ్య అరవింద ఆశ్రమం నిర్మించడానికి 4 ఎకరాల భూమిని భూరి విరాళంగా యిచ్చారు. 1950 లో ఆయన శ్రీ అరవింద సమాజాన్ని స్థాపించారు. ఆంధ్రప్రదేశ్‌లో అరవింద మఠం వ్యవస్థాపకులలో ముఖ్యులైన శ్రీ కామేశ్వరరావు గారు అస్థికలను ప్రతిష్ఠాపించారు పుదుచ్చేరిలోని శ్రీ అరవింద సొసైటీ కార్యదర్శి శ్రీ నవజాత ఈ ప్రతిష్ఠాపనోత్సవానికి హాజరయ్యారు.


ఆంధ్రప్రదేశ్ అరవింద సొసైటీ అధ్యక్షులు శ్రీ కె. డి. శాండిల్య ఈ సందర్భంలో కడపకు వచ్చారు, తాడిపత్రి, అనంతపురం, గుంతకల్లు, హైదరాబాదు, బళ్లారి, మహబూబునగరం,



నెల్లూరులోని జిల్లాపరిషత్తు హాలులో డిసెంబరు 9న మధ్యతరహా నీటిపారుదల మంత్రి శ్రీ పి. బసిరెడ్డి, జిల్లాలోని నీటిపారుదల పథకాల అమలు తీరును చర్చించడానికై ఏర్పాటైన సమావేశంలో ప్రసంగించారు.

మహబూబాబాదు, ప్రొద్దుటూరునుంచి చాలామంది భక్తులు కూడా యిక్కడికి వచ్చారు.

రాష్ట్రంలో శ్రీ అరవిందుని అస్థికలు ప్రప్రథమంగా మాతృశ్రీ ఆశీర్వాదంతో ప్రొద్దుటూరు ఆశ్రమంలో ప్రతిష్ఠాపన చేయబడినాయి. దేశంలో యిది 6 వ ఆశ్రమం. ప్రతిష్ఠాపనోత్సవం జరిగిన తరువాత, ఆశ్రమంలో ధ్యానమందిర నిర్మాణానికి శ్రీ నవజాత శంకుస్థాపన చేశారు.



కరీంనగర్‌లో డిసెంబరు 17న దేశరక్షణ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఊరేగింపు దృశ్యం. దీనిలో విద్యార్థులు, వ్యాపారస్తులు, న్యాయవాదులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులున్నారు.

శ్రీ నవజాత ప్రసంగిస్తూ, మాతృశ్రీ ప్రొద్దుటూరును అనుగ్రహించి, ఆశీర్వాదం చేశారనీ, వారి అనుగ్రహానికి అర్హులయ్యే విధంగా ప్రజలు ప్రవర్తించాలని ఉద్బోధించారు.

ఉస్మానియా విశ్వ విద్యాలయంలో ఫిలాసఫీ ప్రొఫెసరు డా. వి. మధుసూదన రెడ్డి ప్రసంగిస్తూ, ప్రస్తుత పరిస్థితులలో శ్రీ అరవింద మతం యొక్క ప్రాముఖ్యతను గురించి చెప్పారు. "ఇప్పుడు ఇక్కడ జరిగిన అస్థికల ప్రతిష్ఠాపన అమరత్వానికి చిహ్నం. ప్రస్తుత జాతీయ అత్యయిక పరిస్థితిలో, అంతిమ జయం భారత దేశానికే లభిస్తుంది శ్రీ అరవిందులు కల్కి అవతారం. ఆయన అనుగ్రహం ఆశీర్వాదముల ఫలితంగా, భారత దేశ ప్రజలు సత్యాన్ని చాటుతున్నారు" అని ఆయన చెప్పారు.

మాతృశ్రీ ప్రార్థనతో కార్యక్రమం ఆరంభమైంది. అస్థికలు వచ్చిన తర్వాత, ఆశ్రమ పతాకాన్ని ప్రతిష్ఠాపించారు.


ఆహ్వాన సంఘాధ్యక్షులు శ్రీ ఇ. వెంకటసుబ్బయ్య అతిథులకు స్వాగతం చెప్పారు. డా. మధుసూదన రెడ్డి ప్రత్యేకసంచికను ఆవిష్కరించారు. శ్రీ అరవిందుని అస్తికలు కారులో ఆశ్రమం వరకు ఊరేగింపు తీయబడినాయి.

మిడిగెట్ ఎలక్ట్రోడ్స్ ఉత్పత్తి


ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సిఫారసును అనుసరించి ఆంధ్రప్రదేశ్‌లో సంవత్సరానికి 250 మిలియన్ల మిడిగెట్ ఎలక్ట్రోడ్స్‌ను ఉత్పత్తి చేయడానికి మద్రాసు వాస్తవ్యుడైన శ్రీ పి. ఓబులరెడ్డికి కేంద్రప్రభుత్వం అనుమతి యిచ్చింది. ఈ పరిశ్రమను నెలకొల్పడానికి రూ. 70 లక్షలు పెట్టుబడి అవసర మవుతుందనీ యీ సంస్థలో సుమారు 62 మందికి జీవనోపాధి లభిస్తుందనీ అంచనా వేయబడింది.

గన్నవరంలో క్రొత్త పరిశ్రమల స్థాపన

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చేసిన సిఫారసును పురస్కరించుకొని కేంద్ర ప్రభుత్వం కృష్ణా జిల్లాలోని గన్నవరంలో, హైడ్రాలిక్ కేన్సు, సెల్ఫ్ ప్రొపెల్డ్ హైడ్రాలిక్ కేన్సు ఉత్పత్తి చేయడానికి శ్రీ భావరాజు భగవాన్ దాస్‌కు అనుమతి యిచ్చింది. రూ. 50 లక్షల పెట్టుబడి మూల ధనంతో క్రొత్తగా యీ పరిశ్రమలు ఏర్పాటు చేయబడతాయి. వీటిలో 317 మందికి ఉద్యోగావకాశాలు లభిస్తాయి.




కరీంనగర్‌లో నవంబరు 24న జరిగిన స్కౌట్స్ అండ్ గైడ్స్ సమ్మేళనానికి ఆదిలాబాదు జిల్లా కలెక్టరు మహ్మద్ జియా ఉద్దీన్ ప్రారంభోత్సవం చేశారు. ఈ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న శ్రీ వి.ఎన్. భండారీ.



అంతర్జాతీయ మార్కెట్లలో నిత్యమూ వచ్చే గిరాకీలో మార్పులిన్ని దృష్టిలో వుంచుకుని స్పర్థకు తట్టుకోవాలంటే, భారతీయ పొగాకు ఉత్పత్తి దానికి తగిన పద్ధతిలో ఉండితీరాలి. దీన్ని సాధించాలంటే, క్రొత్త తీరు తెన్నులు గలిగి భౌగోళీయ స్థితికి అనువైన పొగాకును సృష్టించటం, యింకా క్రొత్త ప్రాంతాలలో పొగాకు పంటను సాగుచేసే విషయంలోనూ నిరంతరం పరిశోధన చెయ్యవలసిన అవశ్యకత ఎంతైనా వుంది.

40 ఏళ్ళ క్రితమే ఒక పరిపూర్ణమైన పరిశోధనా వికాస కేంద్రాన్ని స్థాపించిన పొగాకు కంపెనీ ఒక్క ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ వారు మాత్రమే. పొగాకు పంటను గూర్చిన సమగ్ర పరిశోధన చేసే నిమిత్తం యిపడు 16 లక్షల రూపాయలు ఖర్చుపెట్టబడుతోంది. ఎటువంటి సిగరెట్ల రకాల వైపు ప్రజలు మొగ్గుతున్నారో, ఆసక్తి చూపిస్తున్నారో, ప్యాకేజింగ్, యింకా యితర అంశాల్ని గూర్చిన పరిశోధన ఐ ఎల్ టీ డి వారి అనుబంధ సంస్థ అయిన ఇండియా టొబాకో కంపెనీ లిమిటెడ్ వారు చేస్తున్నారు.

నిపుణులైన శాస్త్రజ్ఞులూ, వ్యవసాయ శాస్త్రజ్ఞులతో వున్న ఐ ఎల్ టీ డి. వారి పరిశోధనా కేంద్రం సగర్వంగా చెప్పుకోగల అనేక విషయాల్ని సాధించింది. ప్రపంచపు పొగాకు గిరాకీలో వస్తున్న మార్పుల ప్రకారం క్రొత్త రకాల్ని సృష్టించటం దగ్గరనుంచీ శాస్త్రీయంగా పొగాకు పండించటంలో రైతులకు సహాయపడటం వరకూ. మేలు రకపు పంటా, అధిక ఉత్పత్తీ ద్వారా రైతుకు లాభం చేకూరుతోంది. తద్వారా రైతు జీవన ప్రమాణంలో పెరుగుదల కలిగింది.



ఐ ఎల్ టి డి వారి దృష్టిలో,
పరిశోధన అంటే పొగాకు
యొక్క సంపూర్ణ వికాసం
అన్నమాట.

ఇండియన్ లీఫ్ టొబాకో డెవలప్‌మెంట్ కంపెనీ లిమిటెడ్

U-II-C-2 TEL

PUBLISHED BY THE DIRECTOR OF INFORMATION, PUBLIC RELATIONS & TOURISM, ANDHRA PRADESH HYDERABAD.
PRINTED BY THE DIRECTOR OF PRINTING, GOVERNMENT OF ANDHRA PRADESH, AT THE GOVERNMENT CENTRAL PRESS, HYDERABAD

ఆంధ్రప్రదేశ్ గురించి

* 1971 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్ జనాభా భారతదేశ జనాభాలో 7.93 శాతానికి, ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం భారతదేశ విస్తీర్ణంలో 9 శాతానికి సమానం.

* ఆంధ్రప్రదేశ్ విస్తీర్ణం 2.75,109 చ. కి. మీటర్లు.

* 1971 లో సేకరించిన లెక్కల ప్రకారం. ఆంధ్రప్రదేశ్ జనాభా 4,33,94,951 మంది. దేశజనాభా 54,69,55,945.

* 1971 లెక్కల ప్రకారం, రాష్ట్ర జనాభాలో అక్షరాస్యులు 24.56 శాతం మంది వున్నారు. 1961 లో 21.19 శాతం. భారతదేశం మొత్తంమీద వున్న అక్షరాస్యుల శాతం 1971 లో 29.35. 1961లో 24.03 శాతం.


* మన రాష్ట్రంలో జనాభా సాంద్రత చ. కి. మీ. 1కి 157 మంది హైదరాబాదు జిల్లాలో సాంద్రత చ. కి. మీ. 1కి, 362. అన్ని జిల్లాల కంటే యిది ఎక్కువ. అదిలాబాద్ జిల్లాలో జనాభా సాంద్రత 79 మంది. అన్నింటి కంటే యిది తక్కువ.

* రాష్ట్రంలో తలసరి సగటు ఆదాయం (1960-61 నాటి ధరలు) మొదటి ప్రణాళిక అంతానికి రూ. 281లు, రెండవ ప్రణాళిక అంతానికి రూ. 306లు, మూడవ ప్రణాళిక అంతానికి రూ. 333 ల చొప్పున ఉంది. నాలుగవ ప్రణాళిక ముగింపు నాటికి తలసరి సగటు ఆదాయం రూ. 430 లకు పెరుగుతుంది.

* రాష్ట్రంలో 1,000 అడుగుల లోతు మేరలో సుమారు 1,000 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు వున్నాయి. 2,000 అడుగుల లోతు మేరలో 1,320 మిలియన్ టన్నుల బొగ్గు నిక్షేపాలు లభించగలవని అంచనా.

* భారతదేశంలో, బారైట్స్ ఉత్పత్తిలో ఆంధ్రప్రదేశ్ దే అగ్రస్థానం. దేశంలో ఉత్పత్తి అయ్యే బారైట్స్‌లో 90 శాతం మొదలు 95 శాతం వరకు రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్నది.

* అభ్రకం ఉత్పత్తిలో బీహారు, రాజస్థాన్ రాష్ట్రాల తరువాతి స్థానం ఆంధ్రప్రదేశ్ ది.



Reg. No. H. 133